


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 195

గురువారం 5-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

తెలంగాణ రాష్ట్రం సుసంపన్నమైంది
తెలంగాణ ప్రజల స్వప్నం సాకారమైంది



ఇదే మన తెలంగాణ



మహానగరాన్ని సంకల్పించాం

విశ్వనగరాన్ని నిర్మించాం



తెలంగాణ ప్రగతి పథంలో పయనిస్తున్నది. రాష్ట్ర ప్రగతితోనే తెలంగాణ ప్రజల అభివృద్ధి సాధ్యమని మనసా, వాచా, కర్మణా నమ్మి నడిచింది తెలంగాణ ప్రభుత్వం. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన స్వరాష్ట్ర పోరాట సారథి, ప్రియతమ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారి ముందుచూపే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష.

తెలంగాణ మారుమూల పల్లెలను కూడా రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేయాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో పెట్టింది. రహదారులు, మౌలిక వసతుల కల్పనతో నగర ప్రజల ఆశలకు రెక్కలు తొడిగింది.

సమగ్ర, సమ్మిళిత, సమీకృత, సమతుల్య అభివృద్ధే అంతిమ లక్ష్యంగా, మానవతా విలువలతో పాలన కొనసాగిస్తున్నాం.

అదే స్ఫూర్తితో, అవే విలువలతో నాలుగు వందల యేండ్ల చరిత్ర గల హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుకున్నాం.

తెలంగాణ రాష్ట్రం సుసంపన్నమైంది
తెలంగాణ ప్రజల స్వప్నం సాకారమైంది

జారీ చేసినవారు : స్పెషల్ కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

భావితరాల భాగ్యప్రదాతగా పురోగమిస్తున్నది మన హైదరాబాద్



ఇదే మన తెలంగాణ



మహానగరంలో మరింత సాఫీగా ప్రయాణం

అభివృద్ధికి ఆనవాళ్ళుగా రహదారులు

- వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి) కింద 36 ప్రాజెక్టుల పూర్తి (ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్వోబీలు, ఆర్యూబీలు)
- అంతర్జాతీయ ప్రమాణాలతో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి
- ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి కొత్త లింక్ రోడ్లు.. మూసీ నదిపై 15 వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన



నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

హైదరాబాద్ మెట్రోరైలు

- దేశంలోనే రెండవ అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ
- మెట్రోరైలులో రోజూ 5 లక్షల మంది ప్రయాణం
- మూడు కారిడార్లలో 69 కిలో మీటర్ల లైను
- రాయదుర్గం నుంచి విమానాశ్రయానికి మెట్రోరైలు విస్తరణ పనులు ప్రారంభం
- 400 కిలోమీటర్ల మేరకు విస్తరణ ప్రణాళికలు



అధునాతన పోలీసు వ్యవస్థ

ప్రజాభద్రతే మన ప్రభుత్వ ప్రాధాన్యత

- రాష్ట్ర ప్రజల భద్రత కోసం సమీకృత నిఘా వ్యవస్థగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) నిర్మాణం
- సర్వహంగులతో హైదరాబాద్ కమిషనరేట్
- విపత్తుల సమయంలో ఇతర శాఖలతో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సమన్వయం



ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు

అర్బన్ మిషన్ భగీరథ

- హైదరాబాద్ త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు 62 రిజర్వాయర్లు, 2,100 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం
- నగరానికి నిరంతర నీటిసరఫరాకు నాగార్జునసాగర్ వద్ద సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్ట్ నిర్మాణం
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా జంట నగరాలకు త్రాగునీరు
- ప్రతి ఇంటికి ఉచితంగా 20,000 లీటర్ల త్రాగునీటి సరఫరా





పెట్టుబడులకు స్వర్గధామం

తెలంగాణ పారిశ్రామిక ప్రగతి TS ఐ-పాస్

- టీఎస్ఐపాస్ - పరిశ్రమల అనుమతులకి సింగిల్ విండో విధానం
- 24,000 పరిశ్రమలకు అనుమతులు
- రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడుల రాక
- 9 జిల్లాలలో 109 పారిశ్రామిక వాడలు, ఆహార శుద్ధి మండలాలు
- 2014 లో రూ. 57, 258 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతుల విలువ 2023 నాటికి రూ. 2,41,275 కోట్లు



ప్రతి పౌరుడికి రక్షణ, రాష్ట్రంలో సుస్థిర శాంతి

ప్రశాంత హైదరాబాద్ నగరం

- హైదరాబాద్ నగర మహిళల భద్రత కోసం 100 షీ టీమ్స్
- మహిళలు, పిల్లలపై లైంగిక, భౌతికదాడులను అరికట్టేందుకు భరోసా సహాయక కేంద్రాలు
- పోలీసులకు ఆధునిక వసతులు, శిక్షణ
- గత 9 ఏండ్లలో కర్ఫ్యూ, మత ఘర్షణలు అన్న మాటలు వినిపించని పాలన
- రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిర్వహణ, షీ టీమ్స్, భరోసాకేంద్రాలు, CCTV ప్రాజెక్టులకు ప్రతిష్ఠాత్మక SKOCH అవార్డులు



స్వచ్ఛ హైదరాబాద్

హైదరాబాద్ మురుగుకు శాశ్వత పరిష్కారం

- 100 శాతం మురుగు శుద్ధి వసతి కలిగిన నగరం కానున్న హైదరాబాద్
- 1,259 MLD సామర్థ్యం గల 31 మురుగు శుద్ధి ప్లాంట్లు నిర్మించనున్న హైదరాబాద్ జలమండలి
- నగరంలో పరిశుభ్రత కోసం వివిధ ప్రాజెక్టుల అమలు



ఆవిష్కరణల గమ్యస్థానం

అంకుర సంస్థల రాజధాని హైదరాబాద్

- టీ హబ్, టీఎస్ఐసీ, వీ హబ్, టీ వర్క్స్, రిచ్ మరియు టాస్క్ వంటి సంస్థల ఏర్పాటుతో పటిష్ఠ ఆవిష్కరణల వ్యవస్థ
- సిద్ధమవుతున్న ప్రపంచపు అతి పెద్ద ఆవిష్కరణల ప్రాంగణం
- ఆవిష్కరణ సంస్కృతికి అత్యధిక ప్రోత్సాహం



అభివృద్ధిలో ప్రపంచ నగరాలతో పోటీ

హైదరాబాద్ నగరానికి అవార్డుల పంట

- భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా మెర్సర్ సంస్థచే వరుసగా 5 సార్లు ఎంపికైన హైదరాబాద్
- ప్రపంచ హరిత నగరంగా 2022లో AIPH గుర్తింపు
- హైదరాబాద్ ను ప్రపంచ వృక్ష నగరంగా గౌరవించిన ఆర్బర్ డే ఫౌండేషన్
- అంతర్జాతీయ సుందర కట్టడాల విభాగంలో ఐదు గ్రీన్ ఆపిల్ అవార్డులు

జారీ చేసినవారు : స్పెషల్ కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 5-10-2023



మెర్సీ ప్లీజ్!

"విధి కన్నెర్ర చేసి కోలుకోని దెబ్బకొట్టినా.. మనిషి తట్టుకుని నిలబడ గలుగుతాడు. కానీ అక్కున చేర్చుకుని ఓదార్చాల్సిన సమాజం ఈసడింపులు, చీదరింపులతో అసహ్యంగా చూస్తే బతకాలన్న కోరిక చచ్చిపోతుంది. కోరిక లేని మనిషికి చావు తప్ప మరోమార్గం కనిపించదు, ఇదే నా జీవితంలో ప్రస్తుతం జరుగుతోంది. కనీసం నన్ను ప్రశాంతంగానైనా చావనివ్వండి ప్లీజ్" అని అడుగుతోంది డాక్టర్ పార్వతీ కుమారి.

జార్ఖండ్‌లోని చిన్న నగరం ధన్‌బాద్. ఇక్కడే పుట్టింది పార్వతీ కుమారి. తాతయ్య, నాయనమ్మలు, ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ల మధ్య ఆడుతూ పాడుతూ పెరిగింది. పదోతరగతి పాసై ఎంచక్కా కాలేజీకి వెళ్దామని అడ్మిషన్ తీసుకుంది. సరిగా అప్పుడే పార్వతికి విపరీతమైన తలనొప్పి వచ్చింది. ఇంటిచిట్కాలు పాటిస్తూ నొప్పిని తగ్గించుకోవడానికి ప్రయత్నించింది. కానీ తగ్గకపోగా రోజురోజుకీ ఎక్కువవుతూ పోయింది. ఎన్ని ట్రీట్మెంట్‌లు తీసుకున్నా ఫలితం కనిపించలేదు.. ఓరోజున ఉన్నట్టుండి కోమాలోకి వెళ్లిపోయింది పార్వతి.



కళ్లు తెరిచింది కానీ....

స్పృహ లేకుండా జీవచ్ఛవంలా పడి ఉన్న పార్వతి... మూడు నెలల తరువాత కోమా నుంచి బయటకు వచ్చింది. కళ్లు తెరిచి చూసింది కానీ ఏమీ కనిపించడం లేదు. సీనియర్ కంటి డాక్టర్‌కు చూపించగా...''వివిధ రకాల మందుల దుష్ప్రభావం వల్ల కంటిచూపు పోయింది'' అని చెప్పారు. పార్వతికీ, ఆమె తల్లిదండ్రులకు ప్రపంచం తలకిందులైనట్లు అనిపించింది.

ఇంట్లో పార్వతి తండ్రి ఒక్కడిదే సంపాదన. ఆమె చికిత్సకు చాలా ఖర్చవడంతో అప్పుల పాలయ్యారు. ''కళ్లులేని అమ్మాయిని ఎవరు పెళ్లి చేసుకుంటారు? బతికుంటే తల్లిదండ్రులకు భారమే అని'' ఇరుగు పొరుగు ఈసడింపుగా మాట్లాడేవారు.

పీహెచ్‌డీ దాకా...

అనేక భయాందోళనల మధ్య ఉన్న పార్వతి మూడేళ్లు గడిపేసింది. ఆ తరువాత డెహ్రాడూన్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్'లో చేరింది. పదకొండో తరగతిలో అడ్మిషన్ తీసుకుని మొదటి మూడు నెలలు బ్రెయిలీ స్క్రిప్ట్‌ను నేర్చుకుంది. డెబ్బై రెండు శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పాసైంది. ఢిల్లీలోని ఇంద్రప్రస్థ కాలేజీలో బీఏ, దౌలత్‌రామ్ కాలేజీలో ఎమ్.ఏ. చేసింది. తరువాత జవహర్ లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ఎమ్‌ఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఇలా చకచకా చదివేసి జేఆర్‌ఎఫ్‌గా సెలక్ట్ అయ్యింది. ఒక పక్క చదువుతూనే మరోపక్క సాహిత్య సేవ కూడా చేసింది.

పుంజుకునేలోపే...

కుటుంబ సభ్యులు, కాలేజీ లెక్చరర్లు, తోటి విద్యార్థులు, స్నేహితుల సాయంతో చదివిన పార్వతికి ఓ ఈవినింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. హమ్మయ్య ఇంతకాలానికి ఎవరి సాయం తీసుకోకుండా నా కాళ్లమీద నేను నిలబడ్డాను, ఇప్పుడు నేను కూడా నా కుటుంబ సభ్యులకు, ఇతరులకు సాయం చేయవచ్చు అనుకుని.. సంతోషంగా తన డ్యూటీ చేసుకునేది పార్వతి. కాలేజీలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను పర్మినెంట్ చేసే సమయం వచ్చింది. తాను కూడా పర్మినెంట్ ఉద్యోగి అయిపోతుంది అనుకుంది పార్వతి. అయితే పర్మినెంట్ చేయడం మాట అటుంచి కనీసం కారణం కూడా చెప్పకుండా ఆమెను ఉద్యోగం నుంచి తొలగించేశారు!! దీంతో మరోసారి తన జీవితం అంధకారమైనట్లనిపించింది.

''వెలుగు కోసం వేచిచూస్తూ లైన్లో ఉన్న నన్ను మళ్లీ చీకటిలోకి ఈడ్చిపడేసారు. ఇక నాకు పోరాడే ఓపికలేదు. అందుకే కనీసం ప్రశాంతంగా చనిపోనివ్వండి' అని ఈ దేశప్రజలు, సమాజాన్ని అడుగుతున్నాను.'' అని తీవ్రమైన నిరాశతో పార్వతి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ప్రొఫెసర్‌గా తానేమిటో ఇప్పటికే నిరూపించుకుంది. తన కాళ్లమీద తాను నిలబడేలా చేసి ఆ కళ్లకు వెలుగు చూపిస్తే పోయేదేముంది?



టిప్స్

యాంటీ యాక్నె డ్రింక్ తాగారా?

అర కప్పు ధనియాలు, పదిహేను కరివేప ఆకులు, అరకప్పు గులాబీ రేకులను రెండు గ్లాసుల నీటిలో వేసి బాగా మరిగించాలి. నీళ్లు రంగు మారాక స్టవ్ ఆపేసి వడగట్టాలి. వడగట్టిన నీటిని తాగాలి. వారానికి మూడు గ్లాసులు ఈ నీటిని తాగాలి. దీనిలో ఉండే విటమిన్ ఎ, కొల్లాజన్‌లు హార్మోన్ల అసమతుల్యం వల్ల వచ్చే మొటిమలను తగ్గిస్తాయి.



జీడిపప్పును పాలలో నానబెట్టి, తరువాత నెయ్యిలో ఎర్రగా వేయించాలి. ఇవి చల్లారాక పేస్టు చేయాలి. ఈ పేస్టుని కూరలో వేసి పదినిమిషాలు మగ్గనిస్తే గ్రేవీ చిక్కగా వస్తుంది.

సైబర్ టాక్



పండగలు రాబోతున్నాయి. ఇంటిల్లిపాదికి బట్టలు, ఇంట్లోకి కొత్త వస్తువులు కొనాలన్న ప్లాన్‌లో ఉంది రోజా. ఆన్‌లైన్ షాపింగ్ అయితే సులువైన పని అనుకుంటూనే వాటిలోని ఆఫర్లను చెక్ చేయడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో వస్తువుల అమ్మకాలలో ఇచ్చే డీల్స్ చూస్తోంది. అనుకున్న బ్రాండ్‌లో ఓ ఫోన్ డీల్ కనపడింది. అత్యంత తక్కువ ధర కే వస్తోంది, నిమిషాల్లోనే ఆ డీల్ ముగుస్తుంది. అందుకే వెంటనే క్లిక్ చేసింది. అక్కడ నుంచి పోర్టల్‌లోకి వెళ్లడం, ఫోన్ బుక్ చేయడం చకచకా జరిగిపోయాయి. అమౌంట్ డెబిట్ అయ్యింది. కానీ, వస్తువు బుక్ అయినట్టుగా చూపించడం లేదు. ఆ తర్వాత చెల్లించిన డబ్బు గురించి ప్రయత్నించింది. కానీ, ఆ డబ్బు తిరిగి తన అకౌంట్‌లోకి రాలేదు.

ఆన్‌లైన్‌లో నకిలీ పండగ ఆఫర్ మోసాలు అధికంగా జరుగుతుంటాయి. వాటిలో... ఫ్రీ డెలివరీ నోటిఫికేషన్ స్కామ్, ఫేక్ షాపింగ్ సైట్లు, ఫేక్ గిఫ్ట్ కార్డులు, వోచర్లు, కూపన్లు, ఫేక్ స్వచ్ఛంద సంస్థలు, ఫేక్ ప్రయాణ ఆఫర్లు ఉంటాయి. ఇవన్నీ. డీల్ ఆఫ్ ది డే, ఆఫర్స్ అంటూ ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. తక్కువ ధరకు వస్తువులు, సేవలు లభిస్తాయన్న మన ఆశ స్కామర్ల చేతికి చిక్కేలా చేస్తుంది.

చీట్ ఆఫ్ ది డే

దొంగ డీల్స్!

నకిలీ షాపింగ్ సైట్‌లను గుర్తించ డానికి సులభమైన మార్గాలు



● యుఆర్‌ఎల్ ప్రక్కన ప్యాడ్‌లాక్ ఉన్న //http చెక్ చేయడం ద్వారా సైట్ సురక్షితమైనదో కాదో తెలుసుకోవచ్చు.

● సైట్ యుఆర్‌ఎల్ సందేహంగా నిజమైన రిటైలర్ అధికారిక చిరునామాకు దగ్గరగా ఉండి, కొన్ని అక్షరాలలో తేడా ఉండటం మరొక సంకేతం.

● బ్రౌజ్ చేస్తున్నప్పుడు రిటైలర్ యుఆర్ఎల్‌ని మాన్యువల్‌గా టైప్ చేయడం ద్వారా నకిలీ డొమైన్‌లను అడ్డుకోవచ్చు.

మీరు షాపింగ్ స్కామ్‌కు గురైతే...

● వెంటనే మీ బ్యాంక్ లేదా క్రెడిట్ కార్డ్ కంపెనీకి ఫిర్యాదు చేయాలి. స్కామర్ మీ అకౌంట్స్‌కి యాక్సెస్ తీసుకున్నట్లు వారికి తెలియజేయాలి. ● మీ బ్యాంక్ అకౌంట్‌పై కంట్రోల్‌కి ఆన్‌లైన్ పాస్‌వర్డ్‌లను మార్చండి. రెండు కారకాల ప్రమాణీకరణను (2-F-A-)ని పాటించాలి. ● అనుమానిత సైట్ నుంచి ఏదైనా డౌన్‌లోడ్ చేసినట్లయితే, స్కామర్‌లు ఇన్‌స్టాల్ చేసిన మాల్వేర్, రిమోట్ యాక్సెస్ సాఫ్ట్‌వేర్ కోసం మీ పరికరాలను స్కాన్ చేయడానికి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి. ● మీరు ఇంతకు ముందెన్నడూ ఆర్డర్ చేయని సైట్‌ని సందర్శిస్తున్నట్లయితే, వెబ్‌సైట్‌లోని 'అబౌట్' సెక్షన్‌ని చెక్ చేయాలి. వెబ్‌సైట్ ఎంత పాతదో దానితోపాటు కొన్ని కస్టమర్ రివ్యూలను చూడాలి. ● ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు మీరు స్కామ్‌కు గురైనట్లయితే వెంటనే పోలీసు రిపోర్ట్ ఫైల్ చేయాలి. https://cybercrime.gov.in/ కూ రిపోర్ట్ చేయచ్చు.

ఇ-మెయిల్, టెక్స్ లేదా డైరెక్ట్ మెసేజ్ ద్వారా షార్ట్ లింక్స్ వస్తుంటాయి.

● మీ ఆర్డర్ గురించి మీకు సందేహాలు ఉంటే ఆన్‌లైన్‌లో అమ్మకందారు ఏరియా చిరునామా, ఈ మెయిల్, ఫోన్ నంబర్‌ను నిర్ధారించుకోవాలి. సైట్‌లో కస్టమర్ సర్వీస్, సంప్రదింపు వివరాలు లేనట్లయితే సందేహించాలి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

సినిమా

మావయ్యగారి బయోపిక్‌లో నటించాలనుంది



"మామా మశ్చీంద్ర' చిత్రం మెంటల్‌గా, ఫిజికల్‌గా నాకు ఓ సవాల్. కంటెంట్ ఉన్న కమర్షియల్ సినిమా ఇది. ఫ్యామిలీతో కలసి హాయిగా చూడొచ్చు" అని హీరో సుధీర్ బాబు అన్నారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా, ఈషా రెబ్బా, మృణాళినీ రవి హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు చెప్పిన విశేషాలు.

- సుధీర్ బాబు

● నా కెరీర్‌లో ఇప్పటివరకూ నా వద్దకు వచ్చిన కథల్లో నాకు నచ్చినవి చేశాను. కానీ, ఫలానా జానర్, ఫలానా కథ కావాలంటూ దర్శకులను అడగలేదు. 'మనం, గుండెజారి గల్లంతయ్యిందే' చిత్రాలతో మంచి రైటర్‌గా నిరూపించుకున్నారు హర్ష. ఆయనపై ఉన్న నమ్మకంతో కథ తీసుకు రమ్మని చెప్పాను. హర్ష చెప్పిన 'మామా మశ్చీంద్ర' కథ చాలా నచ్చింది. హర్ష మంచి రచయిత, నటుడు. మంచి అనుభవం ఉన్న దర్శకుడిలా ఆయన ఈ సినిమా తెరకెక్కించారు. ● ఈ సినిమాలో నేను చేసిన మూడు పాత్రల్లో (దుర్గా, పరశురాం, డీజే) ఒక్కో పాత్ర ఒక్కో యాస (తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయలసీమ) మాట్లాడుతుంది. పరశురాం పాత్ర కోసం బరువు పెరిగాను. దుర్గ పాత్రకు ప్రోస్థటిక్స్ వాడాం. ఈ పాత్ర కోసం నిజంగా బరువు పెరగాలనుకున్నాను. అయితే ఒక్కసారిగా అంత బరువు పెరగడం మంచిది కాదని మహేశ్ బాబుగారితో పాటు సన్నిహితులు చెప్పడంతో ప్రోస్థటిక్ మేకప్‌ని వాడాం. డీజే పాత్ర కోసం డైట్ పాటించాను. ● నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావుగార్లు ఈ సినిమాకి పూర్తి న్యాయం చేశారు. 'మామా మశ్చీంద్ర'లో మా మావయ్య కృష్ణగారితో ఓ సీన్ చేయించాలనుకున్నాను. కానీ ఆయన దూరమయ్యారు. ఆయన లేకపోతే ఆ సన్నివేశానికి ప్రాధాన్యత లేదు. అందుకే వేరే వారితో ఆ సీన్ తీయలేదు. నా ప్రతి సినిమా రిలీజ్ రోజు మావయ్య చూసి, ఫస్ట్ ఫోన్‌కాల్ చేసి మాట్లాడేవారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరు. మావయ్యగారి బయోపిక్‌లో నటించే చాన్స్ వస్తే హ్యాపీగా చేస్తాను. ప్రస్తుతం నేను నటించిన 'మా నాన్న సూపర్ హీరో' డబ్బింగ్ జరుగుతోంది. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ 'హరోం హర' షూటింగ్ చేస్తున్నాం. పుల్లెల గోపీచంద్ బయోపిక్ కచ్చితంగా ఉంటుంది.


రెండు భాగాలుగా దేవర


● ఎన్టీఆర్

పాన్ ఇండియన్ ఫిల్మ్ 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్ సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ బుధవారం వెల్లడించింది. ఇందుకు సంబంధించి దర్శకుడు కొరటాల శివ ఓ వీడియోను షేర్ చేశారు. ఈ వీడియోలో కొరటాల శివ మాట్లాడుతూ– ''దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంలో 'దేవర' సినిమా ఉంటుంది. ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. మరింత లోతుగా ఆ పాత్రలను ప్రేక్షకులకు వివరించాల్సిన అవసరం ఉంది. రెండు, మూడు షెడ్యూల్స్ పూర్తయిన తర్వాత డబుల్ హై ఫీలయ్యాం. సినిమా నిడివి కోసం ఒక్క సన్నివేశాన్ని, ఒక్క డైలాగ్‌ను కూడా తీయలేమని అందరికీ అనిపించింది. ఒక్క భాగంలోనే ఈ కథను ముగించేయడం తప్పని పించించింది. అందుకే 'దేవర' కథను రెండు భాగాలుగా చెప్పడం కరెక్ట్ అనుకున్నాం. అయితే కథలో మార్పులు లేవు. ఈ చిత్రం తొలి భాగాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేస్తాం'' అన్నారు.

ఆ రోజులు గుర్తొచ్చాయి

- కిరణ్ అబ్బవరం



"రూల్స్ రంజన్' పూర్తి వినోదాత్మక చిత్రం. ట్రైలర్ చూసి నవ్వుకున్నట్లే సినిమా అంతా ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారని కచ్చితంగా చెప్పగలను" అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. రత్నం కృష్ణ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చెప్పిన విశేషాలు.

● ప్రతి సినిమాలో ఒకే తరహా పాత్ర కాకుండా వైవిధ్యంగా ఉండేలా కథలు ఎంచుకుంటున్నాను. రత్నం కృష్ణ చెప్పిన 'రూల్స్ రంజన్' కథ మంచి విజువల్ కామెడీ డ్రామాగా ఉంటుందని నమ్మి, చేశాను. రత్నం కృష్ణ బాగా తీశారు. సినిమా అంతా సరదాగా సాగుతుంది. 'వెన్నెల' కిశోర్, నాకు మధ్య వచ్చే సన్నివేశాలు, వైవా హర్ష, సుబ్బరాజు, ఆది ట్రాక్‌లు మంచి వినోదం పంచుతాయి. ● సినిమాల్లోకి రాక ముందు చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేశాను. పల్లెటూరి నుంచి వెళ్లిన నాకు కెఫెటేరియా (క్యాంటీన్) అంటే ఎలా ఉంటుందో కూడా తెలియదు. ఆ వర్క్ కల్చర్, ఆఫీస్ పద్ధతులకు అలవాటు పడటం కష్టమైంది. ఈ చిత్రంలో మనోరంజన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేశాను. షూటింగ్ చేస్తున్నప్పుడు నేను ఉద్యోగం చేసిన రోజులు గుర్తొచ్చాయి. ● నిర్మాతలు ఏఎం రత్నం, దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణగార్లు ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా తీశారు. ఈ చిత్రంలోని 'సమ్మోహనుడా..' పాట హైప్ తీసుకు వచ్చింది. ఇది రొమాంటిక్ సాంగ్. అందుకే సవాల్‌గా అనిపించింది. ప్రస్తుతం సీనియర్ డైరెక్టర్స్‌తో రెండు, కొత్త దర్శకులతో రెండు సినిమాలు చేస్తున్నాను.

సమాజానికి ఉపయోగపడే సినిమా

- శ్రీకాంత్

''తల్లిదండ్రులు, గురువులు పిల్లలను క్రమశిక్షణతో పెంచకపోతే ఆ పిల్లలు సమాజానికి ఎలా హానికరంగా తయారవుతారనే 'దర్టీ ఫెలో' కథ నాకు బాగా నచ్చింది. సమాజానికి ఉపయోగపడేలా మూర్తి సాయి ఈ సినిమాను తీశాడు. శాంతి చంద్రలాంటి వ్యాపారవేత్తలు ఇండస్ట్రీకి రావాలి'' అన్నారు శ్రీకాంత్ . శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రిత్ బతీజా హీరోయిన్లుగా ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహించిన చిత్రం 'దర్టీ ఫెలో'. గూడూరు భద్రకాళీ సమర్పణలో రాజ్ జీయస్ బాబు నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ను శ్రీకాంత్ విడుదల చేశారు. ''మా సినిమా సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా ఉంటుంది'' అన్నారు శాంతి చంద్ర. ''ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి'' అన్నారు ఆడారి మూర్తి సాయి.


● శ్రీకాంత్, శాంతి చంద్ర

కొడితే కొట్టాలి రా.. హిట్టు కొట్టాలి

కొడితే కొట్టాలి రా కప్పు కొట్టాలి అనే ధ్యేయంతో బరిలోకి దిగుతున్నారు క్రికెటర్లు. క్రికెట్ వరల్డ్ కప్ హంగామా మొదలైపోయింది. ఇటు సిల్వర్ స్క్రీన్ క్రికెట్ కూడా రెడీ అవుతోంది. కొడితే కొట్టాలి రా.. హిట్టు కొట్టాలి అంటూ కొందరు స్టార్స్ క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమాలు చేస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● రజనీకాంత్, కపిల్ దేవ్

గ్రౌండ్‌లో డాన్

ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్ క్రికెట్ గ్రౌండ్‌లోకి దిగాడు. ఏం చేశాడనేది వచ్చే ఏడాది వెండితెరపై చూడాలి. విష్ణువిశాల్, విక్రాంత్ హీరోలుగా సూపర్ స్టార్ రజనీకాంత్, క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'లాల్ సలాం'. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ క్రికెటర్స్‌గా నటించగా, ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్‌గా రజనీ నటించారు. ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. అలాగే రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 170వ చిత్రం ప్రారంభమైంది. అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, రితికా సింగ్, మంజు వారియర్ కీలక పాత్రల్లో సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త. ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.


ముత్తయ్య 800

లెజెండరీ క్రికెటర్, శ్రీలంకన్ ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ముత్తయ్య మురళీధరన్‌గా 'స్లమ్‌డాగ్ మిలియనీర్' ఫేమ్ మధుర్ మిట్టల్ నటించారు. మురళీధరన్ భార్య మది మలర్ పాత్రను మహిమా నంబియార్ పోషించారు. ఈ సినిమాలో తన క్రికెట్ లైఫ్ గురించి 20 శాతం ఉంటే, తన జీవితంలోని ఆసక్తికర సంఘటనలు 80 శాతం ఉంటాయని మురళీధరన్ ఇటీవల పేర్కొన్నారు. అలాగే మురళీధరన్‌గారిలా నటించేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఆయన అన్ని వీడియోలను చూశానని, తీవ్రంగా బౌలింగ్ సాధన చేశానని, మేకప్ కోసమే మూడు గంటలు పట్టేదనీ మధుర్ మిట్టల్ తెలిపారు. అంతేకాదు.. కొన్నాళ్ల క్రితం తనకు యాక్సిడెంట్ జరగడం వల్ల తన ఎల్బో కూడా ముత్తయ్య తరహాలోకే వచ్చిందనీ మధుర్ మిట్టల్ చెప్పుకొచ్చారు. శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది.


● మధుర్ మిట్టల్

ది టెస్ట్

టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో తమిళంలో 'టెస్ట్' సినిమా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మాధవన్, సిద్ధార్థ్, నయనతార లీడ్ రోల్స్ చేస్తుండగా, నిర్మాత శశికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. మోషన్ పోస్టర్‌ను బట్టి ఈ సినిమా టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఉంటుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే ఈ చిత్రంలో మాధవన్, నయనతార, సిద్ధార్థ్‌లలో ఎవరు క్రికెటర్స్‌గా కనిపిస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది.


● సిద్ధార్థ్, మాధవన్

చక్దా ఎక్స్‌ప్రెస్

దాదాపు రెండు దశాబ్దాల పాటు హిట్ క్రికెట్ ఆడారు జులన్ గోస్వామి. ఆమె జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'చక్దా ఎక్స్‌ప్రెస్'. జులన్‌గా అనుష్కా శర్మ నటించారు. నాలుగేళ్ల తర్వాత అనుష్కా శర్మ నటించిన చిత్రం ఇదే. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ కానుందట.


● జాన్వీ కపూర్

క్రికెటర్ మహి

జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటించిన చిత్రం 'మిస్టర్ అండ్ మిస్సెస్ మహి'. రాజ్ కుమార్ రావు మరో లీడ్ రోల్‌లో నటించారు. శరణ్ శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా కోసం క్రికెట్‌లో ఆరు నెలల పాటు జాన్వీ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

ఇలా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.



● అనుష్కా శర్మ



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 195

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఉజ్వల'కు మరో రూ.100 రాయితీ

'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' కింద వంట గ్యాస్ సిలిండర్లపై రాయితీని మరో రూ.100 పెంచాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది.

- వివరాలు 6లో



'క్వాంటమ్ డాట్స్'కు నోబెల్

నానో టెక్నాలజీకి సంబంధించిన క్వాంటమ్ డాట్స్ ఆవిష్కరణలో పరిశోధనలకు గాను ముగ్గురికి రసాయన శాస్త్ర నోబెల్ దక్కింది.

- వివరాలు 6లో

కమలం అసంతృప్తులకు కాంగ్రెస్ గాలం!

బీజేపీలోని అసమ్మతి నేతలను పార్టీలో చేర్చుకోవడంపై దృష్టి

- రంగంలోకి దిగిన కేసీ వేణుగోపాల్
- నేరుగా వారితోనే మంతనాలు.. రాజకీయ భవిష్యత్తుపై హామీలు!
- జాబితాలో రాజగోపాల్‌రెడ్డి సహా దాదాపు 20 మంది
- వివేక్, విజయశాంతి, కొండా, ఏనుగు రవీందర్‌రెడ్డిలతో చర్చలు?
- తాము పార్టీ మారడం లేదని చెప్పిన వివేక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఎప్పటికప్పుడు స్పష్టత ఇస్తున్నా మళ్లీ అదే ప్రచారం చేస్తున్నారన్న వివేక్
- కాంగ్రెస్ నేతలు తమ బలహీనతలను బయట పెట్టుకుంటున్నారు: కొండా

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో అసంతృప్త నేతలుగా ముద్రపడిన వారిపై కాంగ్రెస్ దృష్టి సారించింది. వారిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు



ప్రారంభించింది. ఢిల్లీ నుంచే వల విసురుతోందని, 'ఆపరేషన్ బీజేపీ అసమ్మతి' కోసం సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వయంగా రంగంలోకి దిగారని తెలుస్తోంది. బీఆర్ఎస్ పట్ల మెతక వైఖరి అనుసరిస్తోందని, తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, క్షేత్రస్థాయిలో పార్టీపై నెలకొన్న ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీతో కొంతకాలంగా అంటీ ముట్టనట్టుగా ఉంటున్న నాయకులు లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం పావులు కదుపుతున్నట్టు సమాచారం. కాగా వేణుగోపాల్ ఇప్పటికే బీజేపీ అసమ్మతి నేతలతో టచ్‌లోకి వెళుతున్నారని, వారి రాజకీయ భవిష్యత్తుకు హామీలివ్వడమే కాకుండా, తెలంగాణలో బీజేపీకి అవకాశం లేనందున తమతో కలిసిరావాలని కోరుతున్నారని తెలిసింది. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను గద్దె దించడమే తమ ధ్యేయమని, అందుకే బీజేపీలోకి వెళుతున్నామని చెప్పి కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టిన వారితో పాటు బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన కొందరిని టార్గెట్‌గా చేసుకుని

మిగతా 12వ పేజీలో ▶

'కృష్ణా' పంపకాల బాధ్యత బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే

- 11లో

మేం తెలంగాణ ప్రజల ఏ టీమ్



- ఏ పార్టీకీ బీ టీమ్ కాదు
- మేము ఢిల్లీకి సలాం కొట్టం.. గుజరాత్‌కు గులాంలం కాము
- తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ
- రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ

- 2లో

వందే వన్డే క్రికెట్

నేటి నుంచి వరల్డ్ కప్

➤ భారత గడ్డపై వన్డే వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమైంది. 10 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి నేడు నగారా మోగనుంది. గత వరల్డ్ కప్ ఫైనలిస్ట్‌లు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరిగే అహ్మదాబాద్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. 46 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 51 మ్యాచ్‌లు జరుగుతాయి. నవంబర్ 19న అహ్మదాబాద్‌లోనే ఫైనల్ నిర్వహిస్తారు.

- 13లో

క్లుప్తంగా...

మోదీని కలిశారో లేదో కేసీఆర్, కేటీఆర్ చెప్పాలి

బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి జవదేకర్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కలిశారో లేదా, ఎన్డీఏలో చేరతామని విజ్ఞప్తి చేశారో, లేదో అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ ఎప్పటికీ కలిసే ప్రసక్తే లేదని ప్రధాని తాజా వ్యాఖ్యలతో స్పష్టమైందన్నారు. బుధవారం జవదేకర్ మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ బండారాన్ని నిండుసభలో మోదీ బయటపెట్టడంతో బీఆర్ఎస్ నేతలు హతాశులయ్యారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ అబద్ధాల కోరు అంటూ రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. బీఆర్ఎస్‌తో బీజేపీకి లోపాయికారీ దోస్తీ ఉందంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ కావాలనే దుష్ప్రచారం చేస్తూ వచ్చాయని విమర్శించారు. కాంగ్రెస్–బీఆర్ఎస్‌లు గతంలో కలిసి పోటీ చేశాయని, గతంలో కాంగ్రెస్ హయాంలో కేంద్రమంత్రిగా కేసీఆర్ పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారని, కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని చెప్పారు. బీఆర్ఎస్‌కు నిజమైన ప్రతిపక్షం, కేసీఆర్ సర్కార్‌పై పోరాడుతున్నది బీజేపీనేనని ప్రజలకు తెలుసన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల తరఫున పోరాటం చేసేది బీజేపీనేనని, రానున్న ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని జవదేకర్ ధీమా వ్యక్తం చేశారు.

కేటీఆర్ సీఎం కావడానికి మోదీ అనుమతా?

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సనత్‌నగర్: కేటీఆర్ ముఖ్యమంత్రి కావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుమతి తమకు అవసరం లేదని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 'మా పార్టీ, మా ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాల కోసం ప్రధానమంత్రి వద్దకు వెళ్లాల్సిన అగత్యం ఏమిటి'అని ప్రశ్నించారు. బుధవారం ఇక్కడి వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, హక్కుల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతు న్నారని తలసాని విమర్శించారు. మాయమాటలతో తమ వద్దకు వచ్చే నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

అధికారం కోసం మోదీ అబద్ధాలు: కర్నె

సాక్షి, హైదరాబాద్: 'అధికారం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతులేని అబద్ధాలు చెప్తారని, అబద్ధాల యూనివర్సిటీకి ఆయన చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్‌తో కలిసి ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడుతున్న మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాలను ఒకరకంగా, ఇతర రాష్ట్రాలను మరోరకంగా చూస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్ సభలో మోదీ సర్పంచ్ కంటే అధ్వానంగా మాట్లాడారని, దేశ ప్రజలకు దశ, దిశ చూపే నాయకుడు కేసీఆర్ అని మోదీ ప్రసంగంతో తేలిపోయిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల తర్వాత అనేకమార్లు రాష్ట్రానికి వచ్చిన మోదీకి కేసీఆర్ మద్దతు కోరిన విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు జరుగుతున్న గుజరాతీ కుట్రలకు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పావుగా మారుతున్నారన్నారు. కేటీఆర్ సీఎం కావాలనుకుంటే ఎవరి అనుమతి అవసరం లేదన్నారు.

ఇదండీ సంగతి



ఒక్క రూట్.. మూడు టార్గెట్లు



కారును మళ్లీ అధికారం హైవే ఎక్కించేందుకు బీఆర్ఎస్ వ్యూహాలు

- స్థానిక నేతలకు దిశానిర్దేశం
- వరుస పర్యటనలతో రాష్ట్రాన్ని చుట్టి వస్తున్న కేటీఆర్, హరీశ్
- కామారెడ్డి సహా ఉమ్మడి నిజామాబాద్ బాధ్యతలు కవితకు..
- మరోవైపు మేనిఫెస్టో, ఎన్నికల ప్రచార వ్యూహాలపై కేసీఆర్ కసరత్తు

బీఆర్ఎస్ సర్కారు సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లే యత్నం

ఇదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు, నేతలపై విమర్శల దాడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతూ.. రాజకీయ వాతావరణం వేడెక్కుతున్న తరుణంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) క్షేత్రస్థాయిలో దూకుడు పెంచింది. మూడోసారి కూడా పార్టీని గెలిపించుకుని, అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ పెద్దలు పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థులను ప్రకటించగా.. క్షేత్రస్థాయి నుంచీ పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు వ్యూహాలను అమలు చేస్తున్నారు. అటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్తూనే.. ఇటు ప్రతిపక్షాలను ఎండగట్టడం.. ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని పరిశీలిస్తూ స్థానిక నేతలకు అవసరమైన దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు ఇద్దరూ ప్రభుత్వ కార్యక్రమాల పేరిట జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మినీ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పార్టీ పరిస్థితిని పరిశీలిస్తూ..

ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికల్లా సగానికిపైగా అసెంబ్లీ నియోజకవర్గాలను మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్సీ కవిత చుట్టి వచ్చేలా బీఆర్ఎస్ ప్రణాళిక రూపొందించింది. స్థానిక రాజకీయ పరిస్థితులను అంచనా వేయడం, అభ్యర్థి, పార్టీ నేతల మధ్య సమన్వయం, అభ్యర్థికి దిశానిర్దేశం చేయడం, అక్కడి వాస్తవ పరిస్థితులను సీఎం కేసీఆర్‌కు నివేదించడం లక్ష్యంగా ఈ పర్యటనలు సాగుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూనే.. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఈ ముగ్గురు నేతలు ఎండగడుతున్నారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న జాతీయ పార్టీల నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తిప్పికొడుతూ, వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రతిపక్షాల కార్యక్రమాలపై ఓ కన్నేసి..

వరుసగా జిల్లాల పర్యటనలు

మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత ముగ్గురూ క్షేత్రస్థాయిలో అధికారిక కార్యక్రమాలతోపాటు ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా సభలు, సమావేశాల్లో పాల్గొంటున్నారు. అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరిట కేటీఆర్, హరీశ్‌రావు జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.

- కేటీఆర్ ఓ వైపు తన శాఖలకు సంబంధించిన సమీక్షలు, కార్యక్రమాలకు హాజరవుతూనే.. గత రెండు వారాల్లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లతోపాటు 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించారు. ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలపై కేటీఆర్ ప్రధానంగా ఫోకస్ చేసినట్టు కనిపిస్తోంది. అంతేకాదు ఈ నెల 7వ తేదీ వరకు కూడా కేటీఆర్ షాద్‌నగర్, తాండూరు, వికారాబాద్, వరంగల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో పర్యటించేలా షెడ్యూల్ ఖరారైంది.
- మంత్రి హరీశ్‌రావు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట సహా 19 అసెంబ్లీ నియోజకవర్గాలను 15 రోజుల వ్యవధిలో చుట్టివచ్చారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తోపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో (నర్సాపూర్ మినహా) ఓ దఫా పర్యటన ఇప్పటికే పూర్తిచేశారు. మంత్రి హరీశ్ ఉమ్మడి మెదక్‌తోపాటు రంగారెడ్డి, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో సభలు, సమావేశాల్లో పాల్గొంటున్నారు.
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రధానంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై దృష్టి కేంద్రీకరించారు. సీఎం పోటీ చేయనున్న కామారెడ్డితోపాటు నిజామాబాద్ అర్బన్, బోధన్, ఉమ్మడి కరీంనగర్‌లోని జగిత్యాల నియోజకవర్గాలపై ఫోకస్ చేసి పనిచేస్తున్నారు.

ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఓ వైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై కసరత్తు చేస్తూనే.. బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ తరఫున ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రంగంలోకి దిగి సభల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో ప్లీనరీ, తుక్కుగూడ సభలను నిర్వహించింది. ఇందులో సోనియా, రాహుల్, ఖర్గే సహా దిగ్గజ నేతలంతా హాజరుకావడంతో ఆ పార్టీలో జోష్ వచ్చింది. బీఆర్ఎస్ పెద్దలు ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. నెలన్నర క్రితమే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో.. క్షేత్రస్థాయి నుంచీ పరిస్థితిని పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే కీలక నేతలతో జిల్లాల పర్యటనలు చేపట్టారు.

మేనిఫెస్టో, ప్రచార వ్యూహాల పనిలో కేసీఆర్

గత నెల 16న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆనాటి నుంచి భిన్నమైన వ్యూహానికి శ్రీకారం చుట్టారు. ప్రగతిభవన్ వేదికగా అసమ్మతి నేతల బుజ్జగింపు, మేనిఫెస్టో రూపకల్పన, ఎన్నికల షెడ్యూల్ తర్వాత ప్రచార సభల నిర్వహణ, తాను పాల్గొనే సభల షెడ్యూల్ వంటి అంశాలపై కేసీఆర్ లోతుగా కసరత్తు చేస్తున్నారు. మాజీ ఎంపీ వినోద్, ఎమ్మెల్సీలు పల్లా, వెంకట్రాంరెడ్డి, మధుసూదనాచారి, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్ తదితరులు కేసీఆర్ సూచనల మేరకు పార్టీ నేతలను సమన్వయం చేస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవి– గాయకుడు మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న తదితరులు ఎన్నికల ప్రచార సభలు, కార్యక్రమాల్లో ప్రజలను ఆకట్టుకునేలా పాటల రూపకల్పనపై దృష్టి పెట్టారు.

అక్టోబర్ 16న వరంగల్ సభ?

బీఆర్ఎస్ ఈనెల 16న వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి మేనిఫెస్టో ప్రకటించాలని భావిస్తోంది. అయితే, ఎన్నికల షెడ్యూల్, దసరా, బతుకమ్మ పండగల నేపథ్యంలో దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. కేటీఆర్ 6, 9వ తేదీల్లో వరంగల్‌లో పర్యటించనున్నారు. ఆలోగా వరంగల్ సభ నిర్వహణపై స్పష్టత రానుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

బీజేపీ పొత్తు ప్రతిపాదన బీఆర్ఎస్ తిరస్కరించింది

- అప్పటి బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ దీనిపై బహిరంగ ప్రకటన చేశారు
- 105 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిన బీజేపీతో మాకు పొత్తేంటి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎన్నికల పొత్తు కోసం ఎన్నో ప్రతిపాదనలు వచ్చినా భారత రాష్ట్ర సమితి ఎవరితోనూ పొత్తు కుదుర్చుకోలేదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు తెలిపారు. 'కేసీఆర్‌ను ఓడించేందుకు సైద్ధాంతిక విభేదాలను కూడా పక్కన పెట్టి విపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. అయితే 2018లో బీఆర్ఎస్‌తో తాము పొత్తుకు సిద్ధంగా ఉన్నట్లు అప్పటి దేశంలోనే బిగ్గెస్ట్ జూటా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ఇచ్చిన సంకేతాలు ఆ పార్టీ ఢిల్లీ యజమానుల అనుమతి లేకుండానే వచ్చాయా? బీజేపీ అధ్యక్షుడి హోదాలో డాక్టర్ లక్ష్మణ్ ఈ మేరకు బహిరంగ ప్రకటన చేశారు. అయితే బీజేపీ నుంచి ఈ ప్రతిపాదన అందిన మరుక్షణమే బీఆర్ఎస్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది..' అని కేటీఆర్ బుధవారం 'ఎక్స్' (ట్విటర్)లో వివరించారు.

సొంత బలం ఉన్న మాకు బీజేపీ మద్దతెందుకు?

'105 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిన పార్టీతో బీఆర్ఎస్ పొత్తు ఎందుకు కుదుర్చుకుంటుందనే విషయాన్ని కథలు అల్లుతున్న రాజకీయ టూరిస్టులు కచ్చితంగా తెలుసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ పదవి గెలుచుకునేందుకు అవసరమైన సొంత బలం బీఆర్ఎస్‌కు ఉన్నపుడు బీజేపీ మద్దతు ఎందుకు కోరుతుంది? మేము ఫైటర్లం.. చీటర్లం కాదు..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేటీఆర్ చేసేదంతా తప్పుడు ప్రచారమే



- 2018లో బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతిస్తుందని నేనెక్కడా చెప్పలేదు
- పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు మద్దతిస్తామని 2018లో తాను చెప్పినట్టు మంత్రి కేటీఆర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. అది పూర్తిగా అసత్యపు ప్రచారమేనని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం లక్ష్మణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. వారసత్వ, కుటుంబ రాజకీయాలతో సంబంధమున్న ఏ పార్టీని కూడా బీజేపీ ప్రోత్సహించదని స్పష్టం చేశారు. 'బుకాయించడం, అబద్ధాలు చెప్పడం కల్వకుంట్ల కుటుంబానికి అలవాటే. తమ తప్పులను ఎత్తిచూపితే కండ్లమంటతో నిందలు, దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ హామీలు, వెకిలిచేష్టలు, అబద్ధపు ప్రచారాలు కేసీఆర్ ఫ్యామిలీకి, బీఆర్ఎస్ నాయకులకు పరిపాటేనని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వంచన అనే పునాదిపై స్థాపితమైందని, విధివిధానాలతో, సిద్ధాంతాలతో సంబంధం లేకుండా నడుచుకునే పార్టీ అని విమర్శించారు. ప్రతి ఎన్నికల్లో వివిధ పార్టీలతో తెరచాటు ఒప్పందాలు, పొత్తులు పెట్టుకున్న బీఆర్ఎస్ పార్టీకి బీజేపీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు 'అని పేర్కొన్నారు. ఆ పార్టీ రాజకీయాలను విషతుల్యం చేస్తోందని నిందించారు. బీఆర్ఎస్–కాంగ్రెస్–ఎంఐఎం కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని లక్ష్మణ్ హెచ్చరించారు.

రూ.6.50 లక్షల కోట్ల అప్పు చేశారు

అందులో 30 శాతం కమీషన్లు కేసీఆర్ కుటుంబానికే: మైనంపల్లి



మెదక్: విభజన సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పులకుప్పగా మార్చారని ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. 'రూ.6.50 లక్షలకోట్లు అప్పు చేశారు.. అందులో 30 శాతం కమీషన్లు కేసీఆర్ కుటుంబానికే చెందాయి'అని ఆరోపించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఒంటిపై బట్టలు కూడా మిగలవని, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. బుధవారం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత, మెదక్‌లో చర్చి, దర్గాల వద్ద ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో ఒక్కో మనిషిపై రూ.లక్షన్నర అప్పు చేసిపెట్టారని పేర్కొన్నారు. ప్యారాచూట్ లీడర్ వస్తున్నాడంటూ కొందరు హేళన చేస్తున్నారని, తాను మెదక్‌లో రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఓ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆరేళ్లపాటు పనిచేశానని గుర్తు చేశారు. తనను విమర్శించిన నాయకుడు ఎక్కడి నుంచి వస్తున్నారు, ఆయన ఊరు తెలుసుకోవాలని పరోక్షంగా మంత్రి హరీశ్‌రావును ద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి చెందుతున్నాయని, దుబ్బాక, నర్సాపూర్, మెదక్‌లు మాత్రం ఎందుకు వివక్షకు గురవుతున్నారని ప్రశ్నించారు. త్వరలో ఆర్టీసీ స్థలాలు అమ్మేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మైనంపల్లి బాధితులకు టోల్‌ఫ్రీ నెంబర్ 9603596015

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బాధితులు ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నెంబర్: 9603596015 విడుదల చేసినట్లు బీజేవైఎం జాతీయ కోశాధికారి, టీమ్ సాయి వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎం సాయిప్రసాద్ బుధవారం నేరేడ్‌మెట్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి మైనంపల్లి హన్మంతరావు రాజ్యాంగానికి అతీతంగా ప్రవర్తించడంతో గత ఐదేళ్లుగా మల్కాజిగిరిలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన బాధితులు సోషల్ మీడియాలో కూడా హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించి సంప్రదించవచ్చన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

కవితను ఎందుకు అరెస్టు చేయలేదు?

కేసీఆర్ దోపిడీపై విచారణ జరగకుండా మోదీని ఆపిందెవరు?: మాణిక్‌రావ్ ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్‌స్కాంలో ఆ రాష్ట్రానికి చెందిన డిప్యూటీ సీఎంను అరెస్టు చేశారని, మరి కేసీఆర్ కుమార్తె కవితను ఎందుకు అరెస్టు చేయడం లేదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌తో కలిసి బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ అవినీతి చేసి దోచుకుంటున్నారని చెపుతున్న మోదీని ఆ దోపిడీపై విచారణ జరపకుండా అడ్డుకున్నదెవరని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే అని ఠాక్రే వ్యాఖ్యానించారు.

పార్టీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత టీపీసీసీ అధికార ప్రతినిధులదే

ఎన్నికల సమయంలో అధికార ప్రతినిధుల పాత్ర చాలా కీలకమని, పార్టీ ఆలోచనలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత వారిదేనని మాణిక్‌రావ్ ఠాక్రే స్పష్టం చేశారు. పార్టీ అధికార ప్రతినిధి హోదాలో పనిచేస్తున్న వారు నిరంతరం అప్రమత్తంగా ఉండి పనిచేయాలని సూచించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులతో ఠాక్రే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోతో పాటు డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

మేం తెలంగాణ ప్రజల ఏ టీమ్

ఏ పార్టీకీ బీ టీమ్ కాదు: కేటీఆర్

- ముఖ్యమంత్రిగా కేసీఆర్‌కు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి



శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్/ సాక్షి, కామారెడ్డి: 'మేం ఢిల్లీ బానిసలం కాదు. ఎవని అయ్యకు భయపడం. బీఆర్ఎస్ కాంగ్రెస్ బీ టీమ్ అని బీజేపీవోడు అంటాడు. బీజేపీ బీ టీమ్ అని కాంగ్రెసోడు అంటాడు. మేం ఎవరికీ బీ టీమ్ కాదు. మేము తెలంగాణ ప్రజల ఏ టీమ్. తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ. తెలంగాణ గల్లీల్లో ఉండే ప్రజలు ఏమనుకుంటారో అదే మాకు ముఖ్యం. మీరు ఢిల్లీకి భయపడతరు. మేము ఢిల్లీకి సలాం కొట్టం.. గుజరాత్‌కు గులాంలయ్యే ఖర్మ మాకు పట్టలేదు. ఢిల్లీ నుంచి వచ్చి ఇచ్చిపోయే కితాబులు మాకు అవసరం లేదు. ఢిల్లీ నుంచి గాలి మోటార్లో వచ్చిన ఒక పెద్దమనిషి గాలిమాటలు మాట్లాడి బయటపడ్డాడు. కాంగ్రెస్‌కు గతంలో ఎన్ని చాన్సులిచ్చినా ఏం చేయలేదు. చచ్చిన పీనుగు లెక్కున్న కాంగ్రెస్ దింపుడు కల్లం ఆశతో ఆరు హామీలను తీసుకువచ్చింది..' అని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ధ్వజమెత్తారు. 'ఈ పదేళ్లలో మేము ఏం చేశామో, మళ్లీ మాకే ఎందుకు ఓటేయాలో ఆలోచించాలని కోరుతున్నాం. వాస్తవానికి కాంగ్రెస్, బీజేపీలే కొన్ని చోట్ల ఒక్కటవుతున్నాయి. కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు, అదానీ నుంచి బీజేపీకి రూ.కోట్లు అందుతున్నాయి. ఓటుకు ఐదు వేలు అయినా ఇస్తారు. వాళ్లిచ్చే పైసలు తీసుకుని కారు గుర్తుకు ఓటెయ్యండి..' అని విజ్ఞప్తి చేశారు. బుధవారం నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, స్పీకర్ పోచారంతో కలిసి పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రగతి నివేదన సభలో, బాన్సువాడలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు.

సముద్రంలా ఎస్సారెస్పీ

'ఒకప్పుడు ఎస్సారెస్పీ ఎండిపోయి ఆగమైతుండేది. ఇప్పుడు కేసీఆర్ అపర భగీరథుడిలా రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీని నింపుతున్నారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో నుంచి ఇప్పుడు శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతలు ద్వారా 50 వేల ఎకరాలకు నీరందిస్తున్నాం. పైన హెలికాప్టర్ నుంచి చూస్తుంటే ఎస్సారెస్పీ సముద్రంలాగా కనిపిస్తోంది' అని మంత్రి అన్నారు.

కరెంటు తీగలు పట్టుకోండి తెలుస్తది..

'2014కు ముందు తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కరెంటు మాకు కనబడతలేదని కాంగ్రెస్, బీజేపీ నాయకులు అంటున్నారు. వారికి బస్సులు ఏర్పాటు చేస్తాం. ఏ ఊరికి వెళ్తారో వెళ్లండి. వరుసగా నిలబడి గట్టిగా కరెంట్ తీగలను పట్టుకోండి. కరెంట్ వస్తుందో లేదో అప్పుడు తెలిసిపోతది..' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. కాగా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కేటీఆర్ గోబ్యాక్ అంటూ నినదించిన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వచ్చిన పలువురు ఆశా వర్కర్లతో కేటీఆర్ మాట్లాడారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల మాటలు నమ్మొద్దు

'బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజలను విడగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయి. గత ఎన్నికల్లో జన్‌ధన్ ఖాతా ఖోలో.. ధన్‌ధన్ పంద్రాలాక్ లేలో అన్న మోదీ నల్లధనం ఏదంటే తెల్లమొఖం వేస్తున్నాడు. నిజామాబాద్‌కు వచ్చి ఏమేమో మాట్లాడాడు. పసుపు బోర్డు మోదీ దింపుడు కల్లం ఆశ. గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచిన నరేంద్రమోదీ ఎట్లా దేవుడైతడో బండి సంజయ్ చెప్పాలి. అరవై ఏళ్ల పాలించిన కాంగ్రెస్ రైతులకు చేసిందేమీ లేదు. రేవంత్‌రెడ్డి అప్పుడు ఓటుకు కోట్లు కేసులో దొరికిన దొంగ అయితే, ఇప్పుడు సీటుకు నోట్లు అడుగుతున్నాడు. గత పదేళ్లలో చేసిన పనులు చూసి కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం..' అని కేటీఆర్ చెప్పారు.

రేవంత్‌కు చంద్రబాబుకు పట్టిన గతే!

- ప్రగతి నివేదన సభల్లో మంత్రి హరీశ్‌రావు ఫైర్
- 'ఓటుకు కోట్లు'లో దొరికిన దొంగ అని మండిపాటు
- బీజేపీ లేచేది లేదు, కాంగ్రెస్ గెలిచేది లేదని వ్యాఖ్య



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''నాడు వ్యవసాయానికి కరెంట్ దండగ అన్న చంద్రబాబు గతి ఏమైందో.. నేడు సాగుకు మూడు గంటల కరెంటు చాలంటున్న ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డికి కూడా అదే గతి పడుతుంది.. ఈ రోజు కాకుంటే రేపు ఆయన జైలుకు పోక తప్పదు..'' అని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కోస్గి, మక్తల్, దేవరకద్ర, కొత్తకోటలలో ఆయన పర్యటించి.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ''టీడీపీ డబ్బులిచ్చి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఓటుకు కోట్లు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి.. తప్పించుకునేందుకు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లాడు. రేవంత్‌రెడ్డి నువ్వు చేసింది తప్పు, విచారణ చేయాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. న్యాయం, ధర్మం ఎప్పటికైనా గెలుస్తాయి. ఈ రోజు కాకుంటే రేపు.. రేపు లేదంటే ఎల్లుండి అయినా జైలు తప్పదు..'' అని హరీశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మరోమారు బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ లేచేది లేదు.. కాంగ్రెస్ గెలిచేది లేదు

రాష్ట్రంలో బీజేపీ లేచేది లేదని, కాంగ్రెస్ గెలిచేది లేదని హరీశ్ ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఢిల్లీలో ఒక మాట, తెలంగాణకు వస్తే మరో మాట మాట్లాడుతారని హరీశ్ విమర్శించారు. మహారాష్ట్రలో తగిన చికిత్స అందక, మందుల్లేక 34 మంది పిల్లలు చని పోయినట్టు టీవీల్లో చూశామని.. మరి బీజేపీ సర్కా రు ఏం చేస్తోందని ప్రశ్నించారు. పక్కనే ఉన్న కర్ణాట కలో పేదింటి ఆడబిడ్డకు సాయం అందించని కాంగ్రెస్.. తెలంగాణలో ఏదో చేస్తామంటూ చెప్పే మాటలను ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. అదే తెలంగాణలో కేసీఆర్ మాటంటే మాటేనని.. మొదట్లో పింఛన్‌ను రూ.200 నుంచి వెయ్యి చేస్తామని చేశారని, తర్వాత రెండు వేలకు పెంచారని హరీశ్ చెప్పారు. అక్టోబర్ 16న సీఎం కేసీఆర్ వరంగల్ బహిరంగ సభలో వెల్లడించే మేనిఫెస్టో చూస్తే ప్రతి పక్షాల మైండ్ బ్లాంక్ అవుతుందని చెప్పారు.

ఎన్నికల కోసమే ట్రిబ్యునల్

తెలంగాణ ఏర్పాటైన కొత్తలోనే సీఎం కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని ప్రధానిని కోరినా.. పదిసార్లకుపైగా ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా, లేఖలు రాసినా ఇప్పటివరకు స్పందించలేదని మండిపడ్డారు. ఇప్పుడు కృష్ణా జలాల అంశాన్ని ట్రిబ్యునల్‌కు అప్పగిస్తున్నట్టు ప్రకటించడం ఎన్నికల జిమ్మిక్కేనని, తెలంగాణపై మోదీకి, బీజేపీకి ఎలాంటి ప్రేమ లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మించారని చెప్పారు.

కేసీఆర్ నోరు విప్పాలి

- మోదీ చెప్పింది నిజమో కాదో చెప్పాలి
- ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు చేయొద్దని అడిగిన విషయం ప్రధాని చెప్పలేదు
- ఇప్పుడు ఎంఐఎం విధానమేంటో స్పష్టం చేయాలి: రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన విషయాలు వాస్తవమో కాదో సీఎం కేసీఆర్ చెప్పాలని టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మోదీ మాటలతో బీజేపీ, బీఆర్ఎస్‌ల బంధం నిజమని తేలిందన్నారు. ఆ రెండు పార్టీలతో పాటు ఎంఐఎం కూడా కలిసి లోక్‌సభ ఎన్నికల కోసం సీట్ల పంపకాలు పూర్తి చేసుకున్నాయని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్‌యాదవ్‌లతో కలిసి రేవంత్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ మూడు పార్టీల మధ్య పొత్తు కుదిరిందని, బీఆర్ఎస్ 7, బీజేపీ 9, ఎంఐఎం 1 స్థానంలో పోటీ చేసేలా సీట్ల సర్దుబాటు కూడా జరిగిందన్న విషయాన్ని బీఆర్ఎస్ ఎంపీ ఒకరు తనతో చెప్పారని వెల్లడించారు. 'బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే. వారిది గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ. అలాంటి వారికి అసదుద్దీన్ ఎలా మద్దతిస్తారు? ఎంఐఎం ఎవరివైపు నిలబడుతుంది. బీజేపీతో దోస్తీ కడుతున్న బీఆర్ఎస్‌తోనా? బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలనుకునే కాంగ్రెస్‌తోనా?' అసద్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ అధిష్టానం మోదీనే

ఎన్డీయేలో కలుస్తానని, కొడుకును సీఎం చేస్తానని తన వద్దకు వచ్చి కేసీఆర్ చెప్పారని మోదీ నిజామాబాద్ సభలో ప్రస్తావించడాన్ని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు నీళ్లు అంటే కవిత కన్నీళ్లు, నిధులు అంటే దోపిడీ సొమ్ము, నియామకాలు అంటే కొడుకును సీఎం చేయడం గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు చేయొద్దని కేసీఆర్ అడిగిన విషయాన్ని, బీఆర్ఎస్ ఆదేశాలతోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చారన్న విషయాన్ని కూడా మోదీ చెప్పాల్సిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ దోపిడీలో బీజేపీకి వాటాలు వెళుతున్నాయి కాబట్టే మోదీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

రూ. 3,008 కోట్ల పెట్టుబడులు

- వర్చువల్‌గా 13 ప్రాజెక్టులకు సీఎం జగన్ భూమి పూజ, ప్రారంభోత్సవాలు
- ఏడు పారిశ్రామిక యూనిట్లు.. ఆరు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పరిశ్రమల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదుర్చుకున్న రూ.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను వేగంగా కార్యరూపంలోకి తెస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటయ్యే దాదాపు రూ.3,008 కోట్ల విలువైన 13 ప్రాజెక్టులకు సీఎం జగన్ బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో పరిశ్రమల రంగానికి చెందిన ఏడు యూనిట్లు రూ.2,294 కోట్ల పెట్టుబడితో పాటు 4,300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించనుండగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆరు యూనిట్ల ద్వారా రూ.714 కోట్ల పెట్టుబడితో 3,155 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా 91,000 మంది రైతులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. పులివెందులలో ఏర్పాటైన అరటి ప్రాసెసింగ్ యూనిట్‌తోపాటు తిరుపతి జిల్లాలో నెలకొల్పిన డీపీ చాక్లెట్స్‌కు చెందిన కోకో బటర్, కోకో పౌడర్‌ఉత్పత్తుల తయారీ యూనిట్, గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్ కంపెనీ యూనిట్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..



గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మిగతావి ఆర్నెల్ల నుంచి ఏడాదిన్నరలోపే సిద్ధం

ఈ పరిశ్రమల వల్ల 14 జిల్లాల్లో సుమారు 7 వేల మందికి పైగా స్థానికంగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని మనం చట్టం కూడా చేశాం. దీనివల్ల మన పిల్లలందరికీ మంచి జరుగుతుంది. అక్కడే వీరికి ఉద్యోగాలు రావడం వల్ల స్థానికులందరూ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు పలికి స్వాగతించేలా మనం ఈ చట్టం చేశాం. వీటివల్ల యువతకు ఆరు నెలల నుంచి గరిష్టంగా 18 నెలల్లోగా ఈ పరిశ్రమలలో ఉద్యోగాలు రానున్నాయి. అప్పటిలోగా పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉంటాయి. ఇందులో 3 యూనిట్లను ఇప్ప టికే ప్రారంభించుకున్నాం. మిగిలినవి 6 నెలల నుంచి ఏడాదిన్నరలోపే పూర్తవుతాయి. ఇవాళ ఎంవోయూ చేసు కున్న ప్లాంట్‌కూడా ఏడాదిన్నరలోగా అందుబాటులోకి రానుంది.

ఒక్క ఫోన్ కాల్ దూరంలో..

ఈ సందర్భంగా మీ అందరికీ (పారిశ్రామికవేత్తలు) మద్దతు ఇచ్చే విధంగా నాలుగు మాటలు చెబుతా. పారిశ్రామిక వేత్తల పట్ల మేం అత్యంత సానుకూలంగా ఉన్నాం. మీకు ఎలాంటి సమస్య ఎదురైనా మేం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉన్నామనే విషయాన్ని మనసులో పెట్టుకోండి. అధికార యంత్రాంగం మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని మనస్ఫూర్తిగా చెబుతున్నా. ఈ ప్రభుత్వం మీకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తుంది. కలెక్టర్లు, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి, పరిశ్రమలశాఖ మంత్రి, సీఎస్ సహా అందరూ మిమ్మల్ని చేయి పట్టుకుని నడిపించేలా మీ పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా కృషి చేసిన కలెక్టర్ నుంచి సీఎస్ వరకూ అందరికీ అభినందనలు.

క్లుప్తంగా...

నేడు ఢిల్లీకి సీఎం వైఎస్ జగన్

- రెండు రోజుల పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం(నేడు) ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. గురు, శుక్రవారాల్లో ఆయన ఢిల్లీలోనే ఉంటారు. గురువారం ఉదయం 10:30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళతారు. అక్కడ 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బస చేస్తారు. శుక్రవారం ఉదయం విజ్ఞాన్ భవన్‌లో వామపక్ష తీవ్రవాదంపై కేంద్రం నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సీఎం ఢిల్లీ పర్యటన వివరాలు వెల్లడించింది.

పీటీ వారెంట్‌పై విచారణను నిరోధించలేం

- ఏసీబీ కోర్టుకు అటువంటి ఉత్తర్వులివ్వలేం
- చంద్రబాబుకు తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, అమరావతి: ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో పెద్ద ఎత్తున జరిగిన ఆర్థిక అక్రమాలపై నమోదు చేసిన కేసులో సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌పై విచారణ జరపకుండా ఏసీబీ కోర్టును నిరోధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు ఇప్పటికే నిరాకరించిన విషయాన్ని సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు సీఐడీ దాఖలు చేసిన పోలీసు కస్టడీ పిటిషన్‌పై కూడా వాదనలు కొనసాగుతున్నాయని ఏజీ వివరించారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వొద్దని అభ్యర్థించారు. దీనికి హైకోర్టు స్పందిస్తూ.. గురువారం ఉదయం నుంచే చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు వింటామని తెలిపింది. ఇరుపక్షాలూ ఆరోజే వాదనలు పూర్తి చేయాలని స్పష్టం చేస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

12 వరకు లోకేశ్‌ను అరెస్టు చేయొద్దు

- గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు
- లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ 12కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ముందస్తుబెయిల్ కోరుతూ మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంలో తదుపరి విచారణ ఈ నెల 12కి వాయిదా పడింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు ఇంకా అందలేదని, అందువల్ల విచారణ వాయిదా వేయాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టును కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరిస్తూ విచారణను 12కి వాయిదా వేసింది. ఈ కేసులో లోకేశ్‌ను ఈ నెల 4వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దంటూ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను 12వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోయినా ఐ డోంట్ కేర్

అక్క పురందేశ్వరితో టచ్‌లో ఉన్నా: బాలకృష్ణ



సాక్షి, హైదరాబాద్: చంద్రబాబు అరెస్టుపై జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోయినా పట్టించుకోనని.., ఐ డోంట్ కేర్ అని హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన బుధవారం ఎన్టీఆర్‌ట్రస్ట్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టును సినిమా రంగంలో ఎవరు ఖండించకపోయినా పట్టించుకోనని అన్నారు. అరెస్టు జరిగి నెల గడుస్తున్నా ఇంకా ఇక్కడ ఎవరూ ఖండించలేదన్నారు. చంద్రబాబు అరెస్టు అంశంపై అక్క పురందేశ్వరితో టచ్‌లో ఉన్నానని, కేంద్ర పెద్దలను కలుస్తానని చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇక్కడి నేతలు మూడు రోజులుగా చంద్రబాబు జపం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అరెస్టు అన్యాయం అని అంటున్నారే తప్ప ఒక్కరు కూడా జరిగిన ఘటన గురించి మాట్లాడటంలేదని పరోక్షంగా బీఆర్‌ఎస్ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. బాబు ద్వారా దేశం లబ్ధి పొందిందని, ఆయన అరెస్టును దేశం మొత్తం ఖండించిందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి ఎన్టీఆర్, చంద్రబాబు వేసిన బీజమేనన్నారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాబోయే ఎన్నికల యుద్ధానికి సిద్ధమైందని, తెలంగాణ పార్టీకి తాను అండగా ఉన్నానని తెలిపారు. రెండు రాష్ట్రాలూ తనకు రెండు కళ్ల వంటివని చెప్పారు. తెలంగాణలో పొత్తుల విషయం చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు.

మరిన్ని ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారు.. సాక్షులను బెదిరిస్తున్నారు

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించండి

- స్కిల్ కుంభకోణం అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే సాగింది
- ఆయన 13 సంతకాలతో సహా బలమైన ఆధారాలున్నాయి
- ఏసీబీ న్యాయస్థానాన్ని కోరిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోరిన ఆయన న్యాయవాది దూబే
- కేసు విచారణను గురువారానికి వాయిదా వేసిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి: 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసు కీలక దశలో ఉంది. రూ.371 కోట్లు కొల్లగొట్టిన ఈ సామాజిక, ఆర్థిక కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా తానై చంద్రబాబు వ్యవహరించారు. ఈ కేసులో ఇప్పటికే ఆయన సాక్షులను బెదిరిస్తున్నారు. ఈ తరుణంలో ఆయన బెయిల్‌పై బయటకొస్తే మిగిలిన సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును ప్రభావితంచేసే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతున్నా'.. అని రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి న్యాయస్థానాన్ని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తూ చంద్రబాబుకు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించేందుకు ఉన్న బలమైన కారణాలను న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర సుస్పష్టమన్నారు. జీఓ జారీ, అందుకు విరుద్ధంగా ఒప్పందం కుదుర్చుకోవడం, అధికారుల నియామకం, ఆర్థిక శాఖ అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధుల విడుదల.. ఇలా అన్ని దశల్లోనూ చంద్రబాబే ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. అందుకు 13 నోట్‌ఫైళ్లపై చంద్రబాబు సంతకాలు చేయడమే నిదర్శనమన్నారు. జీఓ నంబర్ 4 కంటే ముందే ఒప్పందం కుదుర్చుకున్నారని.. కానీ, ఆ ఒప్పందాన్ని జీఓలో ఎందుకు ప్రస్తావించలేదన్నది ఈ కేసులో కీలకమన్నారు. ఆర్థిక శాఖ అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలను చంద్రబాబు దురుద్దేశపూరితంగానే తన విచక్షణాధికారాలు (వీటో)తో తోసిపుచ్చారని న్యాయస్థానానికి వివరించారు.

బాబు బెదిరింపులపై ఆధారాలున్నాయి..

అంతేకాదు.. తాను చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని.. వారిని పదవుల నుంచి తొలగిస్తానని ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అధికారులను బెదిరించినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని కూడా పొన్నవోలు న్యాయస్థానానికి వివరించారు. స్కిల్ కుంభకోణం ఏమీ ఫిక్షన్ కథ కాదని, ప్రభుత్వ నిధులు కొల్లగొట్టిన అవినీతి వ్యవహారమని అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఆ మేరకు సమగ్ర దర్యాప్తు ద్వారా సీఐడీ గుర్తించి నివేదించిన ఆధారాలను పరిశీలించాలని న్యాయస్థానాన్ని కోరారు. షెల్ కంపెనీలు, నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా పన్ను ఎగవేతను 2017లోనే జీఎస్టీ అధికారులు గుర్తించారన్నారు. ఈ కేసు కేంద్ర దర్యాప్తు సంస్థల దర్యాప్తులో ఉండగానే 2018లో 17వ సవరణ చేశారనే విషయాన్ని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. కాబట్టి ఈ కేసులో చంద్రబాబుకు 17ఏ వర్తించదన్నారు.

చంద్రబాబు ఆదేశాలతోనే వారిద్దరు పరార్..

ఇక నిధులను అక్రమంగా తరలించడంలో కీలక వ్యక్తులైన చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని దేశం విడిచి పరారైన ఉదంతాన్ని ప్రస్తావించారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని వారిని సీఐడీ నోటీసులు ఇవ్వగానే దేశం విడిచిపెట్టి పోవడం తీవ్రమైన పరిణామమన్నారు. చంద్రబాబు ఆదేశాలతోనే వారిద్దరూ పరారయ్యారని చెప్పారు. పెండ్యాల శ్రీనివాస్ పాస్‌పోర్ట్‌ను సీజ్ చేసేలా న్యాయస్థానం ఆదేశించాలని కోరారు. ఇక ఈ కేసులో గతంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చిన అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ప్రస్తుతం అందుకు భిన్నంగా మీడియా చానళ్లలో చర్చల్లో మాట్లాడుతుండటం వెనుక చంద్రబాబు ఒత్తిడి ఉందన్నారు. కాబట్టి ఈ తరుణంలో చంద్రబాబుకు బెయిల్ ఇస్తే ఆయన తన రాజకీయ పలుకుబడితో సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును పక్కదారి పట్టించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కాబట్టి ఈ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలని న్యాయస్థానాన్ని అదనపు ఏజీ కోరారు.

సాక్షులను ప్రభావితం చేసే అవకాశంలేదు : దూబే

అంతకుముందు.. ఈ కేసులో ముద్దాయి చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ.. ఆర్థిక శాఖ అధికారులు గుజరాత్ వెళ్లి అధ్యయనం చేసి ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదన్నారు. ఈ ప్రాజెక్టు విలువను నిర్ణయించిన కాస్ట్ వేల్యుయేషన్ కమిటీలో చంద్రబాబు లేరన్నారు. ఆ కమిటీలో సభ్యుడిగా ఉన్న భాస్కరరావు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని చెప్పారు. కేబినెట్ నిర్ణయం మేరకు చేసుకున్న ఒప్పందంలో చంద్రబాబును తప్పుబట్టడానికి లేదన్నారు. సాక్షులను ప్రభావితం చేయడంగానీ, ఆధారాలను ధ్వంసం చేయడంగానీ, పరారయ్యే అవకాశంగానీ లేనందున చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. అనంతరం.. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలని, ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఆయనకు పీటీ వారంట్ జారీచేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా న్యాయస్థానం గురువారం విచారించే అవకాశాలున్నాయి.

వాదనలపై వక్రీకరణలా!?

ఏబీఎన్, టీవీ–5పై ఏఏజీ పొన్నవోలు ఆగ్రహం

న్యాయస్థానంలో జరిగిన వాదనలను వక్రీకరిస్తూ ఏబీఎన్, టీవీ–5 చానళ్లు తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నాయని అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఆ రెండు చానళ్లు తనను లొంగదీసుకోవాలని చూస్తున్నాయని.. అది సాధ్యం కాకపోవడంతో తనపై బురద జల్లుతున్నాయని ఆయన విమర్శించారు. విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ప్రాంగణంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు విచారణ సమయంలో న్యాయస్థానం తనపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు ఏబీఎన్, టీవీ–5 చానళ్లు దుష్ప్రచారం చేశాయని విమర్శించారు. అత్యంత కీలకమైన ఈ కేసులో ప్రభుత్వం తరఫున తాను బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు వినిపించిన వాదనను న్యాయస్థానం ఓపిగ్గా విందన్నారు. ఆ సమయంలో న్యాయస్థానం తనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని.. నిరూపించలేకపోతే ఏం చేస్తారని ఏబీఎన్, టీవీ–5 చానళ్లకు పొన్నవోలు సవాల్ విసిరారు. ఆ రెండు చానళ్లు టీవీ చర్చల్లో తనను తిట్టిస్తున్నా సహించానని కానీ, ఏకంగా న్యాయస్థానంలో వాదనలను వక్రీకరించడాన్ని మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. ఈ విషయాన్ని గురువారం విచారణ సమయంలో న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆ రెండు చానళ్లకు ధైర్యం ఉంటే గురువారం న్యాయస్థానం విచారణ సమయంలో రావాలని సవాల్ విసిరారు.

రాష్ట్రీయం

బీఆర్‌ఎస్ ఏ క్షణమైనా చీలిపోతుంది

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్



సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ ఏ క్షణమైనా నిట్టనిలువునా చీలే ప్రమాదముందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తన కొడుకును సీఎంగా చేయాలనుకున్న విషయాన్ని ప్రధాని మోదీ బయట పెట్టడంతో ఆ కుటుంబంలో చిచ్చు రగిలిందని ఆరోపించారు. తన సడ్డకుడి కొడుకును కేసీఆర్ తన ఇంటికి కూడా రానీయడం లేదన్నారు. బీఆర్‌ఎస్‌లో జరుగుతున్న పరిణామాలపై ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో చర్చ జరుగుతోందని, ట్విట్టర్ టిల్లు నాయకత్వంలో ఎన్నికలకు వెళ్తే.. డిపాజిట్లు కూడా రావనే భయం పట్టుకుందని అన్నారు. బుధవారం కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ అభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయించిన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని ఈ తొమ్మిదేళ్లలో తెలంగాణ కోసం రూ.9 లక్షల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేస్తూ.. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మోదీకి వస్తున్న ఆదరణను చూసి బీఆర్‌ఎస్ ఓర్వలేకపోతోందన్నారు. ట్విట్టర్ టిల్లు నిలువెల్లా మోదీపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. తెలంగాణయే మా కుటుంబమని చెబుతున్న అజయ్‌రావు.. దళితుడిని సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎం కాకముందు.. తర్వాత కుటుంబ ఆస్తులు ఎన్ని అని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తున్న కేసీఆర్ కూడా టూరిస్టా అని అన్నారు. కేసీఆర్ పక్షం రోజులుగా బయటకు రావడం లేదని, ఆయనను బయటకు తీసుకువచ్చి ప్రెస్‌మీట్ పెట్టించాలని కోరారు.

మోదీపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే నాలుక కుట్టేస్తాం

బీజేపీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుకను మడత పెట్టి కుట్టేస్తామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బీఆర్‌ఎస్ నేతలను హెచ్చరించారు. బుధవారం అరుణ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మోదీ పర్యటనతో ప్రత్యర్థి పార్టీలకు ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. తెలంగాణ మోడల్ అంటే అంతకుమించి అవినీతి మోడల్ మరొకటి లేదనేది స్పష్టమైందన్నారు. మోదీ వెల్లడించిన వాస్తవాలు భరించలేక బీజేపీపై అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. 'పిచ్చికుక్కలు మిమ్మల్ని కరిచినందునే మీరు పిచ్చికుక్కల్లా మొరుగుతున్నారు'అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని చీటర్ అంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణలో వచ్చేది బహుజన ప్రభుత్వమే

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



జమ్మికుంట (కరీంనగర్ జిల్లా)/కేయూ క్యాంపస్: తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బహుజనుల ప్రభుత్వమేనని, కుట్రలు, అవినీతికి తావులేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల ఎంపీటీసీ సభ్యురాలు వాసాల నిరోషా, వాసాల రామస్వామి బుధవారం బీఆర్‌ఎస్ నుంచి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా జమ్మికుంటలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. హుజూరాబాద్‌లో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు పాలించినా బడుగు, బలహీన వర్గాలకు చేసిందేమీ లేదన్నారు. అంతకుముందు పీహెచ్‌డీ అడ్మిషన్ల అవతవకలపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ వరంగల్ జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీలో గత 29 రోజులుగా దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకులను ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు.

సీఎం హెల్త్ బులెటిన్ బయటపెట్టాలి...

- ఆయనకు కుటుంబ సభ్యులతోనే ప్రమాదం ఉంది
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు సొంత కుటుంబ సభ్యులతోనే ప్రమాదం ఉందన్న అనుమానం కలుగుతోందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ ఆరోగ్య వివరాలు, హెల్త్ బులెటిన్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తన కంటే జూనియర్ అయిన కేటీఆర్ సీఎం అవుతాడేమోనన్న ఫ్రస్టేషన్‌లో హరీశ్‌రావు ఉన్నాడని... రైల్వేస్టేషన్‌లో పిచ్చివాడిలా చిల్లరగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక కేటీఆర్, హరీశ్, కవిత పోటీలు పడి మీటింగ్స్ పెడుతున్నారని ఆరోపించారు. బుధవారం పార్టీ నేతలు డా.దినేష్ కులాచారి, డా. మల్లికార్జున్ రెడ్డి, ఏనుగుల రాకేష్ రెడ్డిలతో కలిసి అర్వింద్ మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో మాజీ సీఎం చంద్రబాబును అక్కడి సీఐడీ అరెస్ట్ చేసింది. తెలంగాణ సీఐడీ ఏం చేస్తోంది ? రేవంత్ రెడ్డి కనీసం మంత్రి కూడా కాదు.. ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? ఓటుకు కోట్లు కేసు ఎందుకు ముందుకు పోవడం లేదు'' అని అర్వింద్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిని కేసీఆర్ కాపాడుతున్నారని, అతనిపై ఎందుకంత ప్రేమనో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చీటింగ్‌లో మీరే నంబర్ వన్..

బీఆర్‌ఎస్ అగ్రనాయకత్వంపై ఈటల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'కేటీఆర్.. చీటరెవరు? చీటింగ్‌లో మీరే నంబర్ వన్. దళితబంధు, ఎస్సీలకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు, బీసీబంధు ఇస్తామని పేదలను మోసం చేసిన చీటర్లు మీరు'అని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. విశ్వాసానికి మారు పేరు ప్రధాని నరేంద్ర మోదీ అయితే, విశ్వాస ఘాతుకానికి మారుపేరు సీఎం కేసీఆర్ అని అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కేసీఆర్ ఎన్డీఏలోలో చేరాలని అనుకున్నది నిజం. కేటీఆర్‌ను సీఎం చేసి, కేసీఆర్ కేంద్రంలో మంత్రి అవ్వాలి అనుకున్నది నిజం'అని అన్నారు. గతంలో గజ్వేల్ మీటింగ్‌లో.. అవినీతిరహిత పాలన అందిస్తున్నారని ప్రధాని మోదీని కేసీఆర్ పొగిడిన వీడియోను ఈ సందర్భంగా ఈటల మీడియాకు ప్రదర్శించారు. 'తన కూతురు కవిత ఎంపీగా పోటీచేసిన నాడు.. కవితని గెలిపించండి, నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరుస్తా అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారా? అదే మోదీ.. రామగుండం ఎరువుల కర్మాగారం గురించి చెప్పకపోయినా రూ.6,300 కోట్లతో తెరిపించి మన రైతులకు ఎరువుల కొరత లేకుండా చేశారు. తెలంగాణ కోసం నిధులు ఇస్తున్న మోదీని.. ఏం ముఖం పెట్టుకొని వస్తావని ఎలా అడుగుతారు'అని ఈటల మండిపడ్డారు. అన్నిటికీ లెక్కలతో జవాబు చెప్తామన్నారు. సిద్దిపేటలో రైలు ప్రారంభ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు మోదీ ఫొటోను ఎలా తన్నారని నిలదీశారు. ప్రధానిని టూరిస్టు అని ఎలా అంటారని, మహారాష్ట్రకు వెళ్లిన మీరు టూరిస్టులు కాదా? అని నిలదీశారు.

సాక్షి
గురువారం, 5 అక్టోబర్ 2023

మనకు కొత్త సవాలు

తరచూ రాజకీయ సంక్షోభాలు చవిచూసే ద్వీపసమూహ దేశం మాల్దీవుల్లో ఈసారి శాంతియుతంగా అధికార మార్పిడి జరిగింది. అది సంతోషజనకమే అయినా, ఈ తాజా అధ్యక్ష ఎన్నిక ఫలితాలు భారత్‌లో కొత్త ఆందోళన రేపుతున్నాయి. చైనాకు అనుకూలుడైన ప్రతిపక్ష అభ్యర్థి దేశాధ్యక్షుడు కానుండడమే అందుకు కారణం. మాల్దీవులకు కొత్త అధ్యక్షుడి రాకతో, ఇప్పటి దాకా అక్కడున్న పలుకుబడి, పట్టు భారత్ కోల్పోనుంది. అది గణనీయమైన నష్టమే. రక్షణ రంగం, ప్రాథమిక వసతుల ప్రాజెక్టుల్లో మాల్దీవులతో భారత సంబంధాలే ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాంశం కావడం గమనార్హం. మాల్దీవులపై డ్రాగన్ దేశం మరోసారి పట్టు సాధించే అవకాశం రావడంతో ఢిల్లీ – మాల్దీవుల బంధానికి ఇది పరీక్షా సమయం. ప్రభుత్వం మారినా, కీలకమైన మాల్దీవుల్లో తన ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయడం భారత్‌కు ఇప్పుడు తప్పనిసరి. అంతేకాక, గడచిన రెండు దశాబ్దాలుగా చైనా తన ప్రాబల్యం పెంచుకొంటూ, మన పెరట్లో తన పట్టు బిగిస్తున్న వైనాన్ని గమనించి జాగ్రత్తపడక తప్పదని మరోసారి రుజువైంది.

భారత్‌కు దక్షిణంగా సుమారు 450 మైళ్ళ దూరంలో, కేవలం 5 లక్షల జనాభా ఉండే మాల్దీవులు చిరు ద్వీపదేశమే. అయితే, హిందూ మహాసముద్రంలో రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గంలో నెలకొన్నందున వ్యూహాత్మకంగా చాలా కీలకం. అందుకే, ఆ దేశాధ్యక్ష పదవికి ఎన్నికలు అనేసరికి భారత, చైనాల్లో ఆసక్తి నెలకొంది. ఒక విధంగా చూస్తే ఈ ఎన్నికలు... ద్వీపదేశంపై భారత, చైనాల్లో ఎవరికి పట్టు ఎక్కువుందో తెలియపరిచే ప్రజాభిప్రాయ సేకరణ పోటీ లాంటివి. రాజధాని మాలే నగరానికి ప్రస్తుతం మేయర్‌గా ఉంటూ, దేశాధ్యక్ష పదవికి పోటీ పడ్డ ముయిజు మొదటి నుంచి చైనాతో సన్నిహిత సంబంధాల్ని కోరుకుంటున్నారు. నిజానికి, జనంతో క్రిక్కిరిసిన రాజధానిలో జాగా కొరత వల్ల తలెత్తిన గృహవసతి సమస్య, తరిగిపోతున్న డాలర్ రిజర్వులు సహా అనేక అంశాలు ఈ ఎన్నికల ప్రచారంలో ముందుకు వచ్చాయి. అయితే, చివరకు మాల్దీవుల భవితపై ఆసియాలోని రెండు అగ్రదేశాల ప్రభావం చుట్టూరానే ఓటింగ్ సరళి సాగింది. దాదాపు 85 శాతానికి పైగా ఓటింగ్‌లో పాల్గొన్న ఈ ఎన్నికల్లో ఓటర్లు భారత, చైనా వర్గాలుగా చీలిపోయారని చెప్పవచ్చు.

ఇరుగుపొరుగు దేశాల్లో పలుకుబడిని పెంచుకొనే ప్రయత్నాలు భారత, చైనాలు రెంటికీ కొత్త కాదు. 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బీఆర్ఐ) కింద అభివృద్ధి రుణాలతో మాల్దీవుల్లో చైనా ముందుగా అడుగేసింది. ఇటీవల కొన్నేళ్ళుగా భారత్ తన పట్టు చాటింది. నిరుడు శ్రీలంక ఆర్థిక వ్యవస్థ పతనమైనప్పుడు వందల కోట్ల డాలర్ల సాయం అందించిన ఢిల్లీ 2018లో సోలిహ్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి ద్వీపదేశంలో తన ఉనికిని విస్తరించింది. ప్రాజెక్టులూ పెరిగాయి. నిజం చెప్పాలంటే – గతానికి భిన్నంగా గత అయిదేళ్ళలో భారత అనుకూల సోలిహ్ పాలనలో మాల్దీవుల్లో శాంతి, స్వేచ్ఛ నెలకొన్నాయి. అంతకు ముందు అయిదేళ్ళు ప్రస్తుతం అవినీతి ఆరోపణలపై జైలులో ఉన్న చైనా అనుకూల అబ్దుల్లా యమీన్ పాలన సాగింది. అయితే, ప్రస్తుత సర్కార్ మాల్దీవుల సార్వభౌమాధికారాన్ని భారత్‌కు తాకట్టు పెడుతోందనే భావనను జనంలో ప్రతిపక్ష కూటమి కల్పించగలిగింది. 'ఇండియా అవుట్' అనే దాని నినాదాల భావోద్వేగం ఫలించింది.

సెప్టెంబర్ మొదట్లో జరిగిన తొలి రౌండ్ ఓటింగ్‌లో 8మంది అభ్యర్థుల్లో సోలిహ్‌కు 36 శాతం, ముయిజుకు 46 శాతం వచ్చినా, ఎవరూ అర్ధశతం దాటలేదు. అలా అదనపు రెండో విడత ఓటింగ్ అవసరమైంది. ఈసారి ప్రతిపక్ష ముయిజు స్పష్టమైన విజేతగా నిలిచారు. బ్రిటన్‌లో చదువుకొని, సివిల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేసి, ఇప్పుడు అధ్యక్షుడిగా ఎన్నికైన 45 ఏళ్ళ ముయిజు రాజకీయాల్లోకి రాక ముందు ప్రైవేట్ రంగంలో ఇంజనీర్. మాలేకు మేయర్ అవడానికి ముందు ఆయన గృహ నిర్మాణ శాఖ మంత్రిగా వ్యవహరించారు. తాజా ఎన్నికల్లో ముయిజు గెలుపునకు సోలిహ్ తప్పులూ కారణమే. దేశానికి భారత్ నుంచి పెట్టుబడులు, అభివృద్ధి సాయం అందుతున్న మాట అటుంచి, ఓ చిన్న భారత సైనికదళాన్ని దేశంలోకి తెచ్చారన్న ప్రత్యర్థుల ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టలేకపోయారు. అలాగే, దేశాధ్యక్షుడయ్యేందుకు తనకు సాయపడ్డ బాల్యమిత్రుడు పార్టీని చీల్చి, కొత్త కుంపటి పెట్టే పరిస్థితి తెచ్చుకున్నారు. ఆ పార్టీ 7 శాతం ఓట్లు సాధించడం పెద్ద దెబ్బ అయింది.

భారత్ సంగతికొస్తే ఈ ఫలితాల్ని అతిగా అంచనా వేసినా తప్పే! అలాగని తక్కువగా అంచనా వేసినా చిక్కే!! భౌగోళిక సామీప్యం, ఉమ్మడి భద్రతా ప్రయోజనాలు, సాంస్కృతిక సాన్నిహిత్యం రీత్యా మాలేతో మనది లోతైన బంధం. కానీ, ఇండో– పసిఫిక్, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో చైనా తన ఛాయను విస్తరిస్తూ, ఆర్థిక – వ్యూహాత్మక గణితంలో మాలేను తెలివిగా భాగం చేసుకుంది. సోలిహ్ పాలనలో గణనీయంగా పెట్టుబడులు పెట్టి, 'గ్రేటర్ మాలే కనెక్టివిటీ ప్రాజెక్ట్' సహా అనేక ప్రాథమిక వసతులకు ఆర్థిక సాయం చేసిన భారత్ ఇప్పుడు చాకచక్యంగా వ్యవహరించాలి. మాలేతో మనది ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేని సుస్థిర బంధమని చాటాలి. కొత్త సర్కారుతో స్నేహానికి భారత విదేశాంగ విధాన వ్యవస్థ శ్రమించాలి. భారత వ్యతిరేక అపోహలు పోగొట్టేలా రాజకీయంగా అన్ని పార్టీలతో సుహృద్భావం పెంచుకోవాలి. ఇండియా పొడ గిట్టని యమీన్ రేపు మళ్ళీ తెర వెనుక చక్రం తిప్పుతారని భావిస్తున్న వేళ... కొత్త అధ్యక్షుడికి ఇప్పటికే అభినందనలు తెలిపిన భారత్ అంతటితో ఆగక మరింత ముందడుగు వేయాలి. హిందూ మహాసముద్రంలో మన వ్యూహాత్మక ప్రయోజనాలకు దెబ్బ తగలకపోవడమే ప్రాథమ్యం కావాలి!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.8.46 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మృగశిర రా.11.27 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.37 వరకు తదుపరి ప.2.37 నుండి 3.23 వరకు, **అమృత ఘడియలు:** ప.2.21 నుండి 4.02 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.45
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

బిల్లు ఆమోదంతోనే సరిపోతుందా?

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహిళల శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా ఉపయోగించుకొనేందుకు బహుముఖ వ్యూహాలను అనుసరిస్తున్నారు. లింగ వైవిధ్యం కలిగిన రంగాలు వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇది చట్ట సభలకు సైతం వర్తిస్తుంది. ఎక్కువ మంది మహిళలు భాగస్వాములైతే – నేర, అవినీతిమయ స్వభావాల నుంచి ప్రేమ, వాత్సల్య స్వభావాలకు రాజకీయాలను మార్చడానికి దోహదపడుతుందని సామాజికవేత్తల అంచనా. మహిళా బిల్లు ఆమోదం పొందడం ఓ చరిత్రాత్మక ఘట్టమే. కానీ, ఈ చట్టం విజయవంతం కావాలంటే పార్టీల స్వరూప స్వభావాలు మారాలి. అన్ని పార్టీలూ మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి, వారి నాయకత్వాన్ని ప్రోత్సహించాలి.

చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఎట్టకేలకు పార్లమెంట్ ఆమోదం పొందడం దేశ చరిత్రలో మైలురాయి. పార్టీలకు అతీతంగా విస్తృత స్థాయిలో ఈ బిల్లుకు ఆమోదం లభించినందున రెండో దశలో కనీసం 15 రాష్ట్రాల అసెంబ్లీలు ఈ బిల్లుకు అడ్డు చెప్పేందుకు ఆస్కారం లేదు. ఆ ప్రక్రియ కూడా పూర్తయితే 2026 నుంచి రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. ఆ లోగా కులగణన, నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలు ముగియాలి. ఎంతో వ్యవధి పట్టే ఈ కార్యక్రమాలు 2026 లోపు పూర్తవుతాయా? అందుకే కాబోలు, కాంగ్రెస్ నేత ఒకరు ఈ బిల్లును 'పోస్ట్ డేటెడ్ చెక్'తో పోల్చారు. ప్రాంతీయ పార్టీలపై నెపాన్ని నెట్టి 2004–14 మధ్య పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును అటకెక్కించింది. ఆ విధంగా చూసినపుడు చెల్లని చెక్కు కంటే పోస్ట్ డేటెడ్ చెక్ మేలు కదా? తాము అధికారంలో ఉన్నప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేసే అవకాశాన్ని జారవిడుచుకొన్నామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ బిల్లులో ఓబీసీ మహిళలకు ఉపకోటా ఉండాలన్న డిమాండ్ దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు చేస్తున్నందున భవిష్యత్తులో అందుకు అవసరమైన సవరణలు జరుగుతాయనే ఆశించాలి.



భారతదేశంలో అనాది నుంచి మహిళల పట్ల భిన్నమైన దృక్పథాలు చూపడం కనిపిస్తుంది. ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు మహిళను మాతృమూర్తిగా చూపిస్తూ ఉన్నత స్థానాన్ని కల్పించాయి. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ సిరులు పండుతాయని భారతీయులు పవిత్రంగా భావించే వేదాలు ఘోషించాయి. అదే సమయంలో 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హసి' అంటూ మహిళల స్వేచ్ఛను అణచివేసే అనేక దురాగతాలు భారత ఉపఖండంలో జరిగాయి.

స్వాతంత్ర్యానంతరం వివిధ చట్టాల ద్వారా బాల్య వివాహాలు, సతీసహగమనం, వితంతు వివాహాల నిషేధం వంటి దురాచారాలను సరిదిద్దడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ చట్టాల కంటే సంప్రదాయాలకే మొగ్గుచూపే భారతీయ సమాజంలో చట్టాల వల్ల ఒనగూరిన ప్రయోజనం తక్కువే! చట్టాల అమలు కంటే ప్రజా చైతన్యం ద్వారా మొదలయిన సంస్కరణోద్యమాలు చక్కని ఫలితాలు అందించాయి. సావిత్రీబాయి పూలే మహిళా విద్య కోసం చేసిన కృషి, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి రచయితలు, సంఘసంస్కర్తలు తెలుగునాట వితంతు వివాహాలు జరగడానికి చేసిన కృషి చెప్పుకోదగ్గది. జాతీయోద్యమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడానికి గాంధీజీ కృషిచేశారు. ఆయన తన సతీమణి కస్తూర్బాను వివిధ ఉద్యమాలలో పాల్గొనేలా ప్రోత్సహించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలలో మహిళలు గణనీయ సంఖ్యలో పాలుపంచుకొన్నారు. గొప్ప కవయిత్రిగా పేరు తెచ్చుకొన్న సరోజినీ నాయుడు గాంధీజీ చొరవతోనే అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలై, రాజకీయాలలో మహిళలు ప్రవేశించడానికి ప్రేరణగా నిలిచారు. ప్రపంచంలోనే అతిగొప్ప ఉద్యమాలలో ఒకటిగా చెప్పుకొనే తెలంగాణ సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రాంత గ్రామీణ పేద మహిళలు ప్రముఖ పాత్ర పోషించారు. వీరమహిళ చాకలి ఐలమ్మ ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారు. ఇందిరా గాంధీ, జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ, విజయరాజె సింధియా వంటి వారు రాజకీయాలలో మహిళలు చురుకైన భాగస్వామ్యం వహించడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

ఇక 1983లో నందమూరి తారక రామారావు మహిళలకు తండ్రి ఆస్తిలో సగభాగం దక్కేలా చట్టం చేయడం, స్థానిక సంస్థలలో తొలిసారిగా 9 శాతం రిజర్వేషన్లు అందించడం చారిత్రాత్మక ఘట్టాలుగానే పరిగణించాలి. ఆ తర్వాత డా. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా అమలు చేసిన మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, అభయహస్తం వంటి పథకాలు మహిళల్ని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని రకాల నామినేటెడ్ పదవులలో పార్టీ పరంగా 40 శాతంకు పైగా అందిస్తూ, చిత్తశుద్ధి ఉంటే మహిళలకు రిజర్వేషన్లే ఉండాలన్న నిబంధన అవసరం లేదని రుజువు చేశారు.

'జిందా తిలిస్మాథ్' కాదు!

మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఒక్క ఎంఐఎం తప్ప పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడం విశేషం. దీనిని బట్టి ఆయా పార్టీలలో ఉన్న పురుషాధిక్యత తొలగిపోయిందనుకుంటే పొరపాటే! ముఖ్యంగా అధికార భారతీయ జనతా పార్టీ ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవడం ద్వారా మహిళల సమస్యలన్నింటినీ పరిష్కరించేసినట్లు ప్రచారం చేసుకొంటోంది. కాంగ్రెస్ పార్టీ, ఇంకా కొన్ని పార్టీలు తాము ఎక్కడ వెనకబడిపోతామో అనే భయంతో అసలు మహిళా బిల్లును ముందుకు తెచ్చింది 'మేమంటే మేము' అని తమను తామే అభినందించుకోవడం విడ్డూరం. చట్టసభలలో మహిళల సంఖ్య పెరిగినంత మాత్రాన వారికి సంబంధించిన సమస్యలన్నీ పరిష్కారం కాజాలవు. అదే నిజమైతే స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్లు పొందుతున్న మహిళలు తమ ప్రాంతాలలో ఏవైనా అద్భుతాలు సాధించారా? వారికి ఆ అవకాశం లభించకపోవడానికి కావడమేమిటి? జిల్లా పరిషత్‌ల పరిధిలో బాలికల విద్య, వైద్యం, ఉపాధికి సంబంధించి ఏవైనా ప్రత్యేక ప్రణాళికలు అమలు జరుగుతున్నాయా? ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు తగినన్ని మరుగుదొడ్లు లేనందున 'డ్రాపవుట్లు' ఎక్కువగా ఉంటున్నాయి. స్థానిక ప్రభుత్వాలలో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగినప్పటికీ ఎందువల్ల మహిళలకు సముచిత న్యాయం జరగడం లేదు? కొన్ని ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను మహిళల పేరిట అందజేస్తున్న మాట నిజమేగానీ, మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, గృహ హింస, మహిళల అదృశ్యం (ఉమెన్ ట్రాఫికింగ్) మొదలైన కేసుల్లో ఎంతో వెనుకబడి ఉన్నాం.

మహిళా బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడం ఓ చారిత్రాత్మక ఘట్టమే. కానీ, ఈ చట్టం విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీల స్వరూప స్వభావాలు మారాలి. సమ సమాజమే ధ్యేయం అని చెప్పుకొంటూ మహిళల సమస్యలపై ఉద్యమించడానికి ప్రత్యేక అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసుకొన్న కమ్యూనిస్టు పార్టీల పొలిట్ బ్యూరోలలో, సెంట్రల్ కమిటీలలో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రం. మహిళా బిల్లు ఘనత తమదేనని చాటుకొంటున్న బీజేపీ కార్యవర్గంలోకి 33 శాతం మంది మహిళల్ని ఎప్పుడు నియమిస్తారు? రాజకీయ పార్టీలలో ముందుగా భాగస్వామ్యం లేకుండా వారిని చట్టసభలకు పంపడం ఏ విధంగా సాధ్యపడుతుంది? మహిళా బిల్లు అమలు కావడానికి ఇంకా సమయం ఉంది కనుక, ఈలోపే అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి వారి నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. కీలకమైన పదవులలో వారికి స్థానం కల్పించాలి. ప్రతి నిర్ణయంలో వారికి భాగస్వామ్యం ఉండాలి. ఇదంతా ఓ సుదీర్ఘ ప్రక్రియ. ఇందుకు భారతీయ జనతా పార్టీతోపాటు అన్ని రాజకీయ పార్టీలు తగిన కార్యాచరణ చేపడితేనే, మహిళా సాధికారత పట్ల వారికున్న చిత్తశుద్ధి తేటతెల్లం అవుతుంది. ఈ రాజకీయ ప్రక్రియ లేకుండా మహిళా బిల్లును కేవలం ఓ 'స్కీమ్'లా అమలు చేయాలని చూస్తే ఫలితాలు అందవు. లేకుంటే, ఆపరేషన్ విజయవంతమేగానీ రోగి బతకలేదన్నట్టు ఇదొక ప్రహసనంలా మిగిలిపోతుంది.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అద్భుత భారత్

ఇండియాలో మొదటిసారి ప్రదర్శన ఇవ్వడం అద్భుత అనుభవం! ఘన చరిత్ర, రుచికరమైన వంటలు, గొప్ప వాదనలు పంచుకున్నందుకు ఇండియాకు ధన్యవాదాలు. ఢిల్లీ, ముంబయిల్లోని షోలకు వచ్చి మరిచిపోలేకుండా చేసిన అందరికీ థాంక్యూ. బెంగళూరు! మన కథ ఇంకా కాలేదు. మరోసారి వస్తాను. దాన్ని గొప్ప షోగా చేద్దాం (అక్కడ షో రద్దయింది). – ట్రెవర్ నోవా, దక్షిణాఫ్రికా కమెడియన్

బాధ్యత లేదా?

బెంగళూరులో ట్రెవర్ నోవా షో రద్దవడానికి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సమస్యలుంటాయని అర్థం చేసుకోగలను. ప్రతి కళాకారుడికి నిర్దిష్టమైన అవసరాలుంటాయి. బాధ్యత గల కళాకారుడు ప్రదర్శనకు ముందే 'సౌండ్‌చెక్' చేసుకోవాలి. 'వేదిక రెక్కీ' జరపాలి. ట్రెవర్ అవేమీ చేయకుండా నిర్లక్ష్యం చూపారు. అభిమానులు నష్టపోయారు. – రిక్కీ కేజ్, మ్యుజీషియన్

అదే ముఖ్యం

తన తీరం నుంచి ఇండియా సైనికులు వెళ్లిపోవాలన్న మాల్దీవుల నిర్ణయాన్ని మనం గౌరవించాలి. కానీ ఈ విధానం చైనాకు కూడా వర్తింపజేయాలని ఇప్పుడూ, తర్వాతా నొక్కి చెప్పాలి. – హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

జీవిత కథ

'ద కైట్ రన్నర్' నవల వచ్చి 20 ఏళ్లయింది. ఈ నవల నాకు చాలా ప్రత్యేకమైనది. అది నా జీవితాన్ని మార్చేసింది. ఇంకా ముఖ్యంగా, అన్ని జాతులు, సంస్కృతుల పాఠకులకు అఫ్గాన్ జీవితాన్ని లోతుగా, సూక్ష్మంగా అర్థం చేసుకోవడంలో సాయపడింది. – ఖాలిద్ హొస్సేనీ, రచయిత

కారణాలు పట్టవా?

మహారాష్ట్ర, నాందేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఔషధాల కొరతతో 31 మంది నవజాత శిశువులు మరణించారు. ఇది వైద్యుల కన్నా, పరిపాలనా సంబంధ వైఫల్యం. సంఘటన వెనుక కారణాలు తెలుసుకోవాల్సింది పోయి, డీన్ డాక్టర్ శ్యామ్‌రావు వాకోడేతో (శివసేన) ఎంపీ హేమంత్ పాటిల్ టాయ్‌లెట్లు శుభ్రం చేయించారు. చూడ్డానికి కూడా బాధేసింది. దేశంలో వైద్యుల పరిస్థితి ఇలా ఉంది. – ధ్రువ్ చౌహాన్, వైద్యుడు

ఎవరికి అమ్మేస్తున్నారు?

రేపు ప్రపంచ కప్ మొదలవుతున్న నేపథ్యంలో.. మన దేశంలో జరిగే ఏ క్రికెట్ ఉత్సవ సందర్భంగానైనా తన వికృత రూపంతో తలెత్తే ఒక ప్రశ్న ఉంటుంది. టికెట్లు ఇచ్చే ప్రక్రియ. అది ఎలా ఒక సాధారణ అభిమానిని దోచుకుంటున్నది అనేది. ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో జారీ చేసే టికెట్ల ప్రక్రియ పారదర్శకంగా ఉంటోంది. అలాంటి ఒక మంచి విధానానికి మారడం అంత కష్టమా? – రాహుల్ రవీంద్రన్, నటుడు

ఏ వినాశనానికి?

చూస్తుంటే, సిక్కింలో తీస్తా నది మీద నిర్మించిన పూర్తి జలవిద్యుత్ ప్రాజెక్టు కొట్టుకుపోయినట్టుంది. 'జీఎల్ఓఎఫ్'(హిమానీ నదాల వల్ల ఉన్నట్టుండి వరద పోటెత్తడం) లేదా తీవ్ర వాతావరణంతో భారీ వినాశనం ఉండొచ్చని నిపుణులు 2013 లోనే హెచ్చరించారు. హిమాలయాలు భారీ మౌలిక సదుపాయాల కోసం కాదని మనం ఎప్పుడు నేర్చుకుంటాం? – బహార్ దత్, కన్జర్వేషన్ బయాలజిస్ట్

ఇన్ బాక్స్

ఓ ఆదివాసీ వీరనారి పోరాటం

మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి వీరమరణం పొందిన ఆదివాసీ వీరనారి రాణి దుర్గావతి. మధ్యప్రదేశ్‌లోని గోండు తెగకు చెందిన బుందేల్ ఖండ్ సంస్థానాధీశుడు చందవేల్‌కు 1524 అక్టోబర్ 5న దుర్గావతి జన్మించింది. దుర్గావతి భర్త దళపత్ షా గోండు రాజ్యాన్ని పాలిస్తూ మరణించాడు. కుమారుడు వీరనారాయణ్ మైనర్ కావడంతో దుర్గావతి గోండ్వానా రాజ్య పాలన చేపట్టింది. రాణి దుర్గావతి పైనా, ఆమె పాలిస్తున్న గోండ్వానా రాజ్య సంపద పైనా మనసు పారేసుకున్న అక్బర్ సేనాని ఖ్వాజా అబ్దుల్ మజీద్ అసఫ్ ఖాన్... అక్బర్ అనుమతిని తీసుకొని గోండ్వానాపై దండెత్తాడు. సుశిక్షితులైన వేలాది మొఘల్ సైనికులు ఒకవైపు, అసంఘటితమైన ఆదివాసీ సైన్యం ఒకవైపు యుద్ధ రంగంలో తలపడ్డారు. మొఘల్ సైన్యానికి ఆధునిక ఆయుధాలు ఉన్నాయి. కానీ ఆదివాసీ సైనికులకు సంప్రదాయ ఆయుధాలే దిక్కయ్యాయి.

మొఘల్ సైన్యం రాకను తెలుసుకున్న దుర్గావతి రక్షణాత్మకంగా ఉంటుందని భావించి 'నరాయ్' అనే ప్రాంతానికి చేరుకొంది. ఇక్కడ ఒకపక్క పర్వత శ్రేణులు ఉండగా మరోపక్క గౌర్, నర్మద నదులు ఉన్నాయి. ఈ లోయలోకి ప్రవేశించిన మొఘల్ సైన్యంపై గెరిల్లా దాడులకు దిగింది దుర్గావతి. ఇరువైపులా సైనికులు మరణించారు. దుర్గావతి ఫౌజ్‌దార్ అర్జున్ దాస్ వీరమరణం పొందాడు. ఆమె గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తే సైనికాధికారులు రాత్రి గుడ్డి వెలుతురులో ప్రత్యక్ష యుద్ధం చేయాలని సలహా ఇచ్చారు. మరుసటిరోజు ఉదయానికి పెద్ద తుపాకులను వాడమని మొఘల్ సైన్యాధికారి అసఫ్ ఖాన్ సైనికులను ఆదేశించాడు. రాణి ఏనుగునెక్కి మొఘల్ సైనికులపై విరుచుకుపడింది. యువరాజు వీర్ నారాయణ్ కూడా యుద్ధరంగంలోకి దూకి మొఘల్ సైనికులను మూడుసార్లు వైనక్కి తరిమాడు. కానీ అతడు తీవ్రంగా గాయపడడంతో సురక్షితమైన ప్రదేశానికి వెళ్లిపోయాడు. రాణి దుర్గావతికి కూడా చెవి దగ్గర బాణం తగిలి గాయపడింది. ఆ తర్వాత ఒక బాణం ఆమె గొంతును చీల్చివేసింది. వెంటనే ఆమె స్పృహ కోల్పోయింది. స్పృహ వచ్చిన తర్వాత ఆమె ఏనుగును తోలే మావటి యుద్ధ రంగం నుంచి సురక్షిత ప్రదేశానికి తప్పించుకు వెళదామని సలహా ఇచ్చాడు. ఆమెకు అపజయం ఖాయం అని అర్థమయ్యింది. శత్రువుకు భయపడి పారిపోవడం లేదా అతడికి చిక్కి మరణించడం అవమానకరం అని భావించి తన సురకత్తిని తీసుకుని పొడుచుకొని ప్రాణాలు వదిలింది రాణి. దీంతో ఒక మహోజ్వల ఆదివాసీ తార నేలకొరిగినట్లయ్యింది.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ,
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి
(నేడు రాణి దుర్గావతి 500వ జయంతి)

భారత్‌లో మైనార్టీలు భద్రంగా లేరా?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

భారతదేశంలో మైనార్టీల హక్కులకు భంగం కలుగుతోందని అమెరికా 'అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్' (యూఎస్‌సీఐఆర్ఎఫ్) భారత దేశ సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా రిపోర్టులను తయారు చేసిన విషయం ఈ దేశ ప్రజలలో చాలా మందికి తెలియదు. అమెరికా మత, రాజకీయ ప్రయోజనాలను కాపాడడం కోసం 1998లో అమెరికా ఫెడరల్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న ఒక సలహా సంస్థే ఈ యూఎస్‌సీఐఆర్ఎఫ్. అమెరికా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎక్కడ కార్యక్రమాలు జరిగినా, ఆగమేఘాలపై రిపోర్టులను తయారు చేసి, ఐక్యరాజ్యసమితి ముందు ప్రవేశపెట్టి, ప్రపంచంలోని సార్వభౌమాధికార దేశాలను ఇబ్బంది పెట్టడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. తాజాగా ఐక్యరాజ్యసమితిలో ఈ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ, భారత దేశంలో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు తదితర మైనార్టీ మతాలవారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, వారి కనీస హక్కులకు భంగం కలిగించేలా భారతదేశంలో పరిస్థితులు ఉన్నాయని పేర్కొనడం గమనార్హం.



గత ప్రభుత్వాలు ఉన్నప్పుడు అమెరికా ఆయిల్, ఫార్మా, డిఫెన్స్ లాబీయింగ్ యథేచ్ఛగా నిర్వహించి, తన దేశ ప్రయోజనాలను నెరవేర్చుకునేది. మోదీ ప్రభుత్వంలో ఇవి సాగడం లేదు. ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని భారతదేశం తనకు అనుకూలంగా మలుచుకుని, తక్కువ ధరలకు రష్యా నుండి ఆయిల్‌ను సమకూర్చుకోవడం, తక్కువ ధరలకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఆయుధాలను తూర్పు ఆసియా దేశాలకు అమ్మడం, కరోనా టీకాను ప్రపంచంలో అన్ని దేశాల కంటే ముందు ప్రవేశపెట్టడం ఇత్యాది విషయాలన్నీ అమెరికాకు కోపం తెప్పించేవే.

నిజంగా భారతదేశంలో మైనార్టీలు భద్రంగా లేరా అనే విషయాన్ని ఒకసారి పరిశీలిద్దాం. మొదట ముస్లింల సంగతి చూద్దాం. ప్రపంచంలో ఏ దేశంలో లేని భద్రత భారతదేశంలోని ముస్లింలకు ఉంది. వారి ఓటు బ్యాంకు కోసం అన్ని రాజకీయ పార్టీలూ సాగిలపడడం మనం చూస్తూనే ఉన్నాం! ఇక నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ముస్లింలకు భద్రత కరువైందని చెప్పడం ఒక దుష్ప్రచారం. వక్రబుద్ధితో కూడిన విష ప్రచారం. ఈ దేశంలో భద్రత లేకపోతే బర్మా, బంగ్లాదేశ్‌ల నుండి లక్షల సంఖ్యలో ముస్లింల అక్రమ వలసలు ఎందుకు జరుగుతున్నట్లు? 1947లో మతం ప్రాతిపదికగా ముస్లింలకు పాకిస్తాన్ ఏర్పాటయ్యింది అనేది వాస్తవం కాదా? అటువంటి పాకిస్తాన్‌లో మైనారిటీలైన హిందువుల పరిస్థితి ఎలా ఉందో ప్రపంచానికి తెలియని విషయమేమీ కాదు. ఇక క్రైస్తవుల విషయానికొస్తే – ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాలు క్రైస్తవ మెజార్టీ రాష్ట్రాలుగా ఎలా రూపుదిద్దుకున్నాయి? ఇక మోదీ ప్రభుత్వం ప్రభుత్వ పథకాల అమలు చేయడంలో మతపరమైన వివక్షతలను ఎక్కడా చూపడం లేదనే విషయం స్పష్టం. కాశ్మీరు లోయ నుండి 3 లక్షల మంది హిందువులను తరిమి వేయడం, అనేక మందిని హత్య చేయడం వంటి విషయాలను ఏనాడు ప్రశ్నించని అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ నిప్పు లేకుండానే పొగ ఎందుకు పెట్టింది అనే మర్మాన్ని ఈ దేశ ప్రజలు త్వరలోనే గ్రహిస్తారు.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

దానం – ధర్మం

ప్రతి మనిషి కష్టపడి తన బతుకును తాను బతకాలి. తనపై ఆధారపడిన వారిని కూడా పోషించాలి. వారి ఆలన పాలన సరిగా చూసుకోవాలి. దీనంతటికీ డబ్బు కావాలి. న్యాయమైన మార్గంలో డబ్బు సంపాదించాలి. అలా సంపాదించిన సొమ్ములో కొంతైనా దానధర్మాలకు వెచ్చించాలి. తరతరాలుగా ఇది పెద్దలు చెబుతూ వస్తున్న మాట. తాను కష్టపడి సంపాదించుకొన్న సొమ్ము అయినప్పటికీ, అనుకున్నది అనుకున్నట్లుగా జరిగి, చేసే పని సఫలం చెంది, సంపాదన తనది కావడం మాత్రం దైవ కృప లేకుండా జరుగదన్నది ఆ మాటల వెనక దాగి ఉన్న పరమార్థం. అందుచేతనే, భాగ్యవశాన సమకూడిన దైవకృపకు కృతజ్ఞతగా, సంపాదించుకున్న సొమ్ములో తన శక్తి మేరకు దానధర్మాలకు వెచ్చించడమన్నది నియమంగా పెట్టుకొనడం మంచిదని పెద్దలు చెప్పారు.

జ్యోతిర్మయం

అలా కాకుండా సంపాదించినదంతా 'నా సొంతకష్టంతోనే కాబట్టి, మొత్తాన్ని నేనే అనుభవిస్తాను, నా పొట్ట నే నింపుకుంటాను తప్ప దాన ధర్మాలకు ఖర్చు చేయను' అని అనుకుంటే, ఆ ఆలోచన సరైనది కాదని, అలా ఆలోచించి తదనుగుణంగా నడుచుకునే వ్యక్తి కంటె కాయకష్టం చేసి మనిషికి సహాయపడే మూగజీవాలు మేలైనవనే ఆలోచన కొన్ని శతాబ్దాల క్రితం నుండి ప్రజల మనసులలో ఆమోదం పొంది ఉంది. ఆ ఆలోచననే క్రీ.శ. 15–16 శతాబ్దాలకు చెందిన కవి కొఱవి గోపరాజు తాను రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యం, షష్ఠాశ్వాసంలోని ఈ కింది ఆటవెలది పద్యంలో చెప్పాడు.


దానధర్మములకు బూనక తన పొట్ట
నినుపుకొన దలంచు జనుడె పశువు
పసరమైన మెఱుగు బండియీడుచు దున్ను
నంతకంటె గష్టుడండ్రు బుధులు.

'దానం, ధర్మం అనే ఆలోచన ఏమాత్రం చేయకుండా, ఎప్పుడూ తన పొట్టను మాత్రమే నింపుకోవాలనే ఆలోచన చేసే వాడ... బండి లాగుతూ వ్యాపారస్థుడికీ, సగటు మనిషికీ, పొలం దున్నుతూ వ్యవసాయదారుడికీ ప్రతి రోజూ సాయపడే గోమహిష జాతిదైన మూగజీవి కంటె తక్కువైన వాడని పెద్దలు చెబుతారు' అని పై పద్యం భావం.

– భట్టు వెంకటరావు

చట్టసభల్లో ప్రమాణాలు నెలకొల్పిన దేవేందర్‌గౌడ్: వెంకయ్య నాయుడు

- ఎంపీగా, తెలంగాణ ఉద్యమకారుడిగా రాజ్యసభలో గళం విప్పిన నేత
- మాజీమంత్రి దేవేందర్‌గౌడ్ ప్రసంగ పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య. చిత్రంలో దేవేందర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో నాణ్యమైన ప్రసంగాలతో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పిన నేతల్లో మాజీ ఎంపీ, మాజీమంత్రి దేవేందర్‌గౌడ్ ఒకరని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రశంసించారు. రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు ఆదర్శప్రాయంగా నిలవడం గొప్ప విషయమన్నారు. టి.దేవేందర్‌గౌడ్ పార్లమెంటు, శాసనసభల్లో చేసిన ప్రసంగాలు, ఆయన అంతరంగంపై 'సేవ, స్ఫూర్తి, నిబద్ధతతో ప్రజల కోసం ప్రయాణం'పేరిట ముద్రించిన పుస్తకాలను బుధవారం వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవేందర్‌గౌడ్ తన విలువైన అనుభవాలను పుస్తకాలుగా తీసుకురావడం హర్షణీయమన్నారు. దేవేందర్‌గౌడ్ రచించిన పుస్తకాలు భావితరాలకు కరదీపికలని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి పరిస్థితులను, ప్రజల మనోభావాలను అవకాశం వచ్చినప్పుడల్లా రాజ్యసభలో లేవనెత్తారని గుర్తు చేశారు. తెలంగాణ సాధన కోసం ఏకాభిప్రాయ సాధన కోసం చర్చలు జరిపి, పార్టీలతో సమన్వయం చేస్తూ చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు.

చట్టసభలు పటిష్టంగా ఉండాలి

ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే చట్టసభలు పటిష్టంగా ఉండాలని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో సానుకూల దృక్పథం ఉండాలని, రాజకీయ నాయకులు విలువలు పాటించాలని సూచించారు. నిలువుటద్దంగా ఉండాల్సిన పత్రికల ప్రమాణాలు పడిపోతున్నాయని, పత్రికలు ఎప్పుడూ నిష్పాక్షికంగా ఉండాలన్నారు. పత్రికలు సొంత ప్రయోజనాల కోసం విలువల్ని పాటించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ...శాసనసభలో గణాంకాలతో పూర్తిసాధికారతతో మాట్లాడే వక్త దేవేందర్‌గౌడ్ అన్నారు. రచయిత టి.దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ..తనకు చట్టసభల సభ్యుడిగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. దేశ ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు, స్పీకర్‌గా సురేశ్‌రెడ్డి శాసనసభను హుందాగా నడిపిన విషయాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర మేనేజింగ్ ట్రస్టీ విజయేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి దేవాలయానికి ఐటీ నోటీసులు!

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి ఇటీవల ఐటీ నోటీసులు జారీ చేశారు. రూ.11 కోట్లు పన్ను చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నోటీసులో పేర్కొన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఐటీ రిటర్న్‌లు, 12ఏ రిజిస్ట్రేషన్ గడువు గత నెల 30వ తేదీతో ముగిసింది. రిటర్న్స్, 12ఏ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో నోటీసులను జారీ చేశారు.

కట్టు తప్పితే కఠిన చర్యలే!

- ఎన్నికల్లో మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలి
- లేకుంటే తీవ్ర చర్యలు తప్పవంటూ జిల్లా కలెక్టర్లు, పోలీస్ బాస్‌లకు ఈసీ హెచ్చరిక
- డ్రగ్స్ రవాణాకు మార్గంగా రాష్ట్రం మారింది
- మాఫియాతో చేతులు కలిపారా అంటూ ప్రశ్నించిన ఎన్నికల సంఘం
- కలెక్టర్లు, ఎస్పీలు/పోలీసు కమిషనర్లతో సమీక్ష నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘం బృందం



కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో సమావేశమైన కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని, లేనిపక్షంలో తీవ్రమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్లు, ఎస్పీలు/పోలీసు కమిషనర్లకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. శాసనసభ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో ఏమాత్రం నిర్లిప్తత, నిర్లక్ష్యంగా ఉండరాదని, మైండ్‌సెట్ మార్చుకోవాలని తేల్చి చెప్పింది. ఎన్నికల్లో నామమాత్రంగానే డబ్బు, మద్యం జప్తు చేస్తున్నారని, చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని అసహనం వ్యక్తం చేసింది. డ్రగ్స్ రవాణాకు హైదరాబాద్ ప్రధానమార్గంగా మారిందని, గోవా నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్ర, గుజరాత్‌కు పెద్దఎత్తున డ్రగ్స్ రవాణా జరుగుతుంటే ఎందుకు పట్టుకోవడం లేద ని పోలీస్‌శాఖను ప్రశ్నించింది. శాసనసభ ఎన్నికల సన్నద్ధతను పరిశీలించడానికి రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన బృందం బుధవారం రెండోరోజు నగరంలోని ఓ హోటల్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు/పోలీసు కమిషనర్లతో సమీక్ష నిర్వహించింది. గుజరాత్, మహారాష్ట్రలో టన్నుల కొద్దీ డ్రగ్స్ పట్టుపడితే, ఇక్కడ మాత్రం 10, 20 గ్రా ములే పట్టు బడడం పట్ల అనుమానాలు వ్యక్తం చేసింది. మాఫియాతో కుమ్మక్కయ్యారా? అని సూటిగా ఓ ఎస్పీని ప్రశ్నించినట్టు తెలిసింది. ఇక పై నిఘా ఉంచి జప్తు చేస్తామని ఆ ఎస్పీ వివరణ ఇచ్చుకున్నారు. ఓటర్లకు బంగారం, వెండి, వస్త్రాలు వంటి కానుకలు పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలున్నా, ఎందుకు జప్తు కావడం లేదని ప్రశ్నించింది.

సిద్దిపేటలో నగదు దొరకలేదా?

గత శాసనసభ సాధారణ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలో ఎలాంటి నగదు జప్తు చేయకపోవడం పట్ల ఎన్నికల సంఘం తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేసింది. జిల్లాల వారీగా గత ఎన్నికల్లో పట్టుబడిన నగదు, మద్యం, ఇతర కానుకలను పరిశీలించి పెదవి విరిచింది. ఇటీవల జరిగిన కర్ణాటక, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గతంతో పోల్చితే దాదాపు ఐదారు రేట్లు అధికంగా నగదు జప్తు చేశారని, త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో సైతం అలాంటి ఫలితాలు ఆశిస్తున్నామని స్పష్టం చేసింది. ఐఎంఎఫ్‌ఎల్ లిక్కర్ ఎందుకు పట్టుకోవడం లేదని అబ్కారీ, పోలీస్‌శాఖను ప్రశ్నించింది. ఇకపై డబ్బులు, మద్యం, ఇతర కానుకల జప్తుపై ప్రతివారం నివేదిక సమర్పించాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో గతంలో జప్తు చేసిన నగదు, మద్యం చాలా తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఓటర్ల జాబితాలో లోపాలుంటే కలెక్టర్లదే బాధ్యత

బుధవారం ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో లోపాలున్నా, ఓట్లు గల్లంతైనట్టు ఫిర్యాదులొచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని, తీవ్రమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘం హెచ్చరించింది. శేరిలింగంపల్లిలో పెద్ద సంఖ్యలో బోగస్ ఓట్లు ఉన్నట్టు వచ్చిన ఫిర్యాదుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏం చర్యలు తీసుకున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించింది.

'అల్పాహారం' ఎలా?

- విధివిధానాలపై అధికారుల మల్లగుల్లాలు
- మెనూ తేల్చకుండానే అమలుకు సన్నద్ధం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో 'అల్పా హారం' అమలు విధివిధానాల ఖరారు, మెనూపై ఓ స్పష్టత రాకముందే ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్న ఆదేశాలతో అధికారుల్లో హడావుడి మొదలైంది. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని దసరా రోజు ప్రారంభిస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. అయితే వచ్చేవారం ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఈ పథకాన్ని ఈ నెల 6నే మొదలుపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల నుంచి సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. అయితే విద్యార్థులకు ఏ రోజు ఏం ఇవ్వాలనే దానిపై అధికారులు స్పష్టతకు వచ్చినట్టు లేదు. మెనూపై రూపొందించిన నివేదికపై ఈవారం మంత్రి సబితతో సంప్రదింపులు జరపాలని భావించారు. మార్పులు చేర్పులపై అధికారుల్లో నూ తర్జనభర్జన జరుగుతోంది. దీంతోపాటు అల్పాహారం అమలుకు విధి విధానాలు, ఏ అధికారులకు ఏ తరహా బాధ్యతలు అప్పగించాలనే దానిపై విద్యా శాఖ ఇంకా ఓ స్పష్టతకు రాలేదు. కార్యక్రమాన్ని హడావుడిగా ప్రారంభించినా, కొద్దిరోజుల పాటు అమలు మాత్రం కష్టమేనని అధికారులు అంటున్నారు. దీనిపై వివరణ కోరేందుకు విద్యాశాఖ ఉన్నతాధి కారులను సంప్రదించగా, వారు నిరాకరించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటయ్య

- ప్రమాణ స్వీకారానికి మంత్రి హరీశ్ సహా పలువురు ప్రముఖుల హాజరు



బక్కి వెంకటయ్యను అభినందిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా దుబ్బాక నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బక్కి వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. బుధవారం బషీర్‌బాగ్ పరిశ్రమల భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. నూతన చైర్మన్‌తో పాటు సభ్యులుగా కుప్రం నీలాదేవి (ఎస్టీ, ఆసిఫాబాద్), రాంబాబు నాయక్ (ఎస్టీ, దేవరకొండ), కొంకటి లక్ష్మీనారాయణ (ఎస్సీ, కరీంనగర్), జిల్లా శంకర్ (ఎస్సీ, నల్లగొండ), రేణికుంట ప్రవీణ్ (ఎస్సీ, ఆదిలాబాద్) బాధ్యతలు స్వీకరించారు. బక్కి వెంకటయ్య సుదీర్ఘ రాజకీయ, సామాజిక అనుభవం కలిగిన వ్యక్తి అని ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి హరీశ్‌రావు అభినందించారు. హరీశ్‌రావుతో పాటు మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంపీలు బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన చైర్మన్ బక్కి వెంకటయ్య, ఇతర సభ్యులను అభినందించారు.

మంత్రాల నెపంతో వృద్ధురాలిపై దాడి

- చిత్రహింసలు..ఆపై జరిమానా
- ఊరి నుంచి బహిష్కరణ..అండగా నిలిచిన యువకుడిపైనా దాడి

కొత్తగూడెం రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం బావోజీతండా గ్రామంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వారం క్రితం బావోజీ తండాలోని ఓ ఇంటి సభ్యులందరూ వ్యవసాయ పనులకు వెళ్లాక గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఇంట్లోకి ప్రవేశించి అన్నంలో పురుగుమందు కలిపారు. వ్యవసాయపనుల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు ఇంట్లో పురుగుమందు వాసన వస్తుండటంతో ఇంట్లో అంతా పరిశీలించగా..అన్నంలో పురుగుమందు కలిపినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని 15 మంది అనుమానితుల పేర్లను పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఈ ఘటనకు పాల్పడింది ఎవరని తెలుసుకునేందుకు సదరు కుటుంబసభ్యులు ఓ మాంత్రికుడిని ఆశ్రయించారు. అతడు చెప్పిన ఆనవాళ్లతో ఈ ఘటనకు కారకురాలు గ్రామంలో క్షుద్రపూజలు చేసే వృద్ధురాలు కేస్లీగా అనుమానించి మరుసటిరోజు ఆమెపై దాడి చేశారు. దీంతోపాటు ఆమెకు రూ.12 వేల జరిమానా విధించి గ్రామం నుంచి బహిష్కరించారు. ఆ సమయంలో వృద్ధురాలికి అండగా నిలిచిన ఓ యువకుడిపైనా కూడా దాడి చేశారు. ఈ విషయమై యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వృద్ధురాలికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, ఈ ఘటనపై లక్ష్మీదేవిపల్లి పోలీసులను బుధవారం 'సాక్షి' వివరణ కోరగా, ఎస్సై నిజామాబాద్‌లో ప్రధానమంత్రి సభ బందోబస్తుకు వెళ్లి ఇంకా రాలేదని, ఆయన వచ్చాక విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ప్రాజెక్ట్ ఉజాగర్' తొలి బృందం శిక్షణ పూర్తి

- మంత్రి కేటీఆర్‌తో శిక్షణ పూర్తి చేసుకున్న మైనార్టీ మహిళల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న మైనారిటీ మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేందుకు వీ-హబ్ చేపట్టిన 'ప్రాజెక్ట్ ఉజాగర్' మొదటి బృందం విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుంది. మైనారిటీ సంక్షేమ శాఖ, సఫా సొసైటీతో కలిసి వీహబ్ ప్రాజెక్ట్ ఉజాగర్‌ను చేపట్టింది. శిక్షణ పూర్తి చేసుకున్న బృందం బుధవారం మంత్రి కేటీఆర్‌తో భేటీ అయింది. ఆర్థిక అభివృద్ధితోపాటు భవిష్యత్‌లో వాణిజ్యవేత్తలను బలోపేతం చేసేందుకు ఈ తరహా కార్యక్రమాలు దోహదం చేస్తా యని కేటీఆర్ అన్నారు. కాగా, 120కి పైగా మహిళలు ప్రాజెక్టు ఉజాగర్‌లో నమోదు కాగా 49 మంది విజయవంతంగా కోర్సు పూర్తి చేసుకుని గురువారం సర్టిఫికెట్లు అందుకోనున్నారు. కార్యక్రమంలో వీ-హబ్ సీఈఓ దీప్తి రావుల పాల్గొన్నారు.

24 గంటలు కరెంటు ఇవ్వాలి

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



గరిడేపల్లి మండలం కల్మల చెరువు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గరిడేపల్లి: 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కల్మల చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రస్తుతం పంట పొట్టదశలో ఉందని విద్యుత్ కోతలు విధించడంతో పొలాలు తడవక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతోందని, సబ్ స్టేషన్ నుంచి మాత్రం విద్యుత్ సరఫరా జరగడం లేదన్నారు. కనీసం 12 గంటలు అయినా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సాగర్ కాల్వకు నీటి సరఫరా చేయకపోయినా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగితే 80 శాతం పంట రైతులకు దక్కుతుందన్నారు. ధర్నాలో రైతులు సప్పిడి లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచుల అభిరుచి మేరకే దసరా కానుక

- మంత్రి సత్యవతి రాథోడ్



హుస్నాబాద్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

హుస్నాబాద్: ఆడపడుచుల అభిరుచికి తగ్గట్లుగా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలు అందజేస్తున్నారని స్త్రీశిశు సంక్షేమ, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో బుధవారం ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌తో కలిసి మంత్రి మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా పాఠశాల, కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది కోటి మందికి పైగా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.500 కోట్లు వెచ్చించిందన్నారు. దాదాపు 90 లక్షల చీరలు ఆరున్నర మీటర్లు కాగా, ఉత్తర తెలంగాణలో చీరలు కట్టుకునే మహిళలకు 9 గజాల చీరలు ఇచ్చి ఆడబిడ్డలను గౌరవించుకుంటున్నామని తెలిపారు. ఈ రోజే అంగన్‌వాడీలు సమ్మె విరమించారని, మంత్రి హరీశ్‌రావుతో కలిసి తాను అంగన్‌వాడీ సంఘం నాయకులను పిలిచి వారి డిమాండ్లపై చర్చించామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు విధుల్లో చేరి సేవలను కొనసాగించాలని మంత్రి కోరారు.

ప్రజల కోసం కరెంటు తీగలు పట్టుకుంటాం

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి యాదాద్రి: సబ్‌స్టేషన్లలో లాగ్ బుక్‌లు తీసుకొచ్చి 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని నిరూపిస్తే తెలంగాణ ప్రజల కోసం కరెంట్ తీగలు పట్టుకోవడానికి సిద్ధమని మంత్రి కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆలేరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు కొమ్మిశెట్టి నర్సింలు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వంగాల కృష్ణయ్య, మాజీ సర్పంచ్ ఓంకార్ గౌడ్‌తో పాటు మరికొందరు బుధవారం హైదరాబాద్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గృహలక్ష్మి పేరుతో రూ.3 లక్షలు ఇస్తానన్న కేసీఆర్ దాన్ని గాలికి వదిలేశారని, సీఎం ప్రకటించిన పథకాలన్నీ ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే వస్తున్నాయని ఆరోపించారు. నిజామాబాద్ సభలో కేసీఆర్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు వాస్తవమని అన్నారు. ఇప్పటికీ బీఆర్‌ఎస్–బీజేపీ ఒకటేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ బండారం మోదీ బయటపెట్టారని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ చెప్పిన ఆరు గ్యారంటీలు చిన్న పథకాలే అయినా ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఒక వేళ పథకాలు అమలు కాకపోతే.. తాను పదవులకు రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. 60 రోజులు కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో టికెట్లు కన్ఫామ్ అవుతాయని చెప్పారు. తాను ఆలేరు నియోజకవర్గానికి మొదటి ప్రాధాన్యమిస్తానని పేర్కొన్నారు.

ఆస్తి కోసం అమానుషం

- నడిరోడ్డుపై అన్నను కత్తులతో నరికి చంపిన తమ్ముళ్లు
- వనపర్తి జిల్లాకేంద్రంలో ఘటన
- వీపనగండ్లలో ఏపీఓగా పనిచేస్తున్న హతుడు




బద్రీనాథ్

వనపర్తి: ఆస్తి ముందు అన్నదమ్ముల అనుబంధం, చిన్నప్పటి నుంచి కలసి ఉన్న సోదర ప్రేమ చిన్నబోయాయి. నడిరోడ్డుపై సొంత తమ్ముళ్లే తోడబుట్టిన అన్నను కత్తులతో వేటాడి హత్య చేశారు. బుధవారం వనపర్తి జిల్లాకేంద్రంలో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి మండలం రాజపేట పెద్దతండాకు చెందిన మంగ్లీ, పూల్య నాయక్‌లకు ఐదుగురు కుమారులున్నారు. 20 ఎకరాల భూమిని తండ్రి తన కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. రెండో కుమారుడు బద్రీనాథ్ నాయక్ (51) వీపనగండ్లలో ఏపీఓగా పనిచేస్తున్నారు. ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే ఉండడంతో వంశోద్ధారకుడు లేడని.. తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిని పేదలైన తమ్ముళ్లకు ఇవ్వాలనే ప్రతిపాదన కుటుంబంలో తెచ్చారు. అందుకు బద్రీనాథ్ ఒప్పుకోకపోవడంతో, తాను పంచి ఇచ్చిన భూమిని తిరిగి ఇవ్వాలని తండ్రి డిమాండ్ చేయడంతో పాటు కోర్టుకు సైతం వెళ్లాడు. దీంతో అప్పటి నుంచి అన్నదమ్ముల మధ్య విభేదాలు మొదలయ్యాయి. పదేళ్లుగా ఈ ఆస్తి వివాదం కోర్టులో కొనసాగుతుండగానే.. చాలాసార్లు ఘర్షణపడ్డారు. సోదరుల నుంచి ప్రాణభయం ఉండటంతో బద్రీనాథ్ కొంతకాలంగా బయట తిరిగే సందర్భంలో హతీరాం అనే వ్యక్తిని వెంటబెట్టుకునేవారు. బుధవారం విధి నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌కు వచ్చిన బద్రీనాథ్ తిరిగి వెళుతుండగా.. ఇద్దరు తమ్ముళ్లు సర్దార్ నాయక్, కోట్యా నాయక్‌తో పాటు సర్దార్ నాయక్ కుమారుడు పరమేశ్‌లు కాపుకాసి మరికుంట సమీపంలో కత్తులతో దాడి చేశారు. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా విచక్షణారహితంగా నరకడంతో బద్రీనాథ్ అక్కడికక్కడే మృతి చెందారు. పక్కనే ఉన్న హతీరాంకు కత్తి గాయం కావడంతో భయంతో పరారయ్యాడు. అనంతరం రెండు బైక్‌లపై నిందితులు అక్కడి నుంచి పారిపోయి.. వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, నిందితులు తమ అదుపులో ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మహేశ్వర్‌రావు తెలిపారు.

నానో ప్రపంచం దగ్గరయింది

క్వాంటమ్ డాట్స్‌తో బహుముఖ ప్రయోజనాలు

బంగారం ఏ రంగులో ఉంటుందో తెలుసు కదా? ముదురు పసుపునకు కొంత కాంతి చేరిస్తే ఉండే రంగు. కానీ, ఇదే బంగారాన్ని నానోస్థాయిలో.. అంటే మన వెంట్రుకలో పదివేల వంతు సూక్ష్మస్థాయిలో చూస్తే దాని రంగు ఎరుపు లేదా వంగపూతగా కనిపిస్తుంది! అదెలా అని ఆశ్చర్యపోనవసరం లేదు. ఇలా నానోస్థాయిలో పదార్థాల ధర్మాల ఆసరాతో అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ తయారీకి మార్గం చూపిన శాస్త్రవేత్తలకు ఈ ఏడాది రసాయన శాస్త్ర నోబెల్ బహుమతి దక్కిందని మాత్రం తెలుసుకోవాలి! ఆ విశేషాలేమిటో చూసేద్దాం..


అలెక్సీ ఎకిమోవ్

క్వాంటమ్ డాట్స్ తయారీకి బాటలు

నానోటెక్నాలజీ మనకేమీ కొత్త కాదు. చాలా కాలంగా వేర్వేరు రంగాల్లో వాడకంలో ఉన్నదే. స్పష్టమైన, పలుచని ఎల్ఈడీ స్క్రీన్ల తయారీ మొదలుకొని శరీరంలోని కేన్సర్ కణితులను కత్తిరించడం వరకూ రకరకాలుగా నానో టెక్నాలజీ ఉపయోగపడుతోంది. ఈ అత్యద్భుతమైన టెక్నాలజీ ఆవిష్కరణలకు బీజం వేసిన క్వాంటమ్ డాట్స్‌ను తయారు చేసేందుకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేశారు కాబట్టే స్వీడిష్ నోబెల్ అవార్డు కమిటీ.. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన మౌంగి బావెండీ, కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్త లూయిస్ బ్రూస్, నానో క్రిస్టల్స్ టెక్నాలజీ ఇన్‌కార్పొరేషన్‌కు చెందిన అలెక్సీ ఎకిమోవ్‌లకు ఈ ఏడాది రసాయన శాస్త్ర నోబెల్ అవార్డు ప్రకటించింది.

సూక్ష్మస్థాయి కణాల ఉత్పత్తి

రసాయన శాస్త్రం చదువుకున్న వారు ఎవరికైనా మూలకాల ధర్మాలు వాటిలోని ఎలక్ట్రాన్ల సంఖ్యపై ఆధారపడి ఉంటాయని తెలిసే ఉంటుంది. అయితే మూలకం నానోస్థాయికి చేరిందనుకోండి... సాధారణ స్థితిలో ఉండే ధర్మాల స్థానంలో క్వాంటమ్ స్థాయి తాలూకూ ప్రభావం కనిపించడం మొదలవుతుంది. మూలకం సైజును బట్టి ఈ ధర్మాలుంటాయి. ఉదాహరణకు పైన చెప్పుకున్న బంగారం రంగు! అలాగే సైజును బట్టి మూలకాల యాంత్రిక, ఉపరితల, అయస్కాంత, ఎలక్ట్రానిక్, ఆప్టికల్, ఉత్ప్రేరక ధర్మాలు కూడా మారిపోతాయి. సాధారణ సైజులో విద్యుత్తు ప్రవాహాన్ని అడ్డుకోని పదార్థాలు సైజు తగ్గుతున్న కొద్దీ సెమీ కండక్టర్లుగా మారిపోవచ్చు. మరికొన్ని పదార్థాలు సాధారణ సైజులో సెమీకండక్టర్లుగా ఉన్నప్పటికీ నానోస్థాయిలో సూపర్ కండక్టర్లుగా వ్యవహరించవచ్చు. ఇంతటి సూక్ష్మస్థాయిలో ఉండే కణాలను ఉత్పత్తి చేయడంలో ఈ ఏటి రసాయన శాస్త్ర నోబెల్ అవార్డు గ్రహీతలు విజయం సాధించారు. నానో ప్రపంచంలో మూలకాల ధర్మాలు మారిపోతాయని చాలాకాలంగా తెలుసు కానీ..



మౌంగి బావెండీ

వీటితో వాస్తవిక ప్రయోజనం తక్కువని అనుకునేవారు. 1980లో అలెక్సీ ఎకిమోవ్ రంగుల గాజులో క్వాంటమ్ ఎఫెక్ట్‌ను సృష్టించడంలో విజయం సాధించారు. కణం సైజు ఆధారంగా రంగు మారుతుందని ఆయన నిరూపించడంతో క్వాంటమ్ డాట్స్‌పై ఆసక్తి పెరిగింది. కొన్నేళ్ల తరువాత ఒక ద్రవంలో స్వేచ్ఛగా కదులుతున్న కణాల సైజుకు అనుగుణంగా క్వాంటమ్ ఎఫెక్ట్స్ మారుతాయని మొట్టమొదటిసారి నిరూపించగలిగారు.

భవిష్యత్తులో సురక్షితమైన సమాచార వ్యవస్థ!

1993లో మౌంగి బావెండీ రసాయనికంగా క్వాంటమ్ డాట్స్‌ను ఉత్పత్తి చేయడం మొదలు పెట్టడంతో వీటిని మన ప్రయోజనాలకు వాడుకోవడం సులువు అయ్యింది. ఇప్పుడు మన కంప్యూటర్ మానిటర్లు, క్యూఎల్ఈడీ స్క్రీన్‌లో విస్తృత స్థాయి రంగులు వెదజల్లడం ఈ క్వాంటమ్ డాట్స్ పుణ్యమే. అలాగే మన ఎల్ఈడీ బల్బుల రంగులు మారడానికి కూడా ఇవే కారణం. శరీరంలోని కణజాలాన్ని స్పష్టంగా గుర్తించేందుకు బయో కెమిస్టులు, వైద్యులు ఇప్పుడు క్వాంటమ్ డాట్స్‌ను వాడుతున్నారు. భవిష్యత్తులో ఈ క్వాంటమ్ డాట్స్ ద్వారా ఎటు కావాలంటే అటు మడిచే సుకోగల ఎలక్ట్రానిక్స్, అతి సూక్ష్మమైన సెన్సార్లు, పలుచటి సోలార్ సెల్స్ తయారీతో పాటు అత్యంత సురక్షితమైన సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసుకునేందుకూ ఉపయోగపడుతుందని అంచనా.

\- సాక్షి, నేషనల్ డెస్క్


లూయిస్ బ్రూస్

క్వాంటమ్ డాట్స్‌పై పరిశోధనలకు నోబెల్

రసాయన శాస్త్రంలో ముగ్గురు అమెరికా సైంటిస్టులకు ప్రతిష్టాత్మక బహుమతి

స్టాక్‌హోమ్: రసాయన శాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతిని 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' బుధవారం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక బహుమతి ఈసారి ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలను వరించింది. నానో టెక్నాలజీకి సంబంధించిన క్వాంటమ్ డాట్స్ ఆవిష్కరణలో పరిశోధనలకు గాను మౌంగి బావెండీ, లూయిస్ బ్రూస్, అలెక్సీ ఎకిమోవ్‌లకు రసాయన శాస్త్ర నోబెల్ ప్రైజ్ లభించింది. క్వాంటమ్ డాట్స్ విశ్లేషణ, ఆవిష్కరణలో, నానో పార్టికల్స్ అభివృద్ధిలో ఈ ముగ్గురు సైంటిస్టులు కీలక పాత్ర పోషించారని నోబెల్ కమిటీ తెలియజేసింది. 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' అధికారికంగా విజేతల పేర్లు ప్రకటించకముందే ముగ్గురు సైంటిస్టుల పేర్లను స్వీడన్ మీడియా సంస్థలు బహిర్గతం చేయడం కలకలం రేపింది.

ఢిల్లీ మద్యం కేసులో 'ఆప్' ఎంపీ అరెస్ట్

- సంజయ్ సింగ్‌ను నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న అధికారులు
- బీజేపీవి ప్రతీకార రాజకీయాలు: ఆప్

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి మరో షాక్ తగిలింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం అరెస్ట్ చేసింది. ఈ కుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఉదయం నుంచి 10 గంటలకు పైగా ఎంపీ నివాసంలో ఈడీ సోదాలు జరిపింది. అనంతరం సా యంత్రం ఆయనను అదుపులోకి తీసుకుంది. ఈడీ కార్యాలయంలో ఆయన వాంగ్మూలం నమోదు చేశారు. గురువారం మ ధ్యాహ్నం కోర్టులో ప్రవేశపెట్టి విచారణ నిమిత్తం కస్టడీ కోరే అవకాశముంది. ఇప్పటికే ఇద్దరు ఆప్ అగ్ర నేతలైన మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టయిన సంగతి తెలిసిందే. జైన్‌ను 2022 మేలో మనీ లాండరింగ్ కేసులో, సిసోడియా ఈ ఏడాది ఫిబ్రవరిలో మద్యం కేసులో అరెస్టయ్యారు. మద్యం కేసులో ఇప్పటికే అరెస్టై అప్రూవర్ గా మారిన దళారీ దినేశ్ అరోరా స్టేట్ మెంట్ ఆధారంగా సంజయ్ అరెస్టు జరిగింది. ఆయనను 2020లో ఒక రెస్టారెంట్ లో కలిశానని అందులో అరోరా చెప్పారు. ''ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ కు నిధుల కోసం రెస్టారెంట్ యాజమానుల నుంచి ఫండ్స్ సేకరించాల్సిందిగా సంజయ్ నన్ను కోరారు. ఆ మీదట ఆయనకు రూ.82 లక్షలకు చెక్ ఇచ్చా. అమిత్ అరోరా అనే అతను మద్యం దుకాణాన్ని సంజయ్ సింగ్ ద్వారా అప్పటి ఎక్సయిజ్ మంత్రి మనీశ్ సిసోడియాకు చెప్పి షిఫ్ట్ చేయించా'' అని చెప్పారు. కేజ్రీవాల్ ను కూడా ఒకసారి ఆయన నివాసంలోనే కలిశానని, సియోసియతో నాలుగైదుసార్లు ఫోన్లో మాట్లాడనని అన్నారు.


ఎంపీ సంజయ్ సింగ్‌ను అరెస్ట్‌చేసి తీసుకెళ్తున్న దృశ్యం

అవినీతిని ప్రశ్నించినందుకే: ఆప్

సంజయ్ అరెస్టును ఆప్ తీవ్రంగా ఖండించింది. అదానీ గ్రూప్ అవినీతి తదితరాలపై పార్లమెంట్‌లో గళమెత్తినందుకే ఆయనను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించింది. 2024 లోక్ సభ ఎన్నికల్లో ఓటమి తథ్యమని తేలడంతో బీజేపీ ఇలాంటి పనులకు దిగిందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ దుయ్యబట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇలాంటి అరెస్టులు ఇంకా చాలా జరుగుతాయని జోస్యం చెప్పారు. తాము బెదిరేది లేదన్నారు. ''మద్యం విధానంలో కుంభకోణం జరిగిందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. వెయ్యి సార్లకు పైగా సోదాలు, ఎన్నో అరెస్టులు చేశారు. కానీ ఇప్పటిదాకా ఒక్క పైసా కూడా రికవర్ కాలేదు. నిన్న జర్నలిస్టులను కూడా ఇలాగే అక్కసుతో నిర్బంధించారు'' అని మండిపడ్డారు. సంజయ్ నివాసంలోనే గాక స్వగ్రామంలో, ఆఫీస్ లో, ఇంకెక్కడ సోదాలు చేసినా ఏమీ దొరకదని ఆప్ నేతలు అన్నారు. విపక్ష ఇండియా కూటమి నేతలు కూడా అరెస్టును ఖండించారు. ఇలాంటి చర్యలు విపక్ష కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు.

ఇక కేజ్రీవాల్ వంతు: బీజేపీ

ఆప్, విపక్షాల విమర్శలను బీజేపీ తోసిపుచ్చింది. మద్యం కుంభకోణానికి కేజ్రీవాలే సూత్రధారి అని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. 'ఆయన కుడి భుజం సిసోడియా ఇప్పటికే జైల్లో ఉన్నారు. ఇప్పుడు ఎడమ భుజం సంజయ్ అదే బాట పట్టారు. ఇక కేజ్రీవాల్ చేతులకూ బేడీలు పడే రోజులు ఎంతో దూరం లేవు' అని జోస్యం చెప్పారు.

స్పీకర్‌నే దించేసుకున్నారు!

- ఉద్వాసనకు గురైన ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెకార్తీ
- రిపబ్లికన్ పార్టీకి సొంత నేతల షాక్
- అమెరికా చరిత్రలోనే తొలిసారి

వాషింగ్టన్: అమెరికాలో విపక్ష రిపబ్లికన్ పార్టీ సంక్షోభంలో చిక్కుకుంది. ప్రతినిధుల సభ స్పీకర్ పదవి నుంచి రిపబ్లికన్ నేత కెవిన్ మెకార్తీని సొంత పార్టీకి చెందిన సభ్యులే సాగనంపారు! అగ్రరాజ్య చరిత్రలో స్పీకర్ ఇలా ఉద్వాసనకు గురవడం ఇదే తొలిసారి. ఆయనపై రిపబ్లికన్ నేత మాట్ గేట్జ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఆ పార్టీకి చెందిన మరో ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు మద్దతివడం ద్వారా అధికార డెమొక్రటిక్ పార్టీతో చేతులు కలిపారు. దాంతో మంగళవారం మధ్యాహ్నం (అమెరికా కాలమానం ప్రకారం) జరిగిన ఓటింగ్‌లో 216–210 ఓట్లతో మెకార్తీ ఓటమి చవిచూశారు. ఈ ఏడాది జనవరిలో ఏకంగా నాలుగు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన 15 రౌండ్ల ఓటింగ్ అనంతరం మెకార్తీ స్పీకర్‌గా నెగ్గడం తెలిసిందే. పది నెలలు తిరక్కుండానే ఆయన ఇలా అవమానకరంగా తప్పుకోవాల్సి వచ్చింది. ఇప్పుడిక తదుపరి స్పీకర్ ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

కొంప ముంచిన షట్‌డౌన్


కెవిన్ పార్టీలో అందరి నమ్మకమూ కోల్పోయారని గేట్జ్ ఆరోపించారు. సైద్ధాంతికంగా తనతో అన్ని విషయాల్లోనూ విభేదించే తమ పార్టీ సభ్యులు కూడా ఆయన్ను దించేసే విషయంలో కలసి రావడమే ఇందుకు రుజువని చెప్పారు. ఆర్థిక షట్‌డౌన్‌ను తాత్కాలికంగా నివారించే సాకుతో అధికార పార్టీతో కెవిన్ చేతులు కలిపారన్నది గేట్జ్ వర్గం ఆరోపణ. ఈ మేరకు అధ్యక్షుడు జో బైడెన్‌తో ఆయన చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించింది. స్పీకర్‌కు ఉద్వాసనను కనీవినీ ఎరగని ఘటనగా డెమొక్రటిక్ పార్టీ కాంగ్రెస్ సభ్యుడు, ఇండియన్ అమెరికన్ అమీ బెరా అభివర్ణించారు. రిపబ్లికన్ల మధ్య నెలకొన్న పరస్పర అపనమ్మకానికి ఇది తాజా నిదర్శనమన్నారు.

రిపబ్లికన్ల ఇంటిపోరు వల్లే...

గేట్జ్ సారథ్యంలోని రైట్ వింగ్ రిపబ్లికన్ సభ్యులకు నిజానికి కెవిన్ మీద ఆది నుంచీ వ్యతిరేకతే! జనవరిలో స్పీకర్‌గా ఆయన ఎన్నిక కావడాన్ని వారు చివరిదాకా వ్యతిరేకించారు. దాంతో తనను తొలగించాలని ఒక్క రిపబ్లికన్ సభ్యుడు కోరినా దానిపై ఓటింగ్‌కు అనుమతిస్తానని వారితో ఒప్పందం చేసుకుని మెకార్తీ స్పీకర్‌గా నెగ్గారు. చివరికి అదే ఒప్పందం కారణంగా పదవిని కోల్పోయారు! అయితే సొంత పార్టీలోనే ఇప్పుడు కెవిన్ ఉద్వాసనను తీవ్రంగా తప్పుబడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. గేట్జ్ చర్య ద్రోహపూరితమని వారు ఆరోపిస్తున్నారు. వారిమీద కఠిన చర్యలకు డిమాండ్ చేస్తుండటంతో రిపబ్లికన్ పార్టీలో సంక్షోభం కాస్తా రసకందాయంలో పడింది!

ఇప్పుడేంటి?

- ➤ తదుపరి స్పీకర్ ఎవరన్నది ఆసక్తికరంగా మారింది.
- ➤ అమెరికా కాంగ్రెస్‌లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్లకే మెజారిటీ దక్కడం తెలిసిందే.
- ➤ గత జనవరిలో జరిగిన ఓటింగ్‌లో గేట్జ్ సారథ్యంలోని రైట్ వింగ్ వ్యతిరేకులను బుజ్జగించి మెకార్తీ కనాకష్టంగా స్పీకర్ అయ్యారు.
- ➤ అక్టోబర్ 11న కొత్త స్పీకర్ ఎన్నిక జరగాల్సి ఉంది.
- ➤ తాజా పరిస్థితుల నేపథ్యంలో మరోసారి పోటీకి మెకార్తీ ససేమిరా అంటున్నారు.
- ➤ రిపబ్లికన్లలో ఇంటి పోరు తీవ్రంగా సాగుతుండటంతో స్పీకర్ అభ్యర్థిపై ఏకాభిప్రాయం కష్టంగానే కనిపిస్తోంది.
- ➤ ప్రస్తుతానికి రిపబ్లికన్ నేతలు స్టీవ్ స్కలైస్ (లూసియానా), టామ్ ఎమ్మర్ (మిన్నెసోటా) పేర్లు వినిపిస్తున్నాయి.


కెవిన్ మెకార్తీ


ఉత్తర సిక్కిం జిల్లాలో భారీ వర్షాల ధాటికి కొట్టుకుపోయిన రహదారి

సిక్కింలో భీకర వర్షాలు.. ముంచెత్తిన వరదలు

- 10 మంది మృతి
- 22 మంది జవాన్లు సహా 82 మంది గల్లంతు

గాంగ్‌టక్: భారీ వర్షాలు, వరదలతో ఉత్తర సిక్కిం వణికిపోతోంది. ఆకస్మిక వర్షాల కారణంగా తీస్తా నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో తీర ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాలు, వరదల ధాటికి కనీసం 10 మంది మరణించారు. 22 మంది జవాన్లు సహా మొత్తం 82 మంది గల్లంతయ్యారని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. మంగళవారం అర్ధరాత్రి తర్వాత వరద బీభత్సం ప్రారంభమైంది. చుంగ్‌థాంగ్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయడంతో పరిస్థితి మరింత భీతావహంగా మారిందని తెలియజేశాయి. 22 మంది సైనికులు, 47 మంది సాధారణ పౌరులు కనిపించకుండా పోయారని అధికారులు చెప్పారు. వారి ఆచూకీ కనిపెట్టేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 18 మంది క్షతగాత్రులు సహా వరదల్లో చిక్కుకున్న 45 మందిని రక్షించామని అన్నారు. రాజధాని గాంగ్‌టక్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని సింగ్‌తామ్ ఉక్కు వంతెన బుధవారం తెల్లవారుజామున పూర్తిగా కొట్టుకుపోయిందంటే వరద ప్రవాహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు నీట మునిగాయి. రహదారులపై రాకపోకలు స్తంభించాయి. సిక్కిం రాష్ట్రాన్ని దేశంలోని ఇతర భూభాగంతో అనుసంధానించే పదో నెంబర్ జాతీయ రహదారి పలుచోట్ల పూర్తిగా ధ్వంసమైంది. వర్షాలు, వరద విలయాన్ని సిక్కిం ప్రభుత్వం ప్రకృతి విపత్తుగా ప్రకటించింది. మాంగాన్, గాంగ్‌టక్, పాక్‌యోంగ్, నామ్చీ జిల్లాల్లో పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 8 దాకా సెలవు ప్రకటించింది. ఉత్తర బెంగాల్‌కు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. తీస్తా నది ప్రవాహ ప్రాంతాల్లో జనం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్సీపీ ఎంపీ ఫైజల్‌పై మళ్లీ అనర్హత వేటు

న్యూఢిల్లీ: ఎన్సీపీకి చెందిన లక్షద్వీప్ లోక్ సభ సభ్యుడు పీపీ మహమ్మద్ ఫైజల్‌పై మళ్లీ అనర్హత వేటు పడింది. హత్యాయత్నం కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసేందుకు కేరళ హైకోర్టు తాజాగా నిరాకరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు లోక్ సభ సచివాలయం బుధవారం ప్రకటించింది. ఈ రద్దు నిర్ణయం 2023 జనవరి 11వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించాలంటూ బులెటిన్ విడుదల చేసింది. ఈ కేసులో ఫైజల్ పై అనర్హత వేటు పడటం ఇది రెండోసారి. ఆయనతో పాటు మరో నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కవరత్తీ సెషన్స్ కోర్టు తీర్పు ఇవ్వడం తెలిసిందే. దాంతో వెంటనే గత జనవరి 25వ తేదీన తొలిసారిగా ఫైజల్ లోక్ సభ సభ్యత్వంపై వేటు పడింది. కవరత్తీ కోర్టు తీర్పును, శిక్షను కేరళ హైకోర్టు సస్పెండ్ చేయడంతో మార్చి నెల 28వ తేదీన ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. ఇది లోపభూయిష్టమైన తీర్పు అంటూ సుప్రీంకోర్టు ఆగస్టులో తప్పుబట్టడమేగాక ఆ తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో రెండోసారి లోక్‌సభ సచివాలయం ఆయన సభ్యత్వాన్ని రద్దుచేస్తూ బులెటిన్ ఇచ్చింది. ఆయనపై వేటు వేయడంతో లోక్‌సభలో ఖాళీల సంఖ్య ఐదుకు పెరిగింది. లోక్‌సభ ఎన్నికలు ఏడాది లోపు ఉంటే ఉప ఎన్నికలు నిర్వహించరాదు. కనుక వచ్చే మే లోపలే లోక్‌సభ ఎన్నికలు జరగనున్నందున లక్షద్వీప్‌కు ఉపఎన్నిక జరగబోదు.

తాను వేసిన ఉచ్చులో..

- యాంకర్ చైన్‌కు ఢీకొన్న చైనా అణుజలాంతర్గామి
- 55 మంది నావికులు మృతి

లండన్: చైనాకు సమీపంలోని ఎల్లో సముద్రంలో పశ్చిమ దేశాల జలాంతర్గాములను నిరోధించడానికి తాను వేసిన ఉచ్చులో డ్రాగన్ దేశానికి చెందిన అణు జలాంతర్గామి చిక్కుకుంది. ఈ ప్రమాదంలో చైనాకు చెందిన 55 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి యూకే ఇంటెలిజెన్స్ రహస్య నివేదిక తమ దగ్గర ఉందని డెయిలీ మెయిల్ ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆగస్టులో ఎల్లో సముద్రంలో చైనా షాన్‌డాంగ్ ప్రావిన్స్ సమీపంలో ప్రమాదం జరిగింది. ఆ ప్రాంతానికి సమీపంలో క్వింగ్‌డావ్ నౌకాదళ స్థావరం ఉంది. అక్కడికి అమెరికా, బ్రిటన్‌ల జలంతర్గాములు రాకుండా చైనా ఏర్పాటు చేసిన యాంకర్ ఉచ్చులో దాని సబ్‌మెరైన్ చిక్కుకుందని డెయిలీ మెయిల్ తన కథనంలో పేర్కొంది.

ప్రమాదం ఎలా జరిగిందంటే.. !

ఈ సబ్‌మెరైన్ ప్రమాదానికి సంబంధించి యూకే ఇంటెలిజెన్స్ సవివరమైన నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో ఉన్న వివరాల ప్రకారం ఎల్లో సముద్రంలో ఆగస్టు 21 ఉదయం 8.12 గంటల సమయంలో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీకి చెందిన అణు జలంతర్గామి 093 చిక్కుకుపోయింది. అమెరికా, దాని మిత్రపక్షాల జలాంతర్గాముల్ని అడ్డుకోవడానికి వేసిన యాంకర్ చైన్‌ను డ్రాగన్ జలంతర్గామి ఢీ కొట్టడంతో అందులో ఎయిర్ ప్యూరిఫయర్, ఎయిర్ ట్రీట్‌మెంట్ వ్యవస్థలు ఆగిపోయి ఉండవచ్చు. సబ్‌మెరైన్‌లో ప్రయాణిస్తున్న సిబ్బంది ఆరుగంటల సేపు శ్రమించి ప్రత్యామ్నాయ వ్యవస్థకు మార్చినా ఫలితం లేకుండా పోయింది. జలాంతర్గామిలో ఉన్న ఆక్సిజన్ విషతుల్యమై హైపాక్సియా అనే పరిస్థితి ఏర్పడి అందులో ప్రయాణిస్తున్న 55 మంది ఉసురు తీసింది. మృతి చెందిన వారిలో జలాంతర్గామి కెప్టెన్ కల్నల్ జీ యాంగ్‌పెంగ్ సహా 22 మంది అధికారులు, ఏడుగురు ఆఫీసర్ కేడెట్స్, 9 మంది పెట్టీ ఆఫీసర్స్, 17 మంది సిబ్బంది ఉన్నారు. ఆగస్టులో ఈ ప్రమాదం గురించి కొన్ని అంతర్జాతీయ పత్రికలు రాసినా అప్పట్లో చైనా, తైవాన్‌లు దీనిని తోసిపుచ్చాయి. జలంతర్గాముల్లో హైడ్రోజన్ నుంచి ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే వ్యవస్థలు ఉంటాయి. బహుశా చైనా జలాంతర్గామిలో ఆ వ్యవస్థ లేకపోయి ఉండవచ్చునని బ్రిటన్ నిపుణులు చెబుతున్నట్టుగా డెయిలీ మెయిల్ తన కథనంలో పేర్కొంది. ప్రమాదం జరిగిన సమయంలో సబ్‌మెరైన్‌నుంచి ఎన్‌క్రిప్టెడ్ ఆటోమేటిక్ సిగ్నల్ పొరుగు దేశాలకు అందాయని బ్రిటన్ నిపుణులు వెల్లడించారు. అదే సమయంలో బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రసంగం మధ్యలో వెళ్లిపోయారు. అధ్యక్షుడు ప్రసంగ పాఠాన్ని ఆ దేశ వాణిజ్య మంత్రి కొనసాగించారని, ఈ ప్రమాదమే దానికి కారణమన్న విశ్లేషణలు కూడా వస్తున్నాయి.

'ఉజ్వల' లబ్ధిదారులకు మరో రూ.100 రాయితీ

ఒక్కో సిలిండర్‌పై రూ.300కు చేరిన రాయితీ



న్యూఢిల్లీ: 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' కింద వంట గ్యాస్ సిలిండర్లపై రాయితీని మరో రూ.100 పెంచాలని కేంద్ర మంత్రి వర్గం బుధవారం నిర్ణయించింది. దీంతో ఒక్కో సిలిండర్‌పై మొత్తం రాయితీకి రూ. 300కు చేరుకుంది. ఉజ్వల యోజన కింద కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా 12 రాయితీ సిలిండర్లు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ (14.2 కిలోలు)పై రూ.200 చొప్పున కేంద్రం రాయితీ ఇస్తోంది. ఈ రాయితీని మరో రూ.100 పెంచినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా 9.6 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని తెలియజేశారు. ఉజ్వల పథకం లబ్ధిదారులు ప్రస్తుతం ఒక్కో సిలిండర్ కోసం రూ.703 ఖర్చు చేస్తున్నారు. ఇకపై రూ.603 చొప్పున వెచ్చించాల్సి ఉంటుంది. త్వరలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. తాము అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఉజ్వల యోజన లబ్ధిదారులకు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మరో రూ.100 పెంచడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సోనియాకు రాహుల్ సర్‌ప్రైజ్ గిఫ్ట్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన తల్లి సోనియాగాంధీకి ఒక సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. ఒక బుజ్జి కుక్క పిల్లను కానుకగా ఇచ్చారు. ఆ కుక్క పిల్లకి నూరీ అని పేరు పెట్టారు. బుధవారం ప్రపంచ జంతు దినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లి సోనియాకు కుక్కపిల్లని ఇచ్చి ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఇదంతా వీడియో తీసి యూట్యూబ్‌లో ఉంచారు. అమ్మకి ఒక సర్‌ప్రైజ్ అంటూ రాహుల్ గాంధీ సోనియాను బయటకు తీసుకురావడంతో వీడియో మొదలవుతుంది. రాహుల్ ఇచ్చిన బాక్స్ తీసి చూసిన సోనియా గాంధీ అందులో బుజ్జి కుక్క పిల్ల ఉండడంతో సంతోషంతో ఉప్పొంగిపోయారు. చాలా క్యూట్‌గా ఉందంటూ మురిసిపోయారు. ఇప్పుడు తమ కుటుంబంలోకి మరో సభ్యురాలు వచ్చిందంటూ రాహుల్ చెబుతున్నారు. జాక్ రస్సెల్ టెర్రియర్ జాతికి చెందిన ఈ ఆడకుక్క పిల్లను రాహుల్ గోవా నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చారు.

భారత వాయుసేనలోకి తేజస్



సాక్షి, బెంగళూరు: భారత వాయుసేన అమ్ముల పొదిలో మరో కొత్త అస్త్రం చేరింది. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) మొట్ట మొదటి రెండు సీట్లున్న తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌ను బుధవారం భారత వైమానిక దళానికి అప్పగించింది. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ పాల్గొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ తయారీ రంగాన్ని రక్షణ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఏఎల్ కృషిని ఆయన కొనియాడారు. ప్రపంచ స్థాయి విమానాల డిజైన్, అభివృద్ధి తయారీలో మన దేశానికి అమోఘమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని గుర్తు చేశారు. భారత వాయుసేనలో శిక్షణ ఇవ్వడానికి తేజస్ అన్ని రకాల సామర్థ్యాలు కలిగి ఉందని, అవసరమైతే యుద్ధ రంగంలో కూడా సేవలు అందిస్తుందని హాల్ వెల్లడించింది. తక్కువ బరువు కలిగి ఉండి అన్ని రకాల వాతావరణాలను తట్టుకోగలిగిన 4.5 జనరేషన్‌కు చెందిన యుద్ధ విమానం తేజస్. రెండు సీట్లు ఉండేలా డిజైన్ చేయడం వల్ల అప్పుడే వాయుసేనలో అడుగు పెట్టిన పైలెట్లకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడుతుంది.

వాతావరణ మార్పులతో కోట్ల డాలర్ల నష్టం

న్యూఢిల్లీ: వాతావరణంలో వస్తున్న భారీ మార్పులు ప్రపంచ దేశాలను ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాయి. ప్రకృతి విపత్తుల కారణంగా ప్రపంచంలోని మౌలిక సదుపాయాల రంగంలో ఏడాదికి సగటున 30,000వేల కోట్ల డాలర్ల నుంచి 33 వేల కోట్ల డాలర్ల వరకు నష్టం వస్తోందని కొయిలేషన్ ఫర్ డిజాస్టర్ రెసిలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ) నివేదిక వెల్లడించింది. ఆరోగ్యం, విద్యా రంగానికి సంబంధించిన భవంతులు ఇతర సదుపాయాలకు జరిగిన నష్టాన్ని కూడా చేరిస్తే 73,200 కోట్ల డాలర్ల నుంచి 84 వేల కోట్ల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. 2021–22లో ప్రపంచ స్థూల ఆదాయం పెరుగుదలలో ఈ నష్టం ఏడో వంతు వరకు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

రణ్‌బీర్‌కపూర్‌కు ఈడీ సమన్లు



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు రణ్‌బీర్‌కపూర్ ఆన్‌లైన్ గేమింగ్ ఉచ్చులో చిక్కుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నమోదైన మహదేవ్ బెట్టింగ్ యాప్ మనీ ల్యాండరింగ్ కేసుకు సంబంధించి శుక్రవారం విచారణకు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రణ్‌బీర్‌కు సమన్లు జారీ చేసింది. బెట్టింగ్ యాప్ గురించి ఆన్‌లైన్‌లో ప్రచారకర్తగా ఉన్న రణ్‌బీర్‌కపూర్‌కు ప్రమోటర్ల నుంచి హవాలా మార్గంలో డబ్బులు అందాయని ఈడీ అధికారులు ఆరోపించారు. రాయపూర్‌లో ఉన్న ఈడీ కార్యాలయానికి ఈ నెల 6న హాజరు కావాలని రణ్‌బీర్‌కపూర్‌కు సమన్లు పంపినట్టుగా వెల్లడించారు. మహదేవ్ బెట్టింగ్ అప్లికేషన్‌ను దుబాయ్ కేంద్రంగా సౌరభ్ చంద్రకర్, రవి ఉప్పల్ అనే ఇద్దరు నడుపుతున్నారు. ఈ బెట్టింగ్ యాప్ ముసుగులో మనీలాండరింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టుగా ఈడీ ఇటీవల గుర్తించింది. బెట్టింగ్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆఫ్‌షోర్ ఖాతాలకు తరలించడానికి యాప్ ప్రమోటర్లు హవాలా మార్గాన్ని అనుసరిస్తున్నట్టుగా ఈడీ ఆరోపించింది.

ఇటలీలో బ్రిడ్జిపై నుంచి పడిన బస్సు.. 21 మంది దుర్మరణం

వెనీస్: ఇటలీలోని వెనీస్ నగర సమీపంలో మంగళవారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న బస్సు అదుపు తప్పి, 50 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడిపోయింది. అనంతరం బస్సులో మంటలు చెలరేగడంతో 21 మంది ప్రయాణికులు మరణించారు. మరో 15 మంది గాయపడ్డారు. వీరిలో 9 మంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది విదేశీ పర్యాటకులే. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. మంటలు ఆర్పేశారు. సహాయక చర్యలు ప్రారంభించారు. బస్సు ప్రమాదంలో 21 మంది మృతిచెందడం పట్ల వెనీస్ సిటీ మేయర్ బ్రుగ్నారో సంతాపం ప్రకటించారు.

దేశం విడిచి వెళ్లండి

అక్రమంగా అఫ్గాన్ నుంచి వచ్చిన శరణార్థులకు పాక్ ఆదేశం

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్ నుంచి పాకిస్తాన్‌కు అక్రమంగా వచ్చిన శరణార్థులు వెంటనే దేశం వీడి వెళ్లాలంటూ పాక్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాలిబన్ల పరిపాలనతో విసిగి వేసారిపోయిన అఫ్గాన్లు లక్షల సంఖ్యలో చట్టవిరుద్ధంగా పాక్‌కు చేరుకున్నారు. అలా వచ్చిన వారు 17 లక్షల మంది ఉంటారని ప్రభుత్వం అంచనా వేసింది. వారందరూ నవంబర్‌లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు దేశాల సరిహద్దుల్లో ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోతున్నాయి. అఫ్గాన్‌లో తాలిబన్ల కనుసన్నల్లో ఉన్న ఉగ్రవాదులే దాడులకు పాల్పడుతున్నారని పాక్ ఆరోపిస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నవంబర్ 1లోగా అక్రమంగా వచ్చిన వారంతా వెళ్లకపోతే భద్రతా బలగాలతో వారిని దేశం నుంచి బహిష్కరిస్తామని పాకిస్తాన్ ప్రభుత్వం తేల్చి చెప్పింది.

సాక్షి హైదరాబాద్

గురువారం, 5, అక్టోబర్, 2023



బ్లాక్..బిజినెస్

బ్లాక్ టికెట్.. బ్లాక్ మార్కెట్... బ్లాక్ మనీ తరహాలో.. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో మరో 'బ్లాక్' వెలుగులోకి వచ్చింది. అదే.. బ్లాక్ బిజినెస్. -8లో



కర్రలతో కొట్టి చంపారు

స్థిరాస్తి కొనుగోలు చేస్తామని నమ్మించి ఎన్నారై అంజిరెడ్డిని హత్య చేసిన కేసులో నిందితుడు రాజేష్ ఆది నుంచీ పథకం ప్రకారమే కథ నడిపించాడు. -8లో

ఓయూ పీజీ కోర్సుల షెడ్యూల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీజీ కోర్సుల రీ అడ్మిషన్స్, తరగతుల ప్రారంభం, ఇంటర్నల్, ప్రాక్టికల్స్, సెమిస్టర్ పరీక్షలు, ఫలితాలు, సెలవులు తదితర వివరాలతో కూడిన షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 7 వరకు ఇండక్షన్ ప్రోగ్రాం, 9 నుంచి తరగతులు, పీజీ ద్వితీయ సంవత్సరం రీ అడ్మిషన్స్ ఈ నెల 16 వరకు కాగా 9 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

న్యూస్‌రీల్

ఆస్ట్రేలియా వెళ్తున్నా.. నా కోసం వెతకొద్దు

- తండ్రికి మెసేజ్ చేసి వైద్యురాలి అదృశ్యం



ఫిలింనగర్: ఆస్ట్రేలియా వెళ్తున్నట్లు.. తన కోసం ఎవరూ వెతకవద్దంటూ వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి వైద్యురాలు అదృశ్యమైన ఘటన వెలుగు చూసింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. సోమాజిగూడలోని ఓ ఆస్పత్రిలో వైద్యురాలిగా పని చేస్తున్న మహియా తరన్నుం (24) ఈ నెల 3న ఎప్పటిలాగే ఉదయం సబ్జా కాలనీలోని తన నివాసం నుంచి విధులకు వెళ్తున్నట్లుగా తల్లిదండ్రులకు చెప్పింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో తండ్రి మహ్మద్ గఫార్‌కు వాట్సాప్ కాల్ చేసి తాను ఆస్ట్రేలియా వెళ్తున్నానని తన కోసం వెతకవద్దంటూ చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు అన్ని ప్రాంతాల్లో గాలించారు. గత 8 నెలలుగా ఆమెతో పాటు వైద్యుడిగా పని చేస్తున్న నదీమ్‌తో.. పరిచయం ఏర్పడిందని.. బిహార్‌కు చెందిన అతను మాయమాటలు చెప్పి మహియా తరన్నుంను తీసుకెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ బాధిత తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ స్నాతకోత్సవానికి అడోబ్ సీఈఓ



శంతన్ నారాయణ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 31న జరగనున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా అమెరికాకు చెందిన అడోబ్ సీఈఓ శంతన్ నారాయణ్ హాజరు కానున్నట్లు కంట్రోలర్ ప్రొ.రాములు తెలిపారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో గవర్నర్ తమిళ్ సై అధ్యక్షత జరిగే 83వ స్నాతకోత్సవానికి ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వవిద్యార్థి అడోబ్ సీఈఓ శంతన్ నారాయణ్ విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు 'రాచకొండ కమిషనరేట్' నిర్మాణానికి భూమి పూజ



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణానికి గురువారం మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, సీపీ డీఎస్ చౌహాన్ భూమి పూజ చేయనున్నారు. బుధవారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, డీసీపీలు గిరిధర్, శ్యాంసుందర్ రావు, మున్సిపల్ కమిషనర్ ఇస్లావత్ నమ్యా నాయక్, ఏసీపీ ఆకుల శ్రీనివాస్, మేడిపల్లి సీఐ సైదులు, ఏఈ భిక్షపతి, కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.



మాటిద్దాం.. ఓటేద్దాం!

ఓటు హక్కును వినియోగించుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సూచించారు. బుధవారం మాదాపూర్‌లోని దుర్గం చెరువు, కేబుల్ బ్రిడ్జి వద్ద కమిషనర్లు అరుణ్ గోయల్, అనూప్ చంద్రపాండే, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి సైక్లింగ్ టు ఓట్, వాక్ టు ఓట్ వాకథాన్‌ను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - మాదాపూర్





ఓటర్లు కోటి

మూడు జిల్లాల పరిధిలో 1,04,90,621 మంది

- అత్యధికంగా శేరిలింగంపల్లిలో 6,98,133..
- అత్యల్పంగా చార్మినార్ 2,24,074 మంది
- తుది జాబితాలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో:

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ), శివారు జిల్లాల్లో మొత్తం 1,04,90,621మంది ఓటర్లున్నారు. తాజాగా వెలువడిన ఓటరు తుది జాబితా మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 28 నియోజకవర్గాల పరిధిలో వీరున్నారు. వీరు దిగువ పేర్కొన్న విధంగా ఉన్నారు.

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్	సర్వీసు	మొత్తం
హైదరాబాద్	2279581	2052577	300	404	4442862
రంగారెడ్డి	1738994	1615876	404	590	3355864
మేడ్చల్	1395033	1295773	361	728	2691895
మొత్తం	5413608	4964226	1065	1722	10490621

సంగారెడ్డి జిల్లా పరిధిలో పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గంలో స్వల్ప భాగం మాత్రమే గ్రేటర్‌లో ఉండటంతో అక్కడి ఓటర్లను ఈ జాబితాలో చేర్చలేదు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 6,98,133 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 3,70,301 మంది, మహిళలు 3,27,636 మంది కాగా, థర్డ్‌జెండర్లు 142మంది, సర్వీసు ఓటర్లు 54 మంది ఉన్నారు. చార్మినార్‌లో అత్యల్పంగా 2,24,074 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,17,480 మంది కాగా, మహిళలు 1,06,557 మంది, థర్డ్‌జెండర్లు 28 మంది, సర్వీస్‌ఓటర్లు 9 మంది ఉన్నారు.

గోషామహల్ స్పెషల్

మొత్తం నియోజకవర్గాల్లో గోషామహల్ ప్రత్యేకతను సంతరించుకుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించని నియోజకవర్గాల్లో గోషామహల్ ఉండటం, ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న రాజాసింగ్‌పై బీజేపీ సస్పెన్షన్ ఎత్తివేయకపోవడంతో స్పెషల్ ఎట్రాక్షన్‌గా మారిన గోషామహల్ ఓటర్లు చార్మినార్ కంటే కొద్దిగా ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గలో 2,66,919 మంది ఉన్నారు.

థర్డ్‌జెండర్లు రంగారెడ్డిలో అధికం

ఇక థర్డ్‌జెండర్లు రంగారెడ్డి జిల్లాలో అధికంగా 404 మంది ఉన్నారు.


కోర్‌సిటీలో అత్యల్పం

ఇక తక్కువ ఓటర్లున్న నియోజకవర్గాలు హైదరాబాద్ కోర్‌సిటీ (పాత ఎంసీహెచ్) పరిధిలోనే ఉన్నాయి. ఓటర్లు 3 లక్షల లోపు ఉన్న నియోజకవర్గాల్లో ముషీరాబాద్ (2,94,170), అంబర్‌పేట (2,70,750), ఖైరతాబాద్ (2,89,580), సనత్‌నగర్ (2,44,956), గోషామహల్ (2,66,919), చార్మినార్ (2,24,074), సికింద్రాబాద్ (2,56,577), కంటోన్మెంట్ (2,46,622) ఉన్నాయి.

శివార్లలో శివాలే

అన్ని నియోజకవర్గాల్లోనూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని శివారు నియోజకవర్గాల్లో అయిదు లక్షల కంటే ఎక్కువ ఓటర్లున్న నియోజకవర్గాలు..

నియోజకవర్గం	ఓటర్లు
కుత్బుల్లాపూర్	6,69,361
శేరిలింగంపల్లి	6,98,133
ఎల్బీనగర్	5,66,866
మహేశ్వరం	5,17,316
రాజేంద్రనగర్	5,52,455
మేడ్చల్	5,95,536
ఉప్పల్	5,10,345



పేర్లు లేని వారూ దరఖాస్తు చేసుకోవచ్చు..

నామినేషన్ల గడువు ముగిసేందుకు పది రోజుల ముందు వరకు ఓటర్ల నమోదుకు, దరఖాస్తులు స్వీకరించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు సరైన ఎజెండా లేదు

నగరాభివృద్ధి కోసం మరింత పట్టుదలతో పని చేస్తాం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్
- అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరిన మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

సాక్షి, మేడ్చల్ జిల్లా: 'కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అన్యాయం జరిగిన తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరాలన్న పెద్ద నిర్ణయాన్ని తీసుకుని ముందుకు వచ్చిన శ్రీధర్‌కు స్వాగతం పలుకుతున్నాం. అందరం కలిసి హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేద్దాం' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సీఎం క్యాంపు ఆఫీసులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. జీవితమంతా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన శ్రీధర్‌కు అక్కడ అన్యాయం జరగడంతో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే సరైన ఎజెండానే లేదన్నారు. ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ నిరంతరం పాటుపడుతోందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వచ్చిందో, ఏ విధంగా అభివృద్ధి అయిందో గుర్తించాల్సిన అవసరముందన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన నందికంటి శ్రీధర్‌కు తగిన గౌరవాన్ని కల్పిస్తామని చెప్పారు. మాకు హైకమాండ్ కేసీఆర్ ఒక్కరేనని, ఆయన ఆదేశాలు, సూచన మేరకు మాత్రమే పార్టీ పని చేస్తుందన్నారు. తమకు ఢిల్లీలో బాసులు లేరని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్‌లో చేరిన మల్కాజిగిరి నియోజకవర్గంలోని 7 డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా, మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగురవేస్తాం: నందికంటి శ్రీధర్

కాంగ్రెస్ పార్టీలో ఎంతగానో కష్టపడి పని చేసినా బీసీలకు స్థానం లేదనే విషయం అర్థమైందని నందికంటి శ్రీధర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెమట, రక్తం ధారపోసినా స్థానం లేకుండా పోయిందని, అందుకే బీఆర్‌ఎస్‌లో చేరానని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పని చేసేందుకే వచ్చామన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పని చేస్తానని, మైనంపల్లి హన్మంతరావును ఓడించి మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని పేర్కొన్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరిన నందికంటి శ్రీధర్

ఉదయం అదృశ్యం.. రాత్రికి మృతదేహం



కార్తీక్ (ఫైల్)

ఫిలింనగర్: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన నన్నపనేని కార్తీక్ (28) నగరంలోని ఓ టీవీ చానెల్‌లో కెమెరామన్‌గా పని చేస్తున్నాడు. ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో మహిపాల్, భీమా ప్రవీణ్‌తో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఈ నెల 2న ఉదయం కార్తీక్ ఉద్యోగానికి వెళ్తున్నట్లు స్నేహితులకు చెప్పి తన బైక్‌పై బయలుదేరాడు. రాత్రి తిరిగి రాకపోయేసరికి రూమ్మేట్ ప్రవీణ్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని రావడంతో రాత్రంతా వెతికారు. ఈ నెల 3న కూడా గదికి రాకపోయేసరికి ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కార్తీక్ కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలిస్తున్న సమయంలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ చెరువులో పడి కార్తీక్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా సమాచారం అందింది. మంగళవారం సాయంత్రం శామీర్‌పేట్ చెరువు వద్ద బైక్‌తో పాటు కార్తీక్ మొబైల్ ఫోన్ పోలీసులకు కనిపించింది. దీని ఆధారంగా కార్తీక్ అడ్రస్‌ను కనిపెట్టి ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం తెల్లవారుజామున కార్తీక్ మృతదేహం ఒడ్డుకురావడంతో అదే విషయాన్ని ఫిలింనగర్ పోలీసులకు తెలియజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కార్తీక్ ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

చెరువులో పడి యువకుడి బలవన్మరణం

వడివడిగా..

పనులు, ఫైళ్లను పరుగులు తీయిస్తున్న అధికారులు

- త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండటమే కారణం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో వివిధ అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. కార్యాలయాల్లో ఫైళ్లు సైతం అంతకంటే వేగంగా కదులుతున్నాయి. అందుకు కారణం త్వరలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటమే. దీన్ని దృష్టిలో ఉంచుకొనే గత నెలన్నరగా వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పనులు ప్రారంభించారు.

- గ్రేటర్ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాదాపు రూ. 10 వేల కోట్లతో నిర్మిస్తున్న లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లలో దశలవారీగా దాదాపు 62 వేల ఇళ్ల పంపిణీ, ఇందిరా పార్కునుంచి వీఎస్టీ వరకు రూ. 450 కోట్లతో నిర్మించిన స్టీల్ ఫ్లై ఓవర్, పాటిగడ్డలో రూ. 5.90 కోట్ల మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ తదితరాలు ఉన్నాయి.
- ఇక బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించిన ప్రభుత్వం త్వరలోనే వీటిని పూర్తి చేయనుంది. 6న సర్కారు బడుల విద్యార్థులకు అల్పాహారం పథకాన్నీ ప్రారంభించనున్నారు. తార్నాక డివిజన్‌లో రూ.7 కోట్ల అంచనా వ్యయంతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు శంకుస్థాపన, రూ. 6కోట్లతో స్విమ్మింగ్‌పూల్ పనుల ప్రారంభంతోపాటు బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ఇక వివిధ డివిజన్లలో రోడ్లు తదితర పనులెన్నో చేపట్టారు.
- అలాగే 162 మురుగు వ్యర్థాల రవాణా వాహనాల ప్రారంభం, నార్సింగి వద్ద 23 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్, జలవిహార్ వద్ద రూ.26.65 కోట్లతో లేక్‌ఫ్రంట్ పార్క్, పంజగుట్టలో రూ. 4కోట్లతో ఆధునికీకరించిన వైకుంఠ మహాప్రస్థానం, దుర్గం చెరువు వద్ద మ్యూజికల్ ఫౌంటెన్, ఎస్టీపీల ప్రారంభోత్సవాలు, రూ. 1.10 కోట్లతో అంబర్‌పేట శ్మశానవాటిక పనులకు శంకుస్థాపన, రూ. 545 కోట్లతో మూసీపై 14బ్రిడ్జిల పనులకు శశంకుస్థాపనలు, వివిధ రోడ్ల పనులు జరిగాయి. ఈ పనులు ఇప్పటికే కాగా, చేయాల్సిన పనులకు సంబంధించి లెటర్ ఆఫ్ అగ్రిమెంట్స్ (ఎల్‌ఓఏ)ను త్వరితంగా పూర్తిచేసేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.



నోటిఫికేషన్‌తో పనులకు బ్రేక్

ఎన్నికల నోటిఫికేషన్ బహుశా 6వ తేదీ.. ఆ తర్వాత ఎప్పుడైనా వెలువడనుందనే అంచనాలున్నాయి. దీంతో ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తి చేసిన, పురోగతిలోని పనులు తదితర వివరాలను 24 గంటల్లోగా అందజేయాల్సిందిగా వివిధ విభాగాల ఉన్నతాధికారులను ఆదేశించడంతో వారు ఆ పనుల్లో తలమునకలుగా ఉన్నారు. నోటిఫికేషన్ లోగా పనులు ప్రారంభం కాకపోతే వాటిని ఎన్నికలు ముగిసేంత దాకా చేయడం కుదరదని ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీంతో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లు పూర్తయి, ఎల్‌ఓఏలు పూర్తి కాని వాటిని ఆగమేఘాల మీద పూర్తిచేస్తున్నారు. ఎల్‌ఓఏలు పూర్తి చేసి పనుల్ని ప్రారంభించమనిపిస్తే, వాటిని కొనసాగించే అవకాశం ఉంటుంది. లేని పక్షంలో చేయడానికి వీలుండదు.ఈమేరకు పనుల వివరాల్ని ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉండటంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

కళా కథలు!

నగరం వేదికగా వినూత్న ప్రదర్శనలు

- నలుగురు వనితల అరుదైన కళలు

హృదయాన్ని హత్తుకోవాలే గాని కాదేదీ కళకు అనర్హం! సామాజిక, మానసిక ఇతివృత్తాలను ప్రతిబింబించాలే గాని కాదేదీ కథలకనర్హం!! కళను, వాస్తవిక జీవనగాథలను సమ్మిళితం చేసే శక్తి, సామర్థ్యం ఒక్క కళాకారుడికే సొంతమేమో. ఇదే విషయాన్ని వారి సమ్మోహన కళతో, కళాత్మకతతో మరోసారి నిరూపిస్తున్నారు నలుగురు వనితలు. నగరంలోని గ్యాలరీ 78 వేదికగా 'ది రెజొనేటింగ్ నరేటివ్స్' పేరుతో కళాత్మక ప్రదర్శనను చేపట్టారు ఈ మహిళా ఆర్టిస్టులు. ఒకరు కళ రూపంలో వాస్తవిక జీవిత కథలను చెబితే మరొకరు విశ్వం అంతర్మథనాన్ని చెప్పకనే చెబుతారు. టిష్యూ పేపర్‌తో సైతం మహిళల సాధికారత అంశాలను అతి సున్నితంగా రూపొందించిన కళారూపాలను ఇక్కడ తిలకించవచ్చు. ఆ కళాకారిణులు ఏమంటున్నారో వారి మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో



అతివల ఆలోచనల అల్లిక..



నిత్యం మహిళల జీవన విధానాన్ని ప్రతిబింబిచడం నాకిష్టమైన కళ. నా ఆర్ట్‌లో టాయిలెట్ టిష్యూ పేపర్, నైలాన్ దారాన్ని ఉపయోగించి మహిళల ఆలోచనలకు ఒక కళాత్మక రూపాన్ని అందించాను. గృహిణులు, ఆదివాసీ మహిళల జీవితాలను దగ్గర చూసినప్పుడు పొందిన అనుభూతితో ఈ ఆర్ట్ క్రాఫ్ట్ తయారు చేశాను. కొన్ని ప్రముఖ రచనల్లోని వాక్యాలను టిష్యూ పేపర్‌తో అక్షరాలుగా మలిచి, నైలాన్ దారంతో కలిపి అల్లికగా వీటిని రూపొందించాను. ఇందులోని ప్రతీ అల్లిక ఒక మహిళ ఆలోచనను, అవధిని ప్రతిబింబిస్తాయి. - సమీక్ష

దారపు బంధాలే మన జీవితాలు..



జీవితంలో నిత్యం చూసే కొన్ని సున్నిత మానసిక స్పందనలు, ఆత్మీయత, అనుబంధాలను వ్యక్తపరచాలంటే మాటలు సరిపోవు. వాటిని ప్రతిబింబించేదే నా క్రోసియా వర్క్. ఉలెన్ దారం అల్లికలతో రూపొందించిన ఈ చిత్రాలు నిజజీవితంలో నేను చూసిన మధుర సంఘటనలు. నా కళకు కవిత్వం జోడించి ప్రదర్శిస్తున్నాను. నిత్యం ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ముందుకు సాగుతున్న శక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా కొందరు స్ఫూర్తిదాయక మహిళల చీరల నుంచి సేకరించిన దారపు ఉలులను నా ఆర్ట్‌లో ఉపయోగించాను. కేన్సర్‌తో పోరాడుతున్న మహిళ తన చివరి దశను తన మనవరాలితో ఎలా గడుపుతుందనే చిత్రానికి అద్భుత స్పందన లభిస్తోంది. 2007లో నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశాను. - మానస ప్రియ

ప్రకృతితో మమేకం..



నా కళా రూపాలన్నీ ఆత్మని ప్రకృతితో మమేకం చేస్తాయి. అంతర్మథనంలో వెంటాడే ఆలోచనలను ప్రకృతి రూపకాలతో సమ్మిళితం చేసే ప్రతిరూపకాలు. శాంతి, సమ్మోహనం, మథనం తదితర అంశాలను అర్థవంతమైన కలర్ పెయింటింగ్‌లా వేస్తుంటాను. మనిషి ఆలోచన అద్భుత శక్తి, అంతకు మించిన అనంత విశ్వం. ఈ విషయాన్ని చెప్పకనే చెబుతాయి నా చిత్రాలు. - దీపాంజలి శేఖర్

లోతుగా చూడగలిగే ఆసక్తి ఉంటేనే...

అబ్‌స్ట్రాక్షన్, సింబాలిజమ్ అనే కళా రూపాలు మన అంతర్గత ఆలోచనలను వ్యక్తపరిచే వారధులు. విశ్వంలోని ప్రతీ సున్నిత అంశాన్ని ఇల్యూజన్‌తో ప్రదర్శించే రంగుల హరివిల్లు. నా ఆర్ట్‌లో ఆధ్యాత్మికత, ఆత్మ, లోతైన ఆలోచన కలిసి ఉంటాయి. ఈ కళలో రంగుల కలయికతో నాకంటూ ప్రత్యేక శైలిని అలవర్చుకున్నాను. ఆ శైలి మరో ప్రపంచాన్ని చూపిస్తాయి. లోతుగా చూడగలిగే ఆసక్తి ఉంటేనే ఇవి అవగతం అవుతాయి. - పూనమ్ బిశ్వాస్



ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై షాహినాయత్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్ ప్రాంతంలో రాణి అవంతిబాయి విగ్రహం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా దిమ్మె కడుతున్నందుకు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... 2019వ సంవత్సరంలో కూడా ఎమ్మెల్యే రాజాసింగ్, అతని అనుచరులు ఎలాంటి అనుమతులు లేకుండా రాణి అవంతిబాయి విగ్రహాన్ని పెట్టడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. తిరిగి మంగళవారం ఎమ్మెల్యే రాజాసింగ్ అనుచరులు ఎలాంటి నుమతులు తీసుకోకుండా కట్టడం నిర్మించడంతో ఎస్.ఐ. లక్ష్మయ్య విధుల్లో భాగంగా చూసి ఫిర్యాదు చేశారని, దీంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సున్నితమైన ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగే విధంగా కట్టడం నిర్మిస్తున్నందునే కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ వివరించారు. కాగా ఎమ్మెల్యే రాజాసింగ్ పోలీసుల తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మూడు అడుగుల దిమ్మె కడితే పోలీసులకు ఏమి నష్టమని ఆయన ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో ప్రజలకు ఎవ్వరికీ ఇబ్బందులు లేవని, బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడితోనే తనపై పోలీసులు కేసులు నమోదు చేశారని రాజాసింగ్ పేర్కొన్నారు.

ఓయూలో నూతన విద్యార్థులకు నేటి నుంచి హాస్టల్ వసతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నూతన విద్యార్థులకు గురువారం నుంచి హాస్టల్ వసతి కల్పించనున్నట్లు చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు తెలిపారు. వివిధ కాలేజీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన మొదటి నుంచి విద్యార్థులు ఈ నెల 10 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత మెస్ డిపాజిట్‌ను చెల్లించి చీఫ్‌వార్డెన్ కార్యాలయం నుంచి మెస్‌కార్డును పొందాలన్నారు. పూర్తి వివరాలకు osmania.ac.in అనే వెబ్‌సైట్ చూడవచ్చు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: పోలీసు ఇంట్లోనే దొంగలుపడి నగదు, నగలు దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సామ్రాజ్ అనే వ్యక్తి టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ న్యూటన్ హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 2వ తేదీన ఉదయం ఘట్‌కేసర్‌లో బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండడంతో కుటుంబంతో సహా వెళ్లాడు. తిరిగి 3వ తేదీ సాయంత్రం ఇంటికి రాగా..ఇంటి మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉండాల్సిన బంగారు చెవి దిద్దులు, రెండు గోల్డ్ కాయిన్స్, 35 తులాల వెండి పట్టీలు, నగదు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన కానిస్టేబుల్ చుట్టుపక్కల వారిని, ఇతర కుటుంబ సభ్యులను విచారించాడు. ఫలితం లేకపోవడంతో మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చందానగర్‌లో డ్రగ్స్ స్వాధీనం.. ఐదుగురి అరెస్టు


డ్రగ్స్ విక్రేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హఫీజ్‌పేట్: గోవా నుంచి నగరానికి అక్రమంగా తరలిస్తున్న 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో పోలీసులు, అధికారులు, చందానగర్ పోలీసులు సంయుక్తంగా బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. సీఐ పాలవెల్లి తెలిపిన ప్రకారం వివరాలు..కేరళకు చెందిన అఖిల్ ఎం.జీ.గోవాలో హాస్టల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ పర్యాటకులకు డ్రగ్స్ సరఫరా చేస్తుంటాడు. ఏపీలోని రాజమండ్రికి చెందిన సూర్య కిషన్, రోహన్ పాల్‌లు ఇటీవల గోవాకు వెళ్లినప్పుడు అఖిల్ కలిశాడు. హైదరాబాద్, రాజమండ్రిలలో కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు వీరితో ఒప్పందం కుదుర్చుకున్నారు. వీరికి హబ్సిగూడకు చెందిన తోట సురేందర్, బీలె అరుణకుమార్‌లు జతకలిశారు. డ్రగ్స్‌ను సిటీకి తరలించగా...విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి చందానగర్‌లో అఖిల్‌తో పాటు నలుగురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, ఒక బైక్, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

'కామెడీ ఈజ్ సీరియస్ బిజినెస్'

బంజారాహిల్స్: హాస్యం అనేది దేశంలో లాభదాయకమైన, ఆకర్షణీయమైన, ఆశాజనకమైన 'సీరియస్ వ్యాపార'మని ప్రముఖ స్టాండప్ కమెడియన్ అమిత్ టాండన్ తెలిపారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ వేదికగా బుధవారం నిర్వహించిన మీట్‌లో అమిత్ టాండన్ పాల్గొని 'కామెడీ ఈజ్ సీరియస్ బిజినెస్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ రీతుషాతో ఆయన చర్చిస్తూ స్టాండప్ కామెడీ దేశవ్యాప్తంగా తక్కువ సమయంలోనే మంచి ఆదరణ పొందుతోందని అన్నారు. భారతీయ హాస్యనటులు ఆల్బర్ట్ హాల్ లండన్ వంటి వేదికలపైన ప్రదర్శనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు 700 అంతర్జాతీయ ప్రదర్శనలిచ్చారని అన్నారు. ప్రస్తుతం ఇదొక పెద్ద వ్యాపార వేదికగా మారిందని, నెలకు దాదాపు 10 వేల నుంచి 15 వేల వరకు కామెడీ షో టికెట్లు అమ్ముడవుతున్నాయన్నారు. 'దురదృష్టవశాత్తు హైదరాబాద్‌లో స్టాండప్ కామెడీకి మంచి వేదికలు లేవు. చాలా షోలు పబ్బుల్లోనే జరుగుతాయి. దీనికి కూడా మంచి ఆడిటోరియంలు కావాలి' అని అమిత్ టాండన్ అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి డీసీసీబీ చైర్మన్!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన, మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి హస్తం కండువా వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాండూరు అసెంబ్లీ టికెట్ ఇస్తామన్న హామీతోనే ఆయన కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గురువారం వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి..పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భేటీ అవుతారని మనోహర్‌రెడ్డి సన్నిహితులు వెల్లడించారు. బ్రేక్ ఫాస్ట్ భేటీలో భాగంగా కాంగ్రెస్ నేతలు మనోహర్ రెడ్డి నివాసానికి రానున్నారని తెలిపారు. మనోహర్‌రెడ్డి గతంలో రెండుసార్లు కుల్కచర్ల జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఈయన చేరిక పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ప్రభావం చూపనుంది.

బ్లాక్.. బిజినెస్!



- 'వస్త్ర వ్యాపారం' ముసుగులో నైజీరియన్ల దందా
- ఆ తరహా వీసాలపైనే వచ్చి ఉత్తరాదిలో తిష్ట
- ఇక్కడ కాజేసిన సొమ్ముతో వస్త్రాలు కొనుగోలు
- ఎక్స్‌పోర్ట్స్ పేరుతో తమ దేశాలకు తరలింపు
- ఫలితంగానే రికవరీల శాతం చాలా తక్కువ
- తక్షణమే ఫిర్యాదు చేయాలి: సైబర్ క్రైమ్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: బ్లాక్ టిక్కెట్.. బ్లాక్ మార్కెట్... బ్లాక్ మనీ.... ఈ పేర్లు తరచు వింటూనే ఉంటాం. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో మరో 'బ్లాక్' వెలుగులోకి వచ్చింది. అదే.. బ్లాక్ బిజినెస్. వివిధ పేర్లతో, రకరకాలుగా ఎర వేసి, అందినకాడికి దండుకుంటున్న సైబర్ నేరగాళ్లు చిక్కడమే కష్టసాధ్యం. ఇలా దొరికిన వారి నుంచీ రికవరీలు అసాధ్యంగా మారిపోయాయి. దీనికి ప్రధాన కారణం ఈ బ్లాక్ బిజినెస్. మెట్రో నగరాల్లో స్థిరపడిన నల్లజాతీయులు సైబర్ మోసాల ద్వారా ఆర్జించిన సొమ్మును వస్త్రాలు, వస్తువులుగా మార్చి తమ దేశానికి ఎక్స్‌పోర్ట్ చేస్తున్నారని పోలీసులు గుర్తించారు.

'వివరాల' సేకరణకు మార్గాలెన్నో...

ఈ సైబర్ నేరాల సూత్రధారుల్లో ఆఫ్రికా దేశాలకు చెందిన నల్లజాతీయులే ఎక్కువగా ఉంటున్నారు. వీరు ఆన్‌లైన్ మోసాలను ఈ-మెయిల్ లేదా ఎస్సెమ్మెస్, వాట్సాప్ మెస్సేజ్, ఫోన్‌కాల్‌లతో ప్రారంభిస్తారు. బహుమతులు, క్విజ్‌ల పేరుతో ఆన్‌లైన్‌లో చాలా సాధారణమైన ప్రశ్నల్ని అడుగుతూ వ్యక్తిగత వివరాలు పూరించమంటారు. మరోపక్క ఫ్రీ గిఫ్ట్ ఓచర్ల పేరుతో అనేక వాణిజ్య ప్రాంతాల్లో పేరు, నెంబర్, మెయిల్ ఐడీలతో స్లిప్స్ పూరించి బాక్సుల్లో వేయించే విధానాలు ఇటీవల పెరిగాయి. ఇవన్నీ అనేక మార్గాల్లో సైబర్ నేరగాళ్లకు చేరిపోతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా లక్ష ఫోన్ నెంబర్లు/ఈ-మెయిల్స్ రూ.30 వేలకు విక్రయించే వెబ్‌సైట్లూ ఉన్నాయి. వీటి ఆధారంగా ముఠాలుగా ఏర్పడి దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న నైజీరియన్లు ఏ సందర్భంలోనూ పోలీసులకు ఆధారాలు చిక్కకుండా పక్కా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఖాతాల స్థానంలో వాలెట్స్...

ఈ నైజీరియన్లు స్కీములు, పన్నులు, పెట్టుబడులంటూ బాధితుల నుంచి సొమ్ము స్వాహా చేయడానికి బ్యాంకు ఖాతాలు ఎంతో కీలకం. ఒకప్పుడు కేవలం ఖాతాల్లోనే నగదు జమ చేయించుకునే వీరు ఇటీవల కాలంలో వివిధ రకాలైన వాలెట్స్‌ను వాడుతున్నారు. వీటిని నైజీరియన్లే నేరుగా తెరిస్తే కేసు నమోదైనప్పుడు పోలీసులకు దొరికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో నైజీరియన్లు ఈ ఖాతాలు, వాలెట్స్ కోసం భారీ పథక రచన చేస్తున్నారు. ముంబై, బెంగళూరు, ఢిల్లీలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు ఎరవేస్తున్న ఈ ఏజెంట్లు బ్యాంకు ఖాతాలు/వాలెట్స్ తెరిచి, తమ వ్యాపారానికి సహకరిస్తే ప్రతి లావాదేవీలోనూ కమీషన్ ఇస్తామంటూ ఎర వేస్తున్నారు. వీరికి ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు కొందరు రాజకీయ ప్రముఖుల నల్లధనాన్ని తాము వైట్ మనీగా మారుస్తామని, దాని కోసమే ఇవి అంటూ నమ్మబలికి వారిని ఒప్పిస్తున్నారు. ఈ రకంగా కమీషన్ తీసుకుని తమ ఖాతాలు/వాలెట్స్‌ను అప్పగించే వారిని సాంకేతిక పరిభాషలో మనీమ్యూల్స్ అంటారు.

రోజుల్లోనే వస్తువులుగా 'ఎక్స్‌పోర్ట్'...

ఇలా చేయడం ద్వారా ఖాతాలు/వాలెట్స్‌ను తెరిచిన వారికి, ఏజెంట్లకు మధ్య... ఏజెంట్లకు నైజీరియన్లకు మధ్య ఎలాంటి లింకు లేకపోవడంతో సూత్రధారులు దొరకడం కష్టమవుతోంది. సైబర్ మోసాల ద్వారా సంపాదించిన సొమ్మును నగదు రూపంలో నైజీరియా తదితర ఆఫ్రికా దేశాలకు పంపడం ఇబ్బందికరం. దీంతో మోసగాళ్లు బాధితుల నుంచి స్వాహా చేసిన సొమ్మును వస్తు/వస్త్ర రూపంలోకి మార్చేస్తున్నారు. వీటిని ఎగుమతుల పేరుతో తమ దేశానికి తరలిస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. ముఠాలో కొందరిని బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చి ఎక్కువగా వస్త్ర వ్యాపారుల ముసుగులోనే తలదాచుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే బాధితుల నుంచి కాజేసిన దాంట్లో కొంత మొత్తాన్ని తమ వద్ద ఉంచుకుని, మిగిలిన దాంతో హోల్‌సేల్‌గా వస్త్రాలు, ఎగుమతికి ఇబ్బంది లేని వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని బిజినెస్ వీసాపై వచ్చిన వారికి అప్పగించడం ద్వారా కన్‌సైన్‌మెంట్ రూపంలో ఆయా ఆఫ్రికన్ దేశాలకు పంపిస్తున్నారు. ఈ కన్‌సైన్‌మెంట్స్‌ను రిసీవ్ చేసుకునేందుకు అక్కడా ముఠా సభ్యులు ఉంటున్నారు. వీరు అక్కడ మార్కెట్‌లో ఆయా వస్తువులు, వస్త్రాలు అమ్మి క్యాష్ చేసుకుంటున్నారు. ఈ కారణంగానే సైబర్ నేరాల్లో నగదు రికవరీ చేయడం అసాధ్యంగా మారుతోందని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు.

24 గంటల్లో ఫిర్యాదు చేస్తే ఉపయుక్తం

సైబర్ నేరాల్లో నిందితుల నుంచి రికవరీ చేయడం కష్టసాధ్యంగా మారింది. ఈ కేసుల్లో బాధితులు పోలీసుల్ని ఆశ్రయించడానికీ ఆలస్యం చేస్తుండటం మరో ఇబ్బందికర అంశంగా మారుతోంది. ఈ మోసగాళ్ల బారినపడిన వారు గరిష్టంగా 24 గంటల్లోపు ఫిర్యాదు చేస్తే కొంత వరకు ఉపయుక్తం. నేరం బారిన పడిన వెంటనే 1930 లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలి. అనేక సందర్భాల్లో బాధితులు ఫిర్యాదు చేయడానికి ఆలస్యం చేస్తున్నారు.
– సైబర్ సెక్యూరిటీ బ్యూరో

కర్రలతో కొట్టి చంపారు!

- కారుతో పిల్లర్లను ఢీకొట్టి.. యాక్సిడెంట్‌గా చిత్రీకరణ
- ఎన్ఆర్ఐ అంజిరెడ్డి హత్య కేసులో ఆ నాలుగు గంటలే కీలకం


నిందితుడు రాజేష్

రాంగోపాల్‌పేట్: స్థిరాస్తి కొనుగోలు చేస్తామని చెప్పి నమ్మించి ఎన్నారై, సినీ నిర్మాత అంజిరెడ్డిని హత్య చేసిన కేసులో నిందితుడు రాజేష్ మొదటి నుంచి పథకం ప్రకారమే కథ అంతా నడిపించాడు. ఇల్లు కొనుగోలు చేస్తానని నమ్మించి..డబ్బు చెల్లించకుండానే ఇంటిని స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశంతో ఆయనను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్య కేసులో నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నా పూర్తి వివరాలు వెల్లడించడం లేదు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజేష్, ఆయన డ్రైవర్, ఇద్దరు బిహారీ పనిమనుషులు మొత్తం ఆరుగురి ప్రమేయం బయటపడగా మరికొంత మంది కూడా ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆ నాలుగు గంటల్లో ఏం జరిగింది?

గత నెల 29వ తేదీ సాయంత్రం 5.31 నిమిషాలకు సికింద్రాబాద్ ఎస్.డి రోడ్డులోని డి-మార్ట్ భవనంలో బేస్‌మెంట్-3కు నిందితుడు రాజేష్ ఒక కారులో రాగా ఆయనతో పాటు అంజిరెడ్డి తన వ్యాగన్ ఆర్ కారులో వచ్చారు. ఇదే భవనంలోని మొదటి అంతస్తులో జీఆర్ కన్వెన్షన్ ఉండగా దీనికి సంబంధించిన కారు పార్కింగ్ బేస్‌మెంట్-3లో కొనసాగుతుంది. ఈ కన్వెన్షన్లో ఫంక్షన్లు అయినపుడు మాత్రమే కార్లు పార్కింగ్ చేసి ఉంటాయి. లేకుంటే పార్కింగ్ ప్రదేశం మొత్తం ఖాళీగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అంజిరెడ్డిని బెదిరించి సంతకాలు చేయించుకుని అంతమొందించేందుకు మంచి ప్రదేశమని పథకం వేశారు. 5.31 నిమిషాలకు కార్లు బేస్‌మెంట్-3 లోపలికి వెళ్లగా దాదాపు రాత్రి 8.45 ప్రాంతంలో అంజిరెడ్డికి ప్రమాదం జరిగిందని కుమారుడు చరణ్‌కు సమాచారం వచ్చింది. దీంతో 9.15 నిమిషాలకు పోలీసులు ఈ భవనంలోని బేస్‌మెంట్-3కి చేరుకున్నారు. అయితే ముందుగానే సిద్ధం చేసుకున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల డ్రాఫ్టును ఆయన ముందుంచి సంతకాలు తీసుకునేందుకు తీవ్రంగా ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో కర్రతో ఆయనను తీవ్రంగా గాయపరచడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత అంజిరెడ్డి కారు ప్రమాదానికి గురై మరణించినట్లు చిత్రీకరించేందుకు ఆయన వ్యాగన్ ఆర్ కారును భవనం పిల్లర్లకు గుద్ది ప్రమాదంగా నమ్మించారు. మృతదేహాన్ని కారు పక్కన పడేసి ఏమి తెలియనట్లు ఉన్నారు. పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి..మృతదేహాన్ని అక్కడ నుంచి తొలగించాక...రాజేష్ కారులో నిందితులు బేస్‌మెంట్-3 నుంచి బయటకు వెళ్లారు. ఆ తర్వాత మూడు కార్లలో వేర్వేరు ప్రాంతాలకు పారిపోయారు. సాయంత్రం 5.31 నిమిషాల నుంచి 9.15 నిమిషాల వరకు మధ్యలో ఏమి జరిగిందనేది ఇంకా కొంత సస్పెన్షన్ కొనసాగుతోంది. హత్యకు గురైన అంజిరెడ్డి గతంలో పలు చిత్రాలకు నిర్మాతగా వ్యహరించారు. 1993లో దొంగ అల్లుడు, చెలికాడు తదితర చిత్రాలు నిర్మించగా...గత కొద్ది రోజుల నుంచి ఆయన సినీ నిర్మాణానికి దూరంగా ఉంటున్నారు.


సంఘటనా స్థలంలో మృతుడు అంజిరెడ్డి

ఉప్పల్‌లో సీఎంఆర్ మాల్ ప్రారంభం

- హాజరైన మంత్రి తలసాని శ్రీనివాస్
- సందడి చేసిన కృతీశెట్టి


పట్టు వస్త్రాల విభాగాన్ని ప్రారంభిస్తున్న హీరోయిన్ కృతిశెట్టి


మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని తదితరులు

ఉప్పల్: ఉప్పల్‌లో బుధవారం సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, సినీతార కృతి శెట్టిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను మంత్రి తలసాని అభినందించారు. కస్టమర్లకు నాణ్యమైన వస్త్రాలు అందించాలని కోరారు. అనంతరం మాల్ నిర్వాహకుడు ఎంవీ రమణ మాట్లాడారు. 40 ఏళ్లుగా వినియోగదారుల ఆదరణ చూరగొంటున్నామని చెప్పారు. పండుగల వేళ మంచి ఆఫర్లు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఉప్పల్‌లో 25వ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ ఇంత గొప్ప వస్త్ర దుకాణాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కందికంటి అశోక్ కుమార్ గౌడ్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. మిమిక్రి ఆర్టిస్ట్ శివారెడ్డి బృందం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పేద విద్యార్థుల చెంతకు వైద్య విద్య

– మంత్రి హరీష్‌రావు

మేడ్చల్ రూరల్: రాష్ట్రంలో పేద విద్యార్థులకు సైతం వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాల, ఆస్పత్రులను బుధవారం మంత్రులు మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల్లో సైతం 50 శాతం సీట్లు ప్రభుత్వమే పేద విద్యార్థులకు ఫీజులతో కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వచ్చాక మెడికల్ కాలేజీల సీట్లు నాలుగు రెట్లు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. వైద్య విద్యతో పాటు పేదలకు వైద్యం కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో సైతం పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నామని వివరించారు. జిల్లాల్లో మెడికల్ కళాశాలలు అందుబాటులోకి రావడంతో వైద్యం కోసం హైదరాబాద్ నగరానికి రావాల్సిన అవసరం తగ్గిందన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో 500 పడకల ఆస్పత్రి అందుబాటులోకి వస్తుందన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత తమకే దక్కుతుందన్నారు. తాము పేదలకు ఉచితంగా వైద్యం అందిచాలనే సంకల్పంతో మెడికల్ కళాశాలు, ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐటీ, వైద్యం, ఫార్మసీ రంగాల్లో విద్యార్థులను తమ విద్యాసంస్థల ద్వారా తయారు చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ మెడికల్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సెక్రటరీ వసంత లత, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ కళాశాల ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

గంట వ్యవధిలో .. పోగొట్టుకున్న సొమ్ము లభ్యం

బంజారాహిల్స్: ఖరీదైన బంగారు వజ్రాభరణాలు, విలువైన డాక్యుమెంట్లతో కూడిన బ్యాగును పోగొట్టుకున్న ఎన్ఆర్ఐలకు బంజారాహిల్స్ పోలీసులు గంట వ్యవధిలోనే ఛేదించి వారికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని ఏకే ఎన్‌క్లేవ్‌లో నివసించే సయ్యద్ ఫాజిల్ అహ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి లండన్‌లో ఉంటారు. బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి మంగళవారం రాత్రి బజార్ ఘాట్‌లో ఆయన భార్య, పిల్లలు శుభకార్యానికి హాజరై 11.30 గంటల సమయంలో క్యాబ్‌లో అక్కడి నుంచి ఏకే ఎన్‌క్లేవ్‌కు తిరిగి వచ్చారు. కారుదిగే సమయంలో ఆభరణాలు ఉన్న బ్యాగును మర్చిపోయి ఇంట్లోకి వెళ్లిపోయారు. ఇంట్లోకి వెళ్లిన తర్వాత చూసుకోగా బ్యాగు కనిపించలేదు. ఆందోళన చెందిన ఆమె వెంటనే బయటికి వచ్చి చూడగా అప్పటికే కారు వెళ్లిపోయింది. వెంటనే ఫాజిల్ బంజారాహిల్స్ డీఐ షేక్ జాకీర్ హుస్సేన్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని అక్కడ సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఎక్కడా కారు నెంబర్ కనిపించలేదు. రాత్రి ఆ సమయంలో బంజారాహిల్స్‌కు వచ్చిన క్యాబ్ వివరాలు సంబంధిత సంస్థను అడిగి డ్రైవర్ నెంబర్ తీసుకున్నారు. వెంటనే క్యాబ్ డ్రైవర్ మహ్మద్ నిజాముద్దీన్‌కు ఫోన్ చేయగా బ్యాగు ఉన్న విషయాన్ని తెలియజేశాడు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని బ్యాగును స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. అందులో ఉండాల్సిన వజ్రాభరణాలు భద్రంగా ఉన్నాయని, మిగతా డాక్యుమెంట్లు కూడా ఉన్నట్లు వారు తెలిపారు. గంట వ్యవధిలోనే తమ బ్యాగును వెతికి అప్పగించిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్‌కు ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని తెలియజేశారు.

బీఆర్ఎస్‌కు పాలించే హక్కులేదు

పంజగుట్ట: ఉద్యోగ నియామకాలు కూడా పారదర్శకంగా చేపట్టలేకపోతున్న బీఆర్ఎస్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని, పేపర్ లీకేజీలు, కోర్టు కేసులతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, రెండవసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు రద్దుకు ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్‌తో కలిసి మాట్లాడారు.

క్లుప్తంగా...

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 45, పొడుగువంకాయ 16, బెండకాయ 23, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 47, పచ్చి కాకరకాయ 23, పందిరిబీర 28, క్యాబేజీ 16, క్యారెట్ 31, దొండకాయ 23, గుండు బీన్స్ 85, గింజచిక్కుడు 45, గోకరకాయ 23, కీర 19, దోసకాయ 13, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 32, కందగడ్డ 50, గుమ్మడికాయ 13, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 11, పొట్లకాయ 13, అరిటికాయ 9, మునగకాయ 4, ఉల్లిపొరక 50 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎర్రగడ్డ డివిజన్‌లో సుమారు రూ. 30 లక్షలతో సేవరేజ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఓల్డ్‌సుల్తాన్‌నగర్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ డి.సంజీవ, నేతలు షరీఫ్ ఖురేషి, గంట మల్లేష్, అజీమ్, శ్రీధర్‌గౌడ్, జమీల్, రసూల్, కళ్యాణి, జులేఖ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



ఖైరతాబాద్ అసెంబ్లీ ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఓటరు తుది జాబితా విడుదల చేశారు. దీని ప్రకారం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,89,558 ఉంది. ఇందులో పురుషులు 1,50,892 కాగా, మహిళలు 1,38,639 ఇతరులు 27 మంది ఉన్నారు.

'రూ. 450తో డెంగీని నయం చేయొచ్చు'

పంజగుట్ట: ప్రజలను కబళిస్తున్న డెంగీని రూ. 450ల విలువైన మందులతో పూర్తిగా నయం చేయవచ్చని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వసంత కుమార్ గౌరాని తెలిపారు. తానేమీ కొత్తమందులు తయారు చేయలేదని ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పాతమందులే వాడి 9 వేలు ప్లేట్‌లెస్ ఉన్న పేషెంట్‌కు మూడు రోజుల్లో లక్ష 10 వేలకు తీసుకువచ్చానని ఆయన తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎంతో మంది ఆస్పత్రి పాలై లక్షలు ఆస్పత్రులకు కట్టి పేదవారిగా మారుతున్నారని తాను ఒక క్వాలీపై ప్రభుత్వ వైద్యుడిగా అన్ని రకాల రోగాలకు అతితక్కువ ఖర్చుతో కూడుకున్న మందులు ఇచ్చి నయం చేశానని తెలిపారు. ఏ వ్యాధికి తక్కువ ఖర్చుతో కూడుకున్న ఏమందులు వాడటం వల్ల నయం అవుతుందో ఐసీఎంఆర్‌కు పూర్తి ఆధారాలతో నివేదిక పంపానని కాని ఇప్పటివరకు సమాధానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలకు మేలు చేయాలన్నదే లక్ష్యం : మంత్రి తలసాని

సనత్‌నగర్: నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాలన్నదే తన లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏకేగౌడ్ ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీ పనులు, నీమ్‌కార్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొమ్మిదిన్నరేళ్లలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో రూ.1,400 కోట్లకు పైగా వ్యయంతో అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఈ ప్రాంతం నుంచి గెలిచి ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు కూడా చేయలేని అనేక పనులను తాము చేసినట్లు వెల్లడించారు. ఇండస్ట్రియల్ పార్కు నుంచి బాలానగర్ చౌరస్తా వరకు అండర్‌పాస్ నిర్మాణ పనుల కోసం రూ.100 కోట్లను మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్, డీఎంసీ జగన్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, కొలను బాల్‌రెడ్డి, బాలరాజ్, ఓంప్రకాష్ శర్మ పాల్గొన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద 400 మంది బీసీ కుల వృత్తిదారులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

బతుకమ్మ చీరలు సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బతుకమ్మ పండగకు మహిళలకు అందించే చీరలు నిర్దేశించిన కేంద్రాలకు చేరాయి. ఆయా కేంద్రాల్లో చీరల పంపిణీ ఉంటుందని జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు.

- రెండు రోజుల్లో పంపిణీ కార్యక్రమాలు
- ఏర్పాట్లు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు
- లబ్ధిదారుల జాబితాను సిబ్బందికి అందజేత



బతుకమ్మ చీరలు (ఫైల్)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లకు 41,107 మంది మహిళలకు చీరలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో 34,370 మంది లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు.

వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో...

గాంధీపుర బస్తీ, దేవరకొండ బస్తీ, ఇబ్రహీంనగర్ బస్తీ, గురుబ్రహ్మనగర్ బస్తీ, దూద్‌ఖానా బస్తీ కమ్యూనిటీ హాళ్లలో పంపిణీ చేస్తారు

బంజారాహిల్స్ డివిజన్‌లో...

ఉదయనగర్, ప్రేమ్‌నగర్, ఎన్బీటీ నగర్ కమ్యూనిటీ హాళ్లతో పాటు ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల, శ్రీరాంనగర్‌లోని న్యూబడ్స్‌స్కూల్, భోలానగర్‌లోని సఫా స్కూల్‌లో చీరలు పంపిణీ జరుగుతుంది.

జూబ్లీహిల్స్ డివిజన్‌లో...

ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని టెన్నిస్‌కోర్ట్, జవహర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల, ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్, రౌండ్‌టేబుల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేస్తారు.

ఖైరతాబాద్ డివిజన్ పరిధిలో...

మహాభారత్ నగర్ కమ్యూనిటీ హాల్, శ్రీనివాసనగర్ కమ్యూనిటీ హాల్, తుమ్మలబస్తీ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, రైల్వే గేట్ సమీపంలోని మక్తా ఉర్దూ మీడియం హైస్కూల్‌లో పంపిణీ చేస్తారు.

సోమాజిగూడ డివిజన్ పరిధిలో...

సోమాజిగూడ మక్తా, బాలాపుర బస్తీ అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్, పంజగుట్ట పోచమ్మబస్తీ కమ్యూనిటీ హాల్, శ్రీనగర్ కాలనీ నాగార్జున కమ్యూనిటీ హాల్, ఎల్లారెడ్డిగూడ పీజేఆర్ కమ్యూనిటీ హాల్, ఎల్లారెడ్డిగూడ నాగార్జున కమ్యూనిటీ హాల్, సోమాజిగూడ బీఎస్ మక్తా లైబ్రరీలలో చీరల పంపిణీ ఉంటుంది.

సింగాడికుంటలో విజయారెడ్డి ప్రచారం



హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహించిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాత్‌సే హాత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు తెలియజేసేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలోని సింగాడికుంటలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తెలియజేసే కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి మద్దతు లభించిందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. రోజురోజుకు కాంగ్రెస్ గ్రాఫ్ అనూహ్యంగా పెరుగుతున్నదని స్పష్టం చేశారు.

గిరిజన వర్సిటీ ప్రకటన భేష్



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

వెంగళరావునగర్: తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడం రాష్ట్రాన్ని ఎంతో గర్వకారణమని బీజేపీ సీనియర్ నాయకులు అన్నారు. ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క పేరుమీద గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయడాన్ని పురస్కరించుకుని బుధవారం బీజేపీ గిరిజన మోర్చా సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు బానోతు జ్యోతినాయక్ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ పద్మ వీరపనేని, లంకెల దీపక్‌రెడ్డి, జూటూరి కీర్తిరెడ్డి, కుంభాల గంగరాజు, ఆలపాటి లక్ష్మీనారాయణ, అట్లూరి రామకృష్ణ, షర్మిలాజాదవ్, రాజేంద్ర రాథోడ్, రమేష్ నాయక్, చంద్రమోహన్, నందికాశి విజయ్, అనంతలక్ష్మి, ప్రసన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత మోదీ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకాన్ని నిర్వహించి నినాదాలు చేశారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన అవసరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏసీపీ సంజయ్ కుమార్

పంజగుట్ట: విద్యార్థి దశనుంచే నాణ్యతా ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్ తెలిపారు. భారతీయ ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) హైదరాబాద్ శాఖ నిర్వహిస్తున్న మానక్ మహోత్సవ్ 2023 వేడుకలు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. బీఐఎస్ శాస్త్రవేత్త గోరేనంద్ ప్రసాద్ యాదవ్, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయి విద్యార్థులకు పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థులకు భారతీయ ప్రమాణాల వ్యాసరచనా, పోస్టర్ డిజైనింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతిని ఏసీపీ అందించారు. రిటైర్డ్ సైన్స్ అధికారి గాంధారి ప్రభాకర్, ప్రిన్సిపాల్ రాజేంద్ర పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యం



బానోతు నందిని

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎం.సంతోష్ కుమార్ సమాచారం మేరకు... సబ్జాకాలనీలో నివసించే బానోతు నందిని(23) సమీపంలోని జాగ్వార్ షోరూంలో హౌస్ కీపింగ్‌లో పని చేస్తున్నది. ఈ నెల 2వ తేదీన సాయంత్రం తండ్రి మార్కెట్‌కు వెళ్లగా తల్లి డ్యూటీకి వెళ్లిపోయింది. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉండాల్సిన కూతురు కనిపించలేదు. వెంటనే నందినికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ అని వచ్చింది. అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన కూతురు కనిపించడం లేదంటూ తండ్రి ఉపేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయి అనే యువకుడిపై తమకు అనుమానాలు ఉన్నాయని అందుకు సంబంధించిన వివరాలను పోలీసులకు అందజేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు నందిని కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమలాపురి కాలనీలో పేరుకుపోయిన చెత్త



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ రెండులోని కమలాపురి కాలనీలో కొంత కాలం నుంచి చెత్త సమస్య తీవ్రంగా ఉంది. పారిశుద్ధ్య విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపించారు. ఇండియన్ బ్లాసం స్కూల్ ముందు ఈ పరిస్థితి నెలకొంది.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన బాకీ వెంకటయ్యను దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వల్లిగొండ శ్రీనివాస్ భినందించారు. బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకటయ్యకు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. సత్వరమే పరిష్కారముతాయని ఆ దిశగా చైర్మన్ వెంకటయ్య ఎస్సీలకు అండగా నిలుస్తారని వల్లిగొండ శ్రీనివాస్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, అణచివేతపై చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని కోరారు.



వెంకటయ్యను సన్మానిస్తున్న నాయకులు

కొనసాగుతున్న వ్యర్థాల తొలగింపు



బంజారాహిల్స్: వినాయక చవితి నిమజ్జనాలు పూర్తయి వారం రోజులు గడుస్తున్నా ఇంకా వ్యర్థాల తరలింపు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ట్యాంక్‌బండ్‌లో పూర్తిగా వ్యర్థాల తొలగింపు తరలింపు పూర్తికాగా, ఎన్టీఆర్ మార్గ్‌లో మాత్రం పనులు జరుగుతున్నాయి. విగ్రహాల నుంచి వెలువడే ఇనుమును బయటికి తీసిన సిబ్బంది వాటిని ముక్కలు ముక్కలుగా కట్ చేసి ఇక్కడి నుంచి తరలిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఎన్టీఆర్ మార్గ్‌లో సైతం పనులు పూర్తవుతాయని హెచ్ఎండీఏ అధికారులు చెబుతున్నారు.

సదరమ్ సర్టిఫికెట్లు అందక రోగులకు ఇబ్బంది

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో సదరమ్ సర్టిఫికెట్లు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మానసిక ఆస్పత్రిలో సదరమ్ సర్టిఫికెట్లను అందించే సైకాలజిస్ట్ డాక్టర్ నెల రోజుల క్రితం నుంచి రావట్లేదు. సస్పెన్షన్ గురైన సదరు డాక్టర్ లేకపోవడంతో సర్టిఫికెట్ల అందజేతలో జాప్యం నెలకొంది. రోగుల ఎంతో అవసరమ్యే సదరమ్ సర్టిఫికెట్లను సర్టిపై చేసే డాక్టర్ లేక రోగుల బంధువులు రోజుల తరబడి ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్‌ని సంప్రదించగా... డాక్టర్ లేని విషయాన్ని ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లమని, చర్చలు కూడా చేశామన్నారు. మరో సైకాలజిస్ట్ డాక్టర్‌ను ఔట్ సోర్సింగ్ ద్వారా త్వరితగతిన ఆస్పత్రికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలియజేశారు. ఉన్నతాధికారులు ఈ విషయమై ప్రత్యేక దృష్టిసారించి సమస్యను త్వరగా పరిష్కరించాలని రోగులు, రోగుల బంధువులు కోరుతున్నారు.

గాయపర్చుకోవద్దని వారించిన యువకుడిపై దాడి

వెంగళరావునగర్: రోడ్డుపైన యువకుడు తనకుతాను గాయాలు చేసుకుంటుండగా మరో యువకుడు వద్దని వారించడంతో అతనిపైనే దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద ఈ నెల 3న సాయంత్రం ఫిలిప్ అనే వ్యక్తి తనను తాను గాయాలు చేసుకుంటున్నాడు. కార్మికనగర్‌లోని ఓ టెంట్ హౌస్‌లో పనిచేసే బబ్లూ వద్దని వారించాడు. దీనికి ఆగ్రహించిన ఫిలిప్ కత్తెర తీసుకుని బబ్లూ తలమీద, గడ్డం, చెంపలపై కొట్టాడు. దాంతో బబ్లూకు రక్తస్రావం జరిగింది. బాధితుడి ఫిర్యాదు యూసఫ్‌గూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై దాడి: నిందితుల అరెస్ట్

వెంగళరావునగర్: డ్యూటీ నుంచి ఇంటికి వస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ వాహనాన్ని ఢీ కొట్టడమే కాకుండా దూషించి దాడికి పాల్పడిన వ్యక్తులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ... ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసే పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన టి.శ్రీధర్‌బాబు రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 3న విధులు ముగించుకొని తన నివాసానికి వెళుతున్నాడు. యూసుఫ్‌గూడ బస్తీ వద్దకు రాగానే అనుకోకుండా ఒక ఆటో అతని వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో శ్రీధర్‌బాబు కింద పడ్డాడు. అనంతరం వెళ్లిపోయాడు. మరోసారి రహమత్‌నగర్ చౌరస్తా వద్దకు రాగానే మళ్లీ అతని స్నేహితులతో కలిసి ఢీకొట్టాడు. వేగంగా వారు వెళ్లిపోయారు. కానిస్టేబుల్ కూడా ఇంటికి వెళ్లే క్రమంలో కార్మికనగర్ ఆటో స్టాండ్ వద్ద వారు కనిపించారు. వారితో మాట్లాడేందుకు కానిస్టేబుల్ ప్రయత్నించగా వారు తీవ్రంగా దుర్భాషలాడారు. అతనిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

'అపోలో'లో సందడిగా వైట్‌కోట్ సెర్మనీ



వైట్‌కోట్ అందుకుంటున్న అపోలో వైద్య విద్యార్థిని పావని

బంజారాహిల్స్: అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ 2023 సంవత్సరానికి చెందిన వైద్య విద్యార్థులకు స్వాగతం పలికేందుకు బుధవారం బంజారాహిల్స్‌లోని ఆర్ఎస్ఆర్ ఆడిటోరియంలో వైట్‌కోట్ సెర్మనీని కనుల పండువగా నిర్వహించారు. ఫ్రాన్స్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ రుయన్ ఇంటర్వెన్షన్ కార్డియాలజీ విజిటింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ పీసీ రథ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు తెల్లకోట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేందర్‌రెడ్డి, సీవోవో అపర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన 150 మంది విద్యార్థులకు అధ్యాపకులు వైద్య సమాజంలోకి స్వాగతించి వారికి సంప్రదాయబద్ధంగా తెల్లటి అప్రాన్లను తొడిగారు. తెల్లకోట్లు ధరించిన వైద్య విద్యార్థులు ఆ తర్వాత స్నాతకోత్సవంలో సంప్రదాయకంగా చేసే హిప్పోక్రేట్స్ ప్రమాణం చేశారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్లిన భర్త తిరిగి రాలేదంటూ ఓ మహిళ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రవల్లిక, వీరేంద్ర దంపతులు కొన్నేళ్లుగా రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో ఉంటున్నారు. ప్రవల్లిక ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా, వీరేంద్ర ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తుంటారు. ఈ నెల 3వ తేదీ ప్రవల్లికను ఆమె భర్త వీరేంద్ర అమీర్‌పేట మెట్రో స్టేషన్ సమీపంలో తన వాహనంపై దింపి విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో తాను డబుల్ డ్యూటీ చేస్తున్నానని, రాత్రి 9 గంటలకు ఇంటికి వస్తానని ఆమె సెల్‌ఫోన్‌కు వాయిస్ మెసేజ్‌ను పంపాడు. అనంతరం ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. తిరిగి రాత్రి 7.20 గంటల సమయంలో మరోసారి వాయిస్ మెసేజ్ పంపాడు. తాను డ్యూటీ రాత్రి 11 గంటల వరకు పెంచారని, అనంతరం ఇంటికి వస్తానని ఆ మెసేజ్‌లో తెలియజేశాడు. వెంటనే ప్రవల్లిక తన భర్తకు ఫోన్ చేసింది. అయితే అప్పటికే వీరేంద్ర ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. రెండు రోజులైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తన భర్త స్నేహితులు, బంధువుల ఇళ్లకు ఫోన్లు చేసి సమాచారం అడిగింది. ఫలితం లేకపోవడం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాతృభాషలో పాఠశాల విద్య ఉత్తమం

మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

బంజారాహిల్స్: మాతృభాషకు ఆదరణ తగ్గడం అనర్థదాయకమని, కనీసం మాతృభాషలో పాఠశాల విద్యను అభ్యసిస్తే విద్యార్థుల మేధస్సుకు గట్టి పునాదులు ఏర్పడతాయని మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు తెలిపారు. బుధవారం బంజారాహిల్స్ వేదికగా నిర్వహించిన సాహిత్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్‌రావు విశ్రాంత ప్రధానాచార్యులు కెప్టెన్.డా.బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన మధుపాళీ వ్యాసతోరణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఆంగ్లమాధ్యమ విద్యకు పిల్లలు, తల్లిదండ్రులు, పౌర సమాజం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో నేటి చిన్నారులు, రేపటి పౌరులు సంస్కృతి, వారసత్వాలకు దూరం అవుతూ పాశ్చాత్య సంస్కృతికి పట్టం కడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. కెమిస్ట్రీ ఆచార్యులుగా, ప్రిన్సిపాల్, పాఠ్యపుస్తక రచయిత, కాలమిస్టు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, కవి, సంఘసేవకులుగా బహుముఖ ప్రతిభ కనబరిచిన డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో దాస్యం సేనాధిపతి, నేటి నిజం సంపాదకులు బైసా దేవదాసు, శాతవాహన టైమ్స్ సంపాదకులు అనుముల దాయాకర్, కరీంనగర్ ఫిలిమ్ సొసైటీ అధ్యక్షులు, కవి, సినీ రచయిత పొన్నం రవిచంద్రలు తదితరులు పాల్గొన్నారు.

బెంగాలీ హ్యాండ్లూమ్ ఆర్ట్ ప్రారంభం

సనత్‌నగర్: బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్ రోడ్డులోని వైట్ హౌస్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన బెంగాలీ హ్యాండ్లూమ్ ఆర్ట్‌ను బుధవారం కల్నల్ సంజయ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వప భోమిక్, సోమనాథ్ భోమిక్ మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్ నుంచి సర్టిఫైడ్ జెన్యూన్ సిల్క్, కాటన్, లినెన్, చేనేత ఉత్పత్తుల తయారీదారుల నుంచి సేకరించిన ప్రత్యేక నేచురల్ ఫ్యాబ్రిక్ చీరలు, సూట్స్, బ్లౌజు పీస్‌లు తదితర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే దకాయ్ జమ్దానీ, బనారస్, సిల్క్ జమ్దానీ, టస్సర్ సిల్క్, మట్కా సిల్క్, బైలూమ్, కాంతా, హ్యాండ్ పెయింటెడ్, లినెన్, ఖాదీ, కాటన్ జమ్దానీ, ముంగా సిల్క్(అస్సాం) తదితర ఉత్పత్తులు తమ ప్రత్యేకమన్నారు.

వృద్ధుడి అదృశ్యం

సనత్‌నగర్: మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గంగాధర్ వివరాల ప్రకారం..బేగంపేట అల్లాద్దీన్ బిల్డింగ్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన చంద్రయ్య (85) జా ఉదయం తన ఇంటి వద్ద నుంచి ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ వరకు వాకింగ్‌కు వెళ్లి వస్తుంటాడు. ఈ నెల 1న ఉదయం వెళ్లిన చంద్రయ్య ఎంతకీ ఇంటికి రాలేదు. గతంలో ఒకసారి అదృశ్యమై తర్వాతి రోజు ఇంటికి వచ్చాడు. ఈ సారి నాలుగు రోజులైనా రాకపోవడంతో మనుమడు రాజు పోలీసులను ఆశ్రయించాడు.

సాక్షి బిజినెస్
గురువారం
5-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	286	65,226
నిఫ్టీ ▽	93	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,154	△	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	△	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,653	▽	22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426	▽	22
వెండి (కిలో)	67,446	△	409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌ఆర్	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌ఆర్	98.87	102.21
€	యూరో	ఎన్‌ఆర్	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌ఆర్	54.95	56.65
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌ఆర్	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	ఎన్‌ఆర్	59.65	61.57
SAR	సౌదీ రియాల్	[illegible]	21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.80	23.53
¥	చైనా యువాన్	[illegible]	10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హుడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

Reliance RETAIL
SUPERDRY®

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడంతోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.



నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్‌ఐఐల వరుస విక్రయాల ప్రభావం

ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్టం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ



ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.

- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్లు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు.



అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117–118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.

వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి

న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం



తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.

భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత్ టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, డయాజియో, ఎంఆర్‌ఎఫ్, లెండింగ్‌కార్ట్, బీపీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా–కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్–సర్వ్ ఫ్రేమ్‌వర్క్''ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు.



సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.

భవిత

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Quiz, Drawing, Essay పోటీలు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే ఈ క్యూఆర్ స్కాన్ చేయండి.. మీ మేధస్సుకు పదును పెట్టి.. ఈ పోటీల్లో పాల్గొనండి.. విజేతలుగా నిలవండి. –ఆల్ ది బెస్ట్..

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు –100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్–2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్–2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్–02, క్లినికల్ సైకాలజిస్ట్–01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్) –01, యోగా ఇన్‌స్ట్రక్టర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–04, స్టోర్ కీపర్–04, జూనియర్ ఇంజనీర్–03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్–01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్–02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, ఆప్టోమెట్రిస్ట్–02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)–16, టెక్నీషియన్(రేడియాలజీ)–02, ఫార్మసిస్ట్–05, ఫైర్ టెక్నీషియన్–02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు–02, స్టెనోగ్రాఫర్–04, లాండ్రీ సూపర్‌వైజర్–01, జూనియర్ వార్డెన్–02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్శిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్‌ఎఫ్ పొందొచ్చు. మరోవైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌లూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ–నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ–నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్ట్‌లలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ–నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్‌ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్ట్‌లలో నెట్ నిర్వహణ



యూజీసీ-నెట్ 2023

- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1.. 50 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2.. 100 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

పేపర్ ఎంపిక ఎలా

- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్–1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్-1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్–1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ పేపర్

పేపర్–2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్‌ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్‌ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్, ఎస్‌ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 30, 31 అక్టోబర్ 2023
- **పరీక్ష తేదీలు:** 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

పసుపుబోర్డు, గిరిజన వర్సిటీకి | కేంద్ర కేబినెట్ ఓకే

2030 నాటికి పసుపు ఎగుమతులను రూ.8,400 కోట్లకు పెంచే లక్ష్యం

- గిరిజన యూనివర్సిటీ కోసం రూ.889.07 కోట్లు కేటాయింపు
- తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పునః పంపిణీకి నిర్ణయం
- ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలని బచావత్–2 ట్రిబ్యునల్‌కు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు సంబంధించి మూడు కీలక అంశాలపై బుధవారం కేంద్ర కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో జాతీయ పసుపు బోర్డు, సమ్మక్క–సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. సమ్మక్క సారక్క వర్సిటీకి రూ. 889.07 కోట్లు నిధులు కేటాయించింది. ఇక తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలను పునః పంపిణీ చేయాలని, ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించాలని కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ (బ్రిజేశ్) ట్రిబ్యునల్–2ను కేబినెట్ ఆదేశించింది. ఎంతోకాలం నుంచి కొనసాగుతున్న జల వివాదాలకు ఇది ఒక పరిష్కారం చూపే అవకాశం ఉంది. తెలంగాణలో వారం రోజుల్లో ప్రధాని వరుసగా రెండోసారి పర్యటించిన మరునాడే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం. భేటీ అనంతరం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అనురాగ్‌సింగ్ ఠాకూర్, ఎల్.మురుగన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీకి రూ.889.07 కోట్లు

ఏపీ పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర విశ్వవిద్యాలయాలు చట్టం –2009ను సవరిస్తూ పార్లమెంటులో కేంద్ర విశ్వవిద్యాలయాలు (సవరణ) బిల్లు–2023ను ప్రవేశపెట్టాలని తీర్మానించింది. గిరిజన యూని వర్సిటీ కోసం కేంద్రం రూ.889.07 కోట్లు నిధు లు కేటాయించింది. ఈ వర్సిటీ రాష్ట్రంలో విద్యా భివృద్ధి, నాణ్యతను మెరుగుపర్చడం తోపాటు గిరిజనుల ప్రయోజనాలు, గిరిజన కళలు, సంస్కృతి, సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థ బోధన, పరిశోధనలను అందిస్తుందని.. ఉన్నత విద్య, ఆధునిక విజ్ఞానానికి సంబంధించిన మార్గాలను ప్రోత్సహిస్తుందని తెలిపింది. ప్రాంతీయ అసమతుల్యతను తొలగించడానికి తోడ్పడుతుందని వెల్లడించింది.

దేశీయంగా పసుపు పంట, పసుపు ఉత్పత్తుల అభివృద్ధి కోసం జాతీయ పసుపు బోర్డును తెలంగాణలో ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. పసుపు వినియోగం పెంచడానికి, అంతర్జాతీయంగా మార్కెట్ అభివృద్ధికి ఈ చర్య తోడ్పడుతుందని తెలిపింది. దేశంలో 2022–23లో 3.24 లక్షల హెక్టార్లలో పసుపు సాగు చేయగా.. 11.61 లక్షల టన్నులు ఉత్పత్తి అయిందని తెలిపింది. బంగ్లాదేశ్, యూఏఈ, అమెరికా,

భారీ ఎగుమతులే లక్ష్యంగా..

మలేసియాల్లో భారత పసుపునకు డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొంది. జాతీయ పసుపు బోర్డుతో 2030 నాటికల్లా రూ.8,400 కోట్ల (బిలియన్ డాలర్ల) విలువైన పసుపు ఎగుమతులను సాధించాలన్నది లక్ష్యమని వెల్లడించింది. ఈ బోర్డుకు చైర్మన్‌ను కేంద్రం నియమిస్తుంది. ఆయుష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, వాణిజ్య, పరిశ్రమల శాఖల నుంచి రొటేషన్ పద్ధతిలో రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, పరిశోధనల్లో భాగస్వామయ్యే సంస్థలు, పసుపు రైతులు, ఎగుమతిదారుల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. బోర్డుకు కార్యదర్శిని కేంద్ర వాణిజ్య శాఖ నియమిస్తుంది.

‘కృష్ణా’ పంపకాల బాధ్యత.. బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే

- సుప్రీంలో తెలంగాణ కేసు విత్‌డ్రా చేసుకున్న నేపథ్యంలో కేంద్రం స్పందన
- న్యాయ శాఖ సలహాలు తీసుకున్నాకే అడుగు ముందుకు..
- పదేళ్లుగా కొనసాగుతున్న సమస్య తీరిపోతుందనే ఆశాభావం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్‌రాష్ట్ర నదీ జల వివాదాల పరిష్కార చట్టం–1956లోని సెక్షన్ 5 (1) కింద ఇప్పటికే కొనసాగుతున్న బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే.. వివాదాల పరిష్కార బాధ్యతలను కూడా కట్టబెడుతున్నట్టు కేంద్ర కేబినెట్ ప్రకటించింది. ఇందుకు సంబంధించి బ్రిజేశ్ ట్రిబ్యునల్ అనుసరించాల్సిన విధివిధానాలను (టెరమ్స్ ఆఫ్ రిఫరెన్స్/టీఓఆర్) ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భేటీ అయిన కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఏపీ, తెలంగాణల మధ్య కృష్ణా జలాలను పునః పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే చేసిన విజ్ఞప్తిని కేంద్రం పరిశీలించింది. దీనిపై న్యాయశాఖ సలహా మేరకు తాజా నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీ, వినియోగం, నియంత్రణపై ట్రిబ్యునల్ తీసుకునే నిర్ణయాలు.. ఇరు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడతాయని, ఇరు రాష్ట్రాల ప్రజలు లబ్ధి పొందుతారని తెలిపింది. ఈ నిర్ణయం పటిష్ట భారతదేశ నిర్మాణానికి మార్గం సుగమం చేస్తుందని పేర్కొంది.

కృష్ణా జల వివాదాలు, పరిణామాలు ఇలా..

- **1969 ఏప్రిల్ 10న** మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీ ప్రభుత్వాల ప్రతిపాదన మేరకు జస్టిస్ బచావత్ నేతృత్వంలో కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–1 ఏర్పాటైంది.
- **1976 మే 27న:** కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలను కేటాయిస్తూ బచావత్ ట్రిబ్యునల్ తుది నివేదిక (ఫైనల్ అవార్డు) ఇచ్చింది.
- **1976 మే 31:** బచావత్ అవార్డును అమలు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 25 ఏళ్ల వరకూ అవార్డును పునః సమీక్షించాలంటూ కోరవద్దని షరతు పెట్టింది.
- **2004 ఏప్రిల్ 2:** బచావత్ అవార్డు కాల పరిధి ముగియడంతో కృష్ణా జలాలను సెక్షన్–3 కింద పునఃపంపిణీ చేయాలని మూడు రాష్ట్రాలు కోరడంతో జస్టిస్ బ్రిజేశ్ కుమార్ అధ్యక్షతన కేడబ్ల్యూడీటీ–2ను ఏర్పాటు చేసిన కేంద్రం
- **2010 డిసెంబర్ 30:** మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీలకు కృష్ణా జలాలను పంపిణీ చేస్తూ బ్రిజేశ్ ట్రిబ్యునల్ కేంద్రానికి ప్రాథమిక నివేదిక ఇచ్చింది.
- **2013 నవంబర్ 29:** మూడు రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని కృష్ణా జలాలను పంపిణీ చేస్తూ సెక్షన్–5(3) కింద బ్రిజేశ్ ట్రిబ్యునల్ తుది నివేదికను కేంద్రానికి ఇచ్చింది. (ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటకలో సుప్రీం కోర్టులో సవాల్ చేయడంతో దాన్ని కేంద్రం అమల్లోకి తేలేదు)
- **2014 మార్చి 1:** ఉమ్మడి ఏపీని విభజిస్తూ చట్టాన్ని ఆమోదించిన కేంద్రం. ఆ చట్టంలో సెక్షన్–89 ప్రకారం ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటినే తెలంగాణ, ఏపీల మధ్య పంపిణీ చేసే బాధ్యతను ట్రిబ్యునల్‌కు అప్పగించాలని నిర్ణయం.
- **2014 మే 15:** బ్రిజేశ్ ట్రిబ్యుల్ తుది నివేదికలో ఉమ్మడి ఏపీకి కేటాయించిన జలాలను.. తెలంగాణ, ఏపీలకు పంపిణీ చేసే బాధ్యతను అదే ట్రిబ్యునల్‌కు అప్పగించిన కేంద్రం.
- **2016 అక్టోబర్ 19:** మొత్తం కృష్ణా పరీవాహక ప్రాంతం పరిధిలోని మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కృష్ణా జలాలను పునః పంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణ ట్రిబ్యునల్‌ను కోరాయి. దీనిపై వాదనలు విన్న ట్రిబ్యునల్ ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపిణీకే పరిమితం అవుతామంటూ ఉత్తర్వులిచ్చింది.
- **2020 అక్టోబర్ 6:** అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో సెక్షన్–3 ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి షెకావత్‌ను తెలంగాణ సీఎం కేసీఆర్ కోరారు. దీనితో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఎస్సెల్పీని ఉపసంహరించుకుని ప్రతిపాదన పంపాలని.. న్యాయ సలహా తీసుకుని, తుది నిర్ణయానికి వస్తామని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి స్పష్టం చేశారు.
- **2021, అక్టోబర్ 6:** కృష్ణా జలాలను సెక్షన్–3 కింద పునఃపంపిణీ చేయాలంటూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఎస్సెల్పీని తెలంగాణ సర్కారు వెనక్కి తీసుకుంది.
- **2023, అక్టోబర్ 4:** తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీకి కొత్త విధి విధానాలను రూపొందిస్తూ కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

జల వివాదం మళ్లీ మొదటికి?

- సమూలంగా పునః కేటాయింపులు చేస్తారా? మిగులు జలాల పంపిణీకి మాత్రమేనా? అని నిపుణుల సందేహాలు

సాక్షి, హైదరాబాద్: అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డీఏ)–1956 కింద ఏర్పాటైన జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కే.. కృష్ణా జలాల పంపిణీ బాధ్యతను కేంద్రం అప్పగించడంపై జల వనరుల నిపుణులు పెదవి విరుస్తున్నారు. తెలంగాణ, ఏపీల మధ్య కృష్ణా జలాల పంపిణీ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చినట్టేనని చెప్తున్నారు. విభజన చట్టంలో సెక్షన్–89 ప్రకారం.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీలకు పంపిణీ చేయడంపై 2016 అక్టోబర్ నుంచీ బ్రిజేశ్ ట్రిబ్యునల్ చేస్తున్న విచారణ తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో వృథా ప్రయాసగా మారిపోయినట్టేనని అంటున్నారు.

సమూలంగా కేటాయింపులు చేస్తారా?

జల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జల వివాదాలను పరిష్కరించాలంటూ తెలంగాణ చేసిన ఫిర్యాదును బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు అప్పగించాలని తాజాగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నికర జలాలను కేటాయిస్తూ 1976 మేలో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తుది అవార్డును పునః సమీక్షించాల్సి ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం అంటోంది. అయితే జల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–6 (2) ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు సుప్రీం తీర్పుతో సమానం. దాన్ని పునఃసమీక్షించడం చట్టవిరుద్ధమని ఏపీ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు జారీచేసిన విధివిధానాలు బయటికొస్తేనే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు.

మిగుల జలాల పంపిణీ మాత్రమేనా?

బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన నికర జలాల కేటాయింపుల ఆధారంగా.. ఏపీ 512.04 టీఎంసీలు, తెలంగాణ 298.96 టీఎంసీలు వాడుకోవాలంటూ 2015 జూలైలో కేంద్ర జలశక్తి శాఖ సమక్షంలో తాత్కాలిక సర్దుబాటుపై తెలంగాణ, ఏపీ సంతకాలు చేశాయి. తర్వాత బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ క్రమంలో.. బచావత్ ట్రిబ్యునల్ చేసిన నికర జలాల కేటాయింపుల జోలికి వెళ్లబోమని పేర్కొంది. కృష్ణాలో 65% లభ్యత ఆధారంగా మిగులు జలాల్లో 194 టీఎంసీలను ఉమ్మడి ఏపీకి అదనంగా కేటాయించింది. ఈ 194 టీఎంసీలను తెలంగాణ, ఏపీ మధ్య పంపిణీ చేయడానికే బ్రిజేశ్ ట్రిబ్యునల్ పరిమితం అవుతుందా? అనే సందేహాలు వస్తున్నాయి.

బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1) కేటాయింపులివీ (75శాతం లభ్యత ఆధారంగా)..

రాష్ట్రం	కేటాయింపులు (టీఎంసీల్లో)
మహారాష్ట్ర	585
కర్ణాటక	734
ఉమ్మడి ఏపీ	811
మొత్తం	2,130

బ్రిజేశ్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) కేటాయింపులివీ..

రాష్ట్రం	75శాతం లభ్యత	65శాతం లభ్యతతో మిగులు	మొత్తం
మహారాష్ట్ర	585	81	666
కర్ణాటక	734	173	907
ఉమ్మడి ఏపీ	811	194	1,005
మొత్తం	2,130	448	2,578

తెలంగాణకు గొప్ప విజయమిది

కృష్ణా జలాల పునః పంపిణీ నిర్ణయంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాల పునః పంపిణీ వ్యవహారాన్ని జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం తెలంగాణకు గొప్ప విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ పేర్కొంది. సీఎం కేసీఆర్ పట్టుబట్టి దీనిని సాధించారని.. కేంద్రం నిర్ణయానికి రావడానికి 9 ఏళ్లు ఆలస్యం జరిగిందని తెలిపింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటూ తెలంగాణ ఏర్పడిన నెల రోజులకే సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారని గుర్తు చేసింది. కానీ కేంద్రం దానికి బదులు విభజన చట్టంలోని సెక్షన్–89 ప్రకారం విచారణకు ఆదేశించిందని తెలిపింది. దానితో తెలంగాణకు న్యాయమైన వాటా లభించే అవకాశం లేకపోవడంతో.. సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటూ కేసీఆర్ ఒత్తిడి తెస్తూనే వచ్చారని వివరించింది. కేసీఆర్ ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం తాజా నిర్ణయం తీసుకుందని పేర్కొంది. ఇప్పటికే చాలా జాప్యం జరిగినందున ఏడాది, రెండేళ్ల నిర్దిష్ట కాలపరిమితిలో ట్రిబ్యునల్ నివేదిక వచ్చేలా చూడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

సోలార్‌పవర్‌తో 'హైడ్రోజన్'

- ఇప్పటివరకు థర్మల్ పవర్‌తోనే 'హైడ్రోజన్' ఉత్పత్తి
- 'గ్రీన్' హైడ్రోజన్ సాధ్యాసాధ్యాలపై నివేదికకు ఆదేశాలు
- అమల్లోకి వస్తే దేశంలోనే తొలి సంస్థగా సింగరేణికి గుర్తింపు



జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం /గోదావరిఖని: ఇప్పటికే సోలార్ విద్యుత్ రంగంలోకి అడుగిడిన 'సింగరేణి' మరో భారీ పర్యావరణహిత కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. సంస్థ నిర్వహణలో ఉన్న హైడ్రోజన్ ప్లాంట్‌ను గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌గా మార్చేందుకు సిద్ధమైంది. దీనిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని సింగరేణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) ఎస్.శ్రీధర్ సంస్థకు చెందిన విద్యుత్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో తాజాగా జరిగిన ఈ సమావేశంలో దీనిపై చర్చించారు.

హైడ్రోజన్ అవసరం

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వాడే జనరేటర్లలోని వేడిని తగ్గించేందుకు శీతలీకరణ ధాతువుగా హైడ్రోజన్‌ను వినియోగిస్తున్నారు. ఇందుకు ప్లాంట్ ఆవరణలోనే ఒక హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తారు. మంచిర్యాల జిల్లాలోని జైపూర్ వద్ద 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఉంది. ఈ ప్లాంట్‌లో ఉన్న హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం ఏటా దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్ల హైడ్రోజన్ వాయువును ఉత్పత్తి చేస్తోంది.

గ్రీన్ హైడ్రోజన్

సాధారణంగా థర్మల్ విద్యుత్ వినియోగించి ఎలక్ట్రాలసిస్ రసాయనిక పద్ధతిలో హైడ్రోజన్ వాయువు ఉత్పత్తి చేస్తారు. అయితే థర్మల్ విద్యుత్‌కు బదులు సోలార్ విద్యుత్ వినియోగించి హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఇలా ఉత్పత్తి చేసే హైడ్రోజన్‌ను 'గ్రీన్ హైడ్రోజన్'గా పేర్కొంటారు. సింగరేణి పవర్ ప్లాంట్‌లో హైడ్రోజన్ ఉత్పత్తి కోసం 100 కిలోవాట్ థర్మల్ విద్యుత్‌ను వినియోగిస్తుండగా, రాబోయే రోజుల్లో థర్మల్ బదులుగా సోలార్ విద్యుత్ ఉపయోగిస్తారు.

జైపూర్‌లోనే...

జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోనే ప్రస్తుతం 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం, ఐదు మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఉన్నాయి. అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ నేరుగా హైడ్రోజన్ ప్లాంట్‌కు అనుసంధానం చేస్తారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రామగుండం రీజియన్‌లోనే మరో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చైర్మన్ సూచించారు. సోలార్ పవర్ ద్వారా హైడ్రోజన్ ఉత్పత్తి మొదలైతే దేశంలోనే గ్రీన్ హైడ్రోజన్ వినియోగిస్తున్న తొలి థర్మల్ విద్యుత్ కేంద్రంగా సింగరేణి నిలుస్తుంది.

జియోపై దృష్టి

వేడినీటి ఊట ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా సింగరేణి ప్రయోగాత్మకంగా జియో థర్మల్ ప్రాజెక్ట్ చేపట్టింది. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద మూడేళ్ల నుంచి పరిశోధనలు జరుగుతున్నాయి. దీంతో పాటు సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్ లోనే మిథనాల్ ప్రాజెక్ట్‌పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. త్వరలోనే ఈ రెండు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాలని సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో సింగరేణిలోని సోలార్ ప్లాంట్ల ద్వారా 170 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామని, తద్వారా ట్రాన్స్‌కో‌కు చెల్లించే విద్యుత్ బిల్లులో రూ.108 కోట్లు ఆదా చేసుకోగలిగామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డైరెక్టర్ డి.సత్యనారాయణరావు, సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, చీఫ్ ఓఅండ్ఎం జే.ఎన్.సింగ్, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జనరల్ మేనేజర్ చినబసివి రెడ్డి, జనరల్ మేనేజర్(సోలార్) జానకీరాం, చీఫ్ ఆఫ్ పవర్ ఎన్‌వీకేవీ.రాజు, జీఎం సూర్యనారాయణ, ఏజీఎంలు కేఎస్ఎన్.ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు

కాంగ్రెస్, లెఫ్ట్ పొత్తుకు గ్రీన్ సిగ్నల్

ఢిల్లీ స్థాయిలో అంగీకారానికి వచ్చిన కాంగ్రెస్, లెఫ్ట్ జాతీయ నేతలు

- పొత్తుకు అన్ని విధాలుగా సన్నద్ధత... పోటీ చేసే సీట్లపైనే అస్పష్టత
- సీపీఐ, సీపీఎంలకు చెరో రెండు ఎమ్మెల్యే స్థానాలు... చెరో ఎమ్మెల్సీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సీపీఐ, సీపీఎంలతో కాంగ్రెస్ పొత్తుకు ఆయా పార్టీల జాతీయ అగ్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ భేటీ అయినట్లు తెలంగాణ లెఫ్ట్ నేతలు వెల్లడించారు. మూడు జాతీయ పార్టీల అగ్రనేతలు తెలంగాణలో పొత్తుకు పూర్తి స్థాయిలో ఆమోదం తెలిపారు. పొత్తుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా పార్టీల రాష్ట్ర నేతలకు అగ్ర నాయకత్వాలు సూచించాయి. దీంతో ఇప్పటి వరకు సందిగ్ధంగా ఉన్న కాంగ్రెస్, లెఫ్ట్ పొత్తు వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినట్లయిందని అంటున్నారు.

పొత్తుపై స్పష్టత.. సీట్లపైనే అస్పష్టత

సీపీఐ, సీపీఎంలు చెరో ఐదు అసెంబ్లీ సీట్లు అడుగుతున్నాయి. అయితే లెఫ్ట్ పార్టీలు అడుగుతున్న స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండటం, వాటిల్లో పార్టీకి చెందిన ప్రముఖులు పోటీ చేసే పరిస్థితులు ఉండటంతో పొత్తు వ్యవహారం సంక్లిష్టంగా మారింది. సీపీఐ కొత్తగూడెం, వైరా, హుస్నాబాద్, బెల్లంపల్లి, మునుగోడు స్థానాలు కోరుతుండగా, సీపీఎం పాలేరు, భద్రాచలం, మధిర, ఇబ్రహీంపట్నం, మిర్యాలగూడ స్థానాలను కోరింది. రాష్ట్రంలో మొత్తం పది స్థానాలు కోరుతున్న కమ్యూనిస్టులు, ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఐదు అసెంబ్లీ స్థానాలను కోరడం విశేషం. ఈ విషయమే కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారింది. తమకు కంచుకోట, బలమైన అభ్యర్థులు, పార్టీలో ఆయా స్థానాలపై పోటీ ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదు సీట్లు ఇవ్వడం సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులకు స్పష్టం చేసింది. అయితే చెరి మూడు స్థానాలైనా ఇవ్వాలని కమ్యూనిస్టులు కోరే అవకాశముంది. అయినా కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు మూడు సీట్లు ఇవ్వడం కూడా కష్టంగానే మారినట్లు చెబుతున్నారు.

జాబితాకు ముందే నిర్ణయం...

కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించడానికి ముందే కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశముంది. ఆ మేరకు వేచి చూడాలని సీపీఐ, సీపీఎంలు భావిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ వర్గాలు మాత్రం కమ్యూనిస్టులు అడుగుతున్న స్థానాలపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఆయా స్థానాల్లోని కాంగ్రెస్ ఆశావహుల నుంచి ఎలాంటి ప్రతిస్పందన వస్తుందోనన్న ఆందోళన ఉంది. దీంతో జిల్లాల వారీగా కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ సీట్ల కేటాయింపులు చేసే అవకాశముంది.

చెరో రెండు ఎమ్మెల్యే స్థానాలు... చెరో ఎమ్మెల్సీ

మొత్తంగా చెరో రెండు అసెంబ్లీ స్థానాలు, తర్వాత చెరో ఎమ్మెల్సీ ఇచ్చే విధంగా లెఫ్ట్ పార్టీలకు ప్రతిపాదించాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీనికి కమ్యూనిస్టులు సుముఖంగా ఉంటాయా లేదా చూడాల్సి ఉంది. ఏదిఏమైనా బీజేపీని అడ్డుకోవడం, బీఆర్ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌తోనే కలిసి వెళ్లాలని సీపీఐ, సీపీఎంలు నిర్ణయించాయి. పైగా జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రధాన భూమికి పోషిస్తున్నందున పొత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా ముందుకు సాగాలని నిర్ణయించాయి.

గిరిజనుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకే..

- ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- పసుపు బోర్డుతో రాష్ట్ర రైతుల కల నెరవేరుతుందని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ములుగులో ఏర్పాటు చేసే సమ్మక్క–సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని.. వారిలో అక్షరాస్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతుల ఏళ్లనాటి కల నెరవేరనుందని చెప్పారు. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపకాలపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జలాల వివాదాలు పరిష్కారమై, తెలంగాణ ప్రజలు న్యాయపరమైన వాటా అందుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర కేబినెట్ సమావేశం అనంతరం అక్కడి తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ జనాభాలో 9.08 శాతం మంది గిరిజనులు ఉన్నారని, వారిలో అక్షరాస్యత 49.51 శాతమేనని, గిరిజన మహిళల్లో అయితే 39.5 శాతమే ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారిలో అక్షరాస్యతను, తద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి గిరిజన వర్సిటీ తోడ్పడుతుందన్నారు. దీనిని రూ.889.07 కోట్లతో రెండు దశల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. గిరిజన ఆచారాల కేంద్రిత విద్యను, పరిశోధనను ప్రోత్సహించడంతోపాటు కళలు, మూలికలు, అటవీ ఆధారిత ఆర్థిక కార్యకలాపాలు, గిరిజన సంస్కృతిపై ఈ వర్సిటీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందన్నారు. కృష్ణా జల పంపకాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వంసు ప్రీం కోర్టులో కేసును వెనక్కి తీసుకోవడంలో ఆలస్యం చేసిందని, కేసీఆర్ ఏడాది పాటు సమయం వృథా చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర నిర్ణయంతో తెలంగాణ ప్రజలకు న్యాయపరమైన వాటా అందే వీలుంటుందన్నారు.

కమలం అసంతృప్తులకు కాంగ్రెస్ గాలం!

▶ మొదటి పేజీ తరువాయి

వేణుగోపాల్ రంగంలోకి దిగారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ఈ జాబితాలో మాజీ ఎంపీలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డితో సహా దాదాపు 20 మంది నాయకులున్నారని చెబుతున్నాయి. జిట్టా బాలకృష్ణారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి లాంటి కొందరు నేతలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా, బీజేపీ కుంభస్థలాన్ని కొట్టామనే భావన కలిగించే స్థాయి నేతలను సైతం పార్టీలోకి రప్పించేందుకు కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వారం పది రోజుల్లోనే ఫలితం కనబడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే మాజీ ఎంపీలు జి.వివేక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాత్రం తాము పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. మిగతా నేతల గురించి తమకు తెలియదన్నారు. కానీ ప్రధాని మోదీ పాలమూరు, నిజామాబాద్ సభలకు అసంతృప్త నేతలు పలువురు హాజరు కాకపోవడం అనుమానాలకు తావిస్తోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

మోదీ సభలకు వెళ్లలేదెందుకో?

బీజేపీ అసమ్మతి నేతల వ్యవహారశైలిపై రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. వీరంతా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధమైందనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని ఎవరూ గట్టిగా ఖండించలేదనే చెప్పాలి. పైగా సదరు నేతలంతా ఇటీవల హైదరాబాద్ శివార్లలో ప్రత్యేకంగా ఫామ్‌హౌస్, డిన్నర్ మీటింగ్‌లు పెట్టుకున్నారు. కానీ ఈనెల 1, 3 తేదీల్లో జరిగిన మోదీ బహిరంగ సభలకు మాత్రం.. ఆ మీటింగ్‌లకు వెళ్లిన నేతల్లో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు హాజరుగాక పోవడం వెనుక ఆంతర్యమేంటనే చర్చ జరుగుతోంది.

తర్జనభర్జన!

కాంగ్రెస్ వైపు నుంచి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఆ పార్టీలోకి వెళ్లాలా? లేక బీజేపీలోనే ఉండాలా? అన్నదానిపై అసంతృప్త నేతలు తర్జనభర్జన పడుతుండటమే వారో స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడానికి కారణంగా తెలుస్తోంది. బీజేపీ అసమ్మతి నేతల్లోని కీలక నేత ప్రధాన అనుచరుడు ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'మేం బీజేపీలో ఇమడలేకపోతున్నాం. వాస్తవానికి రజాకార్లతో కొట్లాట నుంచి కమ్యూనిస్టులతో పోట్లాట వరకు తరతరాలుగా కాంగ్రెస్‌తోనే ఉన్నాం. మా నాయకుడు బీజేపీలోకి వెళ్లాడు కాబట్టి మేం కూడా వెళ్లాం. కానీ మాలో చాలా మంది మళ్లీ కాంగ్రెస్‌లోకి వెళ్లాలని అంటున్నారు. మా నాయకుడు కూడా అదే ఆలోచనలో ఉన్నారు. కానీ తరచూ పార్టీలు మారడమే ఇబ్బందిగా ఉంది'' అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే పార్టీ మారినా ప్రయోజనం ఉంటుందని, అలా కాకుంటే పరిస్థితి ఏంటనే దానిపై మా నాయకుడు మల్లగుల్లాలు పడుతున్నారని పేర్కొంటున్నారు. మిగతావారు కూడా ఇదే ఆలోచనతో ఉన్నారని.. వారం, పది రోజుల్లో ఏదో ఒకటి తేలిపోతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆపరేషన్‌పై ఆ పార్టీ కీలక నేత ఒకరు మాట్లాడుతూ.. 'ఢిల్లీ పెద్దలు చాలామందితో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్‌ను వదిలివెళ్లిన వారిని మళ్లీ రమ్మని కోరుతున్నారు. రాజగోపాల్‌తో పాటు చాలామంది బీజేపీ అసమ్మతి నేతలతో వేణుగోపాల్ మాట్లాడుతున్నారన్నది వాస్తవం..' అని చెప్పడం గమనార్హం.

మోదీని ఎయిర్‌పోర్టులో కలిశా: వివేక్

బీజేపీ అసంతృప్త నేతలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందనే చర్చ నేపథ్యంలో వారిలో కొందరి స్పందన తెలుసుకునేందుకు 'సాక్షి' ప్రయత్నించింది. తాను బీఆర్ఎస్‌లో చేరబోతున్నట్టు కొన్ని రోజులు ప్రచారం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరుతున్నట్టుగా చెబుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. తాను పార్టీ మారబోవడం లేదని చెప్పారు. తాను స్పష్టత ఇస్తున్నా మళ్లీ మళ్లీ అదే ప్రచారం చేస్తుండడంతో.. ఇక అలాంటి వార్తలను ఖండించడం కూడా వృధా అని వదిలేశానని చెప్పారు. ఇటీవల తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలిశానని, మంగళవారం నిజామాబాద్ సభ అప్పుడు మాత్రం తమ అంబేడ్కర్ కాలేజీ 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముఖ్యఅతిథి ఖరారు కోసం ఢిల్లీలో ఉన్నానని తెలిపారు. తనకు పార్టీ మారే ఉద్దేశం లేదని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అంత బలంగా ఉంటే తమను చేర్చుకునేందుకు ఎందుకు అంత ఉత్సాహం చూపుతోందని ప్రశ్నించారు. బీజేపీ నేతలను చేర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నామంటూ ప్రచారం చేసుకోవడం ద్వారా తమ బలహీనతలను కాంగ్రెస్ నేతలు బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. విజయశాంతి, ఏనుగు రవీందర్‌రెడ్డిలను ఫోన్లో సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా వారు స్పందించలేదు.



వందే వన్డే క్రికెట్

నేటి నుంచి ప్రపంచకప్

తొలి పోరులో ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ 'ఢీ' ● ఆదివారం ఆస్ట్రేలియాతో భారత్ మ్యాచ్ ● నవంబర్ 19న ఫైనల్

ఒక్కరోజు చాలు... చరిత్ర మారిపోవడానికి... రికార్డులు బద్దలు కావడానికి... ఒక్కరోజు చాలు... అనామకులు అసాధ్యులుగా మారి అద్భుతాలు చేయడానికి... ఒక్కరోజు చాలు... హీరోలుగా కీర్తించబడినవారు జీరోలుగా మారిపోవడానికి... అభిమానులకు అంతులేని ఆనందం పంచేందుకు, ఎప్పటికీ మరచి పోలేని విషాదం మిగిల్చేందుకు కూడా ఆ ఒక్కరోజు చాలు... యాభై రెండేళ్ల క్రితం బుడిబుడి అడుగులు వేసిన ఒక్కరోజు ఆట 4657 సమరాల తర్వాత కాస్త అలసటకు లోనైనట్లుగా కనిపిస్తోంది. తనకంటే 146 ఏళ్ల క్రితం పుట్టిన ఆట తన పెద్దరికపు హోదాను నిలబె ట్టుకుంటూ ఇంకా సజీవంగా సాగిపోతుంటే... తనకంటే 34 ఏళ్లు చిన్నదైన ఆట కూడా రోజురోజుకీ ఎదిగిపోతూ ధూమ్‌ధామ్‌గా వెలిగిపోతుంటే ఒక్కరోజు ఆటకే కొంత కాలంగా చిక్కొచ్చి పడింది. ఇప్పుడు దానికి కొత్త ఊపిరి కావాలి... వినోదాన్ని అందించడంలో నేనూ ఎక్కడా వెనుకబడిపోను అన్నట్లుగా ఒక ఊపు రావాలి... అందుకే సరైన సమయం, వేదిక కావాలి. అలాంటి సమయం వచ్చేసింది... వన్డే క్రికెట్ గొప్పతనాన్ని చూపించేందుకు, ఈ ఫార్మాట్ ముద్ర చూపించేందుకు ప్రపంచకప్‌కంటే సరైన వేదిక లేదు... అవును, ఇట్ టేక్స్ వన్ డే!

నరాలు తెగే ఉత్కంఠతో ఫలితాన్ని అందించిన గత ప్రపంచకప్ తుది సమరం గుర్తుందా? నాలుగేళ్ల క్రితం నాటి ఆ జ్ఞాపకాలను క్రికెట్ అభిమానులు అంత సులువుగా మరచిపోలేరు. ఆపై రెండు పొట్టి ప్రపంచ కప్‌లు, రెండు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సమరాల తర్వాత నేనున్నానంటూ మళ్లీ వన్డే విశ్వక్రీడా సంబరం వచ్చేసింది... ఈ నాలుగేళ్ల వ్యవధిలో జట్లు మారాయి, ఆటగాళ్లు మారారు, నిబంధనలూ మారాయి... కానీ విశ్వవ్యాప్తంగా అభిమానుల ఆశలు, అంచనాలు మాత్రం మారలేదు. మరోసారి వారి వినోదానికి భరోసానిస్తూ, గత పన్నెండు మెగా టోర్నీలకు ఏమాత్రం తగ్గకుండా ఈ వరల్డ్‌కప్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. పుష్కర కాలం తర్వాత ఆతిథ్యమిస్తున్న భారత్ సొంతగడ్డపై 12 ఏళ్ల క్రితం నాటి ప్రదర్శనను పునరావృతం చేసే లక్ష్యంతో అమితోత్సాహంతో సిద్ధమైంది. ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా ఖాతాలో ఆరో టైటిల్ చేరుతుందా? ఇంగ్లండ్ తమ జోరును ఇక్కడా నిలబెట్టుకుంటుందా? మూడు దశాబ్దాలుగా దక్కని ద్రాక్ష పాక్‌కు అందుతుందా అనేది ఆసక్తికరం. ఎప్పటిలాగే కివీస్, దక్షిణాఫ్రికా తొలి టైటిల్ ఆశలు నిజమవుతాయా లేక ఇతర సంచలనాలు ఉంటాయా అనేది 46 రోజులు చర్చనీయాంశమే!

అహ్మదాబాద్: ఐసీసీ 13వ వన్డే వరల్డ్ కప్ సమరానికి సమయం వచ్చేసింది. గత టోర్నీ ఫైనలిస్ట్‌లు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య నేడు అహ్మదాబాద్‌లో జరిగే తొలి పోరుతో ప్రపంచ కప్ ప్రారంభమవుతుంది. నవంబర్ 19న ఇదే అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. ఈ క్రమంలో 48 లీగ్ మ్యాచ్‌లు, రెండు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ జరుగుతాయి. 2011 తర్వాత భారత్ మరోసారి వరల్డ్ కప్‌కు ఆతిథ్యం ఇస్తోంది. గత రెండు టోర్నీల్లో సెమీస్ చేరిన టీమిండియా స్వదేశంలో ఈసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. గత టోర్నీ ఫార్మాట్ తరహాలోనే బరిలో 10 జట్లు నిలిచాయి. ప్రతీ టీమ్ ఇతర తొమ్మిది జట్లతో తలపడుతుంది. గ్రూప్ దశలో అత్యధిక పాయింట్లు సాధించిన టాప్–4 టీమ్‌లు సెమీఫైనల్ చేరతాయి. వరల్డ్ కప్ తొలి రెండు టోర్నీల్లో జగజ్జేతగా నిలిచి సుదీర్ఘ కాలం క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్ లేకుండా జరుగుతున్న తొలి వరల్డ్ కప్ ఇదే. ఈసారి ర్యాంకింగ్ ద్వారా ఎనిమిది జట్లు నేరుగా అర్హత సాధించగా... క్వాలిఫయింగ్ టోర్నీ ఆడి మాజీ విజేత శ్రీలంక, నెదర్లాండ్స్ అవకాశం దక్కించుకున్నాయి.

10 మ్యాచ్‌లు జరిగే వేదికల సంఖ్య. అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, ధర్మశాల, పుణే, హైదరాబాద్ వేదికలుగా మ్యాచ్‌లు జరుగుతాయి. సెమీస్ మ్యాచ్‌లకు కోల్‌కతా, ముంబై వేదిక కానుండగా, ఫైనల్ అహ్మదాబాద్‌లో జరుగుతుంది. వీటిలో ఒక్క హైదరాబాద్‌లో మినహా మిగతా 9 వేదికల్లో భారత్ తమ మ్యాచ్‌లు ఆడుతుంది.

1 భారత్ తొలిసారి ఈ టోర్నీని పూర్తిస్థాయిలో నిర్వహిస్తోంది. 1987లో పాక్‌తో, 1996లో పాక్, శ్రీలంకలతో, 2011లో శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో కలిసి సంయుక్తంగా ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇచ్చింది.

రూ. **83** కోట్లు టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ. ఇందులో విజేతకు రూ. 33 కోట్లు, రన్నరప్‌కు రూ.16.50 కోట్లు అందిస్తారు.

1 గత వరల్డ్‌కప్‌లోనూ, ఈసారి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఏకైక ఆటగాడు కేన్ విలియమ్సన్. మిగతా అన్ని జట్లకూ సారథులు మారారు.

51 టోర్నీలో మొత్తం మ్యాచ్‌ల సంఖ్య.

ఇంగ్లండ్ X న్యూజిలాండ్

2019 ఫైనలిస్ట్‌ల మధ్య టోర్నీ తొలి మ్యాచ్ జరుగుతుంది. 1996లో భారత్ ఆతిథ్యమిచ్చిన వరల్డ్ కప్‌లోనూ ఈ రెండు జట్ల మధ్యే ఇదే అహ్మదాబాద్‌లో టోర్నీ తొలి మ్యాచ్ జరిగింది.

గత విజేతలు

ఆస్ట్రేలియా (5 సార్లు; 1987, 1999, 2003, 2007, 2015). భారత్ (2 సార్లు; 1983, 2011). వెస్టిండీస్ (2 సార్లు; 1975, 1979). పాకిస్తాన్ (1992). శ్రీలంక (1996). ఇంగ్లండ్ (2019).

వన్డే ప్రపంచకప్-2023 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
అక్టోబర్ 5	ఇంగ్లండ్ x న్యూజిలాండ్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 6	పాకిస్తాన్ x నెదర్లాండ్స్	హైదరాబాద్	మ.గం.2 నుంచి
అక్టోబర్ 7	బంగ్లాదేశ్ x అఫ్గానిస్తాన్	ధర్మశాల	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 7	దక్షిణాఫ్రికా x శ్రీలంక	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 8	భారత్ x ఆస్ట్రేలియా	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 9	న్యూజిలాండ్ x నెదర్లాండ్స్	హైదరాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 10	ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	ధర్మశాల	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 10	పాకిస్తాన్ x శ్రీలంక	హైదరాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 11	భారత్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 12	ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	లక్నో	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 13	న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 14	భారత్ x పాకిస్తాన్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 15	ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 16	ఆస్ట్రేలియా x శ్రీలంక	లక్నో	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 17	దక్షిణాఫ్రికా x నెదర్లాండ్స్	ధర్మశాల	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 18	న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 19	భారత్ x బంగ్లాదేశ్	పుణే	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 20	ఆస్ట్రేలియా x పాకిస్తాన్	బెంగళూరు	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 21	నెదర్లాండ్స్ x శ్రీలంక	లక్నో	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 21	ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	ముంబై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 22	భారత్ x న్యూజిలాండ్	ధర్మశాల	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 23	పాకిస్తాన్ x అఫ్గానిస్తాన్	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 24	దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్	ముంబై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 25	ఆస్ట్రేలియా x నెదర్లాండ్స్	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 26	ఇంగ్లండ్ x శ్రీలంక	బెంగళూరు	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 27	పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 28	ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	ధర్మశాల	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 28	నెదర్లాండ్స్ x బంగ్లాదేశ్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 29	భారత్ x ఇంగ్లండ్	లక్నో	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 30	అఫ్గానిస్తాన్ x శ్రీలంక	పుణే	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 31	పాకిస్తాన్ x బంగ్లాదేశ్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 1	న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	పుణే	మ.గం. 2 నుంచి
నవంబర్ 2	భారత్ x శ్రీలంక	ముంబై	మ.గం. 2 నుంచి
నవంబర్ 3	నెదర్లాండ్స్ x అఫ్గానిస్తాన్	లక్నో	మ.గం. 2 నుంచి
నవంబర్ 4	న్యూజిలాండ్ x పాకిస్తాన్	బెంగళూరు	ఉ.గం. 10:30 నుంచి
నవంబర్ 4	ఇంగ్లండ్ xఆస్ట్రేలియా	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
నవంబర్ 5	భారత్ x దక్షిణాఫ్రికా	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 6	బంగ్లాదేశ్ x శ్రీలంక	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
నవంబర్ 7	ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	ముంబై	మ.గం. 2 నుంచి
నవంబర్ 8	ఇంగ్లండ్ x నెదర్లాండ్స్	పుణే	మ.గం. 2 నుంచి
నవంబర్ 9	న్యూజిలాండ్x శ్రీలంక	బెంగళూరు	మ.గం. 2 నుంచి
నవంబర్ 10	దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
నవంబర్ 11	ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	పుణే	ఉ.గం. 10:30 నుంచి
నవంబర్ 11	ఇంగ్లండ్ x పాకిస్తాన్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 12	భారత్ x నెదర్లాండ్స్	బెంగళూరు	మ.గం. 2 నుంచి
నవంబర్ 15	తొలి సెమీఫైనల్	ముంబై	మ.గం. 2 నుంచి
నవంబర్ 16	రెండో సెమీఫైనల్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 19	ఫైనల్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి

నోట్: డే-నైట్ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతాయి. డే మ్యాచ్‌లు ఉదయం గం. 10:30 నుంచి జరుగుతాయి.
● సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే కేటాయించారు. ● లీగ్ దశ ముగిశాక టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుతాయి. టాప్ ర్యాంక్‌లో నిలిచన జట్టు నాలుగో స్థానంలో నిలిచిన జట్టుతో తొలి సెమీఫైనల్లో... రెండో ర్యాంక్‌లో నిలిచిన జట్టు మూడో స్థానంలో నిలిచిన జట్టుతో రెండో సెమీఫైనల్లో తలపడతాయి. ● మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ చానెల్స్‌లో, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

'భారత్, ఇంగ్లండ్ నా ఫేవరెట్‌లు'

గౌతమ్ గంభీర్

ఒక గొప్ప ఉత్సవానికి సిద్ధమవుతున్న తరుణంలో దానికి పూర్తిగా ముగింపు పలకాలనే వార్తలు కూడా వినిపిస్తుండటం దురదృష్టకరం. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇస్తూ గొప్ప ఘనతల గురించి చెప్పి భావోద్వేగాలకు గురి చేసి ఇక మీ సమయం ముగిసిందని చెప్పడం ఎలాగో ఇదీ అలాగే ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఇదే చివరి ప్రపంచకప్ అంటూ కొందరు చేతకాని, దూరదృష్టి లేని, బద్ధకస్తులైన క్రికెట్ పరిపాలకులు అంటున్నారు. నాకు తెలిసి అన్ని మార్పుల్లాగే ఈతరం వారి కోసం వన్డేలకు కూడా కొన్ని మార్పులతో హంగులు అద్దడం అవసరం. టి20ల్లో ఒక్కసారి దెబ్బ పడితే కోలుకునే అవకాశం ఉండదు. కానీ వన్డేల్లో అలా కాదు. ఒక బౌలర్ ఆరంభంలో భారీగా పరుగులిచ్చినా చివర్లో మళ్లీ ప్రతీకారం తీర్చుకోవచ్చు. వన్డేల్లో కెప్టెన్లు ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలో రాబోయే వరల్డ్‌కప్‌లో మనం చూడబోతున్నాం. గిల్, సిరాజ్, శ్రేయస్‌లాంటివారిని అభిమానులకు మరింత చేరువ చేయాల్సి ఉంది. బౌలర్లు బాగా ప్రభావం చూపించడాన్ని మనం గుర్తించాలి. ఇటీవల ఆసియా కప్‌లో సిరాజ్, బుమ్రా కలిసి శ్రీలంకను 50 పరుగులకు కుప్పకూల్చడం చూసి చాలా సంతోషం వేసింది. అలాంటి అద్భుత బౌలింగ్‌నూ చూడాలని అభిమానులు అనుకుంటారు. ఈ తరహాలో బ్యాట్‌కు, బంతికి మధ్య సమతూకం ఉంచేందుకు వరల్డ్ కప్ నిర్వాహకులకు ఇదే సరైన అవకాశం. భారత జట్టు బాగా ఆడటం కూడా దీనికి మేలు చేస్తుంది. నా దృష్టిలో టైటిల్ గెలిచేందుకు భారత్, ఇంగ్లండ్‌లకు మంచి అవకాశం ఉంది. మంచు ప్రభావం ఉన్నప్పుడు బుమ్రా ఎలా బౌలింగ్ చేస్తాడనేది ఆసక్తికరం. వరల్డ్ కప్ జరిగే ఇతర నగరాల్లోనూ ఇలాగే ఉండటం మంచి విషయం. ప్రపంచకప్ జరిగే సమయంలోనే దసరా, దీపావళి వస్తున్నాయి. ఆ సమయంలో బాణసంచా కాల్చకుండా వన్డే క్రికెట్‌లో బంతి, బ్యాట్ శబ్దాలు వినగలిగితే చాలు.

స్క్వాష్‌లో రెండు స్వర్ణాలపై గురి

ఆసియా క్రీడల స్క్వాష్ ఈవెంట్‌లో భారత్ రెండు స్వర్ణ పతకాలపై గురి పెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్–హరీందర్‌పాల్ జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లగా... భారత్‌కే చెందిన అనాహత్ సింగ్–అభయ్ సింగ్ జంట సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో సౌరవ్ ఘోషాల్ కూడా తుది పోరుకు అర్హత సాధించాడు.

క్వార్టర్స్‌లో సింధు, ప్రణయ్

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ ఈవెంట్ సింగిల్స్ విభాగాల్లో భారత స్టార్స్ పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... కిడాంబి శ్రీకాంత్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సింధు 21–16, 21–16తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా)పై ప్రణయ్ 21–12, 21–13తో దిమిత్రీ పనారిన్ (కజకిస్తాన్)పై నెగ్గారు. శ్రీకాంత్ 16–21, 17–21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

13 ఏళ్ల తర్వాత పతకం



ఆసియా క్రీడల రెజ్లింగ్‌లో పురుషుల గ్రీకో రోమన్ శైలిలో 13 ఏళ్ల తర్వాత భారత్‌కు మళ్లీ పతకం లభించింది. 87 కేజీల విభాగంలో సునీల్ కుమార్ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. కాంస్య పతక బౌట్‌లో సునీల్ 2–1తో అతాబెక్ అజీస్‌బెకోవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన జ్ఞానేందర్ (60 కేజీలు), నీరజ్ (67 కేజీలు), వికాస్ (77 కేజీలు) తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. చివరిసారి 2010 గ్వాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత గ్రీకో రోమన్ రెజ్లర్లు రవీందర్ సింగ్ (60 కేజీలు), సునీల్ కుమార్ రాణా (66 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

భళా భారత్...

● ఆసియా క్రీడల చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు
● 81 పతకాలతో 2018 ఏషియాడ్ ప్రదర్శనను దాటిన భారత్
● 11వ రోజు 12 పతకాలతో అదరగొట్టిన భారత క్రీడాకారులు
● టైటిల్ నిలబెట్టుకున్న జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా
● ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ–ఓజస్ జోడీకి స్వర్ణం



నీరజ్ చోప్రా

పతకాల్లో తొలిసారి 'సెంచరీ' దాటాలనే లక్ష్యంతో చైనా గడ్డపై అడుగుపెట్టిన భారత క్రీడా బృందం ఈ క్రమంలో ఆసియా క్రీడల చరిత్రలోనే తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ క్రీడలు ముగియడానికి మరో నాలుగు రోజులు ఉండగా... ఇప్పటికే భారత్ ఖాతాలో 81 పతకాలు చేరాయి. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ అత్యధికంగా 70 పతకాలు సాధించింది. పోటీల 11వ రోజు భారత్ మూడు స్వర్ణాలు, ఐదు రజతాలు, నాలుగు కాంస్యాలతో కలిపి 12 పతకాలు సొంతం చేసుకుంది. మారథాన్ రేసుతో నేడు అథ్లెటిక్స్ ఈవెంట్స్‌కు తెర పడనున్న నేపథ్యంలో... ఆర్చరీ, క్రికెట్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, స్క్వాష్, బ్రిడ్జ్, చెస్ క్రీడాంశాల్లో భారత్ ఎన్ని పతకాలు సాధిస్తుందో వేచి చూడాలి.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	171	94	51	316
జపాన్	37	51	59	147
దక్షిణ కొరియా	33	45	70	148
భారత్	18	31	32	81
ఉజ్బెకిస్తాన్	16	16	22	54
చైనీస్ తైపీ	12	14	20	46
థాయ్‌లాండ్	10	12	24	46
ఉత్తర కొరియా	9	11	8	28
బహ్రెయిన్	9	1	5	17
హాంకాంగ్	7	15	28	50

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

హాంగ్జౌ: భారత అథ్లెటిక్స్ 'పోస్టర్ బాయ్' నీరజ్ చోప్రా ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో మెరిశాడు. సహచరుడు కిశోర్ కుమార్ జేనా నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురుకావడంతో నీరజ్ చోప్రా నుంచి ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన బయటకు వచ్చింది. బుధవారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో స్వర్ణ, రజత పతకాలు భారత్ ఖాతాలోకి వెళ్లాయి. డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 88.88 మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. కిశోర్ కుమార్ జేనా జావెలిన్‌ను తన మూడో ప్రయత్నంలో 86.77 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానానికి వచ్చాడు. అయితే నీరజ్ చోప్రా తన నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 88.88 మీటర్ల దూరం విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ త్రో నమోదు చేశాడు. అంతేకాకుండా స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. కిశోర్ నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 87.54 మీటర్ల దూరం విసిరి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందినా నీరజ్ దూరాన్ని దాటలేకపోయాడు. తర్వాతి రెండు ప్రయత్నాల్లో కిశోర్ ఫౌల్ చేసి పాల్గొన్న తొలి ఆసియా క్రీడల్లోనే రజత పతకం గెలిచి సంబరపడ్డాడు. మరోవైపు ఈ ప్రదర్శనతో నీరజ్ వరుసగా రెండు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు గెలిచిన రెండో జావెలిన్ త్రోయర్‌గా గుర్తింపు పొందాడు. గతంలో పాకిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ నవాజ్ (1951, 1954) ఈ ఘనత సాధించాడు. రజత పతకం నెగ్గిన ఒడిశా ప్లేయర్ కిశోర్ కుమార్‌కు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ. ఒక కోటీ 50 లక్షలు నజరానా ప్రకటించారు.


హర్‌మిలన్

61 ఏళ్ల తర్వాత రిలేలో స్వర్ణం

పురుషుల 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో మొహమ్మద్ అనస్, అమోజ్ జేకబ్, అజ్మల్, రాజేశ్ రమేశ్‌లతో కూడిన భారత బృందం స్వర్ణ పతకం గెలిచింది. భారత బృందం 3ని:01.58 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి ఈ విభాగంలో 61 ఏళ్ల తర్వాత భారత్‌కు మళ్లీ పసిడి పతకాన్ని అందించింది. 1962 ఆసియా క్రీడల్లో మిల్కా సింగ్, మఖన్ సింగ్, దల్జీత్ సింగ్, జగదీశ్ సింగ్ బృందం చివరిసారి 4x400 మీటర్ల రిలేలో భారత్‌కు బంగారు పతకాన్ని అందించింది. మరోవైపు ఐశ్వర్య మిశ్రా, శుభ వెంకటేశ్, ప్రాచీ, విత్యా రామ్‌రాజ్‌లతో కూడిన భారత మహిళల జట్టు 4x400 మీటర్ల రిలేలో రజత పతకంతో (3ని:27.85 సెకన్లు) సరిపెట్టుకుంది. పురుషుల 5000 మీటర్ల విభాగంలో అవినాశ్ సాబ్లే (13ని:21.09 సెకన్లు) రజత పతకం గెలిచాడు. మహిళల 800 మీటర్ల ఫైనల్ రేసును భారత అథ్లెట్ హర్‌మిలన్ బైన్స్ 2ని:03.75 సెకన్లలో పూర్తి చేసి రజత పతకం కైవసం చేసుకుంది. 35 కిలోమీటర్ల నడక మిక్స్‌డ్ విభాగంలో మంజు రాణి, రాంబాబు జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది.


స్వర్ణ పతకాలతో భారత 4x400 రిలే జట్టు సభ్యులు రాజేశ్, అమోజ్, అజ్మల్, అనస్

సురేఖ-ఓజస్ జోడీకి స్వర్ణం



ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ–ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే (భారత్) జోడీ స్వర్ణ పతకాన్ని సాధించింది. ఫైనల్లో జ్యోతి సురేఖ–ఓజస్ ప్రవీణ్ జంట 159–158తో సో చేవన్–జేహూన్ జూ (దక్షిణ కొరియా) ద్వయంపై గెలిచింది. అంతకుముందు సురేఖ–ఓజస్ సెమీఫైనల్లో 159–154తో కజకిస్తాన్ జోడీపై, క్వార్టర్ ఫైనల్లో 158–155తో మలేసియా జంటపై విజయం సాధించింది. మరోవైపు బ్రిడ్జ్ క్రీడాంశంలో పురుషుల టీమ్ విభాగంలో భారత జట్టు ఫైనల్‌కు చేరి కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకోగా... చెస్‌లో భారత పురుషుల, మహిళల జట్లు రెండో స్థానంలో కొనసాగుతూ పతకాల రేసులో ఉన్నాయి.

'పసిడి'కి విజయం దూరంలో...

ఫైనల్లో భారత పురుషుల హాకీ జట్టు



పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు... ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచేందుకు భారత పురుషుల హాకీ జట్టు విజయం దూరంలో నిలిచింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 5–3 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై కష్టపడి గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ తరఫున హార్దిక్ సింగ్ (5వ ని.లో), మన్‌దీప్ సింగ్ (11వ ని.లో), లలిత్ కుమార్ ఉపాధ్యాయ్ (15వ ని.లో), అమిత్ రోహిదాస్ (24వ ని.లో), అభిషేక్ (54వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. కొరియా తరఫున మన్‌జె జుంగ్ (17వ, 20వ, 42వ ని.లో) 'హ్యాట్రిక్'తో మూడు గోల్స్ చేసినా ఫలితం లేకపోయింది. శుక్రవారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో భారత్ తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో జపాన్ 3–2తో చైనాను ఓడించింది. భారత్ 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించగా... 2018 జకార్తా ఏషియాడ్‌లో కాంస్యంతో సరిపెట్టుకుంది.

లవ్లీనా రజతంతో సరి...



ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత పోరాటం ముగిసింది. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా బొర్గొహైన్ రజత పతకంతో సరిపెట్టుకుంది. లీ కియాన్ (చైనా)తో జరిగిన ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ లవ్లీనా 0–5తో ఓడిపోయింది. మహిళల 57 కేజీల విభాగం సెమీఫైనల్లో పర్వీన్ హుడా 0–5తో లిన్ యు టింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయి కాంస్య పతకం సాధించింది. ఈ ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు ఒక రజతం, నాలుగు కాంస్యాలు గెలిచారు. 2018 ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు ఒక స్వర్ణం, ఒక కాంస్యం నెగ్గారు.



రాష్ట్ర ఓటర్లు 3,17,17,389

కొత్త ఓటర్లు 17,01,087 మంది

- 6,10,694 మంది ఓటర్ల తొలగింపు
- 18-19 ఏళ్ల యువఓటర్లు 8,11,640 మంది
- 119 అసెంబ్లీ నియోజకవర్గాల తుదిఓటర్ల జాబితా విడుదల.. పూర్తి వివరాలు వెల్లడించిన సీఈఓ వికాస్‌రాజ్

పురుషులు 1,58,71,493 మంది

మహిళలు 1,58,43,339 మంది

ట్రాన్స్‌జెండర్లు 2557 మంది

సాక్షి, హైదరాబాద్‌: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,17,17,389 కాగా, ఇందులో 1,58,71,493మంది పురుషులు, 1,58,43,339మంది మహిళలు, 2557 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రెండో ప్రత్యేక సవరణ చేపట్టారు. ఆ తర్వాత రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల తుదిఓటర్ల జాబితాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానఅధికారి(సీఈఓ) వికాస్‌రాజ్‌ బుధవారం ప్రకటించారు. 2023 జనవరితో పోల్చితే తుది ఓటర్ల జాబితాలో మొత్తం 5.8 శాతం ఓటర్లు పెరిగారు. రాష్ట్రంలో 15,338 మంది సర్వీసు ఓటర్లు, 2780 మంది ప్రవాస ఓటర్లున్నారు. 18–19 ఏళ్ల వయసు గల 5,32,990 మంది యువఓటర్లు కొత్తగా నమోదు చేసుకున్నారు. దీంతో 18–19 ఏళ్ల వయస్సు గల ఓటర్ల సంఖ్య 8,11,640కి చేరింది. దీంతో జాబితాలో యువ ఓటర్ల శాతం 2.56 శాతానికి పెరిగింది.

ఓటర్ల జాబితా రెండో సవరణలో చివరి గడువు సెప్టెంబర్‌ 19 నాటికి 57,617 దరఖాస్తులను పరిష్కరించామని, త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో అర్హులైన వారికి ఓటుహక్కు కల్పించామని సీఈఓ వికాస్‌రాజ్‌ ప్రకటించారు. కొత్తగా 17,01,087 మంది ఓటర్లు జాబితాలో చోటు పొందగా, 6,10,694 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. 5,80,208 మంది ఓటర్లు పేరు, ఇతర వివరాలు సరిదిద్దుకోవడం లేదా కొత్త

కొత్త ఓటర్లు 17,01,087 మంది

చిరునామాకు ఓటు బదిలీ చేసుకున్నారు. స్త్రీ, పురుష ఓటర్ల మధ్య లింగ నిష్పత్తి 992 నుంచి 998కి మెరుగుపడిందని సీఈఓ వికాస్‌రాజ్‌ తెలిపారు. 18–19 ఏళ్ల వయసు గల ఓటర్ల మధ్య లింగ నిష్పత్తి 707 నుంచి 743కి మెరుగైందన్నారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్ల సంఖ్య 43,943కి, దివ్యాంగ ఓటర్ల సంఖ్య 5,06,493కి, థర్డ్‌జెండర్‌ ఓటర్ల సంఖ్య 2557కి పెరిగిందన్నారు.

ఓటర్ల నమోదుకు ఇంకా అవకాశం



కొత్త ఓటర్ల నమోదు నిరంతరంగా కొనసాగుతుందని, 2023 అక్టోబర్‌ 1తో 18 ఏళ్లు నిండిన వారు, గతంలో దరఖాస్తు చేసుకోనివారు దరఖాస్తు చేసుకోవచ్చని సీఈఓ వికాస్‌రాజ్‌ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు 10 రోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకుంటే, అర్హులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పిస్తామన్నారు. https://voters.eci.gov.in/ వెబ్‌సైట్‌/ఓటర్‌ హెల్ప్‌లైన్‌ యాప్‌/బీఎల్‌ఓ ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని, తమ పోలింగ్‌స్టేషన్, పేరు, ఇతర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లు ఉంటే ఫారం–8 దరఖాస్తు ఆన్‌లైన్‌/ యాప్‌/బీఎల్‌ఓ ద్వారా సమర్పించాలని సూచించారు. ఏమైనా ఫిర్యాదులుంటే ఓటరు హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1950కి సంప్రదించాలన్నారు.

4లక్షల ఓటర్ల చిరునామాలు మార్పు

ఒకే ఇంట్లో 6 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే స్వయంగా ఇళ్లకు వెళ్లి ఓటర్లను ధ్రువీకరించే కసరత్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 4,15,824 మంది ఓటర్ల చిరునామాలు సవరించారు. 3,94,968 మంది ఓటర్లను ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక పోలింగ్‌ కేంద్రం నుంచి మరో కేంద్రానికి, 64,661 మంది ఓటర్లను ఒక అసెంబ్లీ స్థానం నుంచి మరో స్థానానికి బదిలీ చేశారు. ఈఆర్వో నెట్‌ ద్వారా 73,364 మంది ఓటర్ల చిరునామాలు, ఇళ్ల నంబర్లు సవరించారు. 4605 బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్‌ కమ్యూనిటీల్లో 757 బృందాలు తనిఖీ చేసి కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణకు 50,907 దరఖాస్తులు స్వీకరించి వారికి ఓటుహక్కు కల్పించాయి.

రెండేళ్లలో 22 లక్షల ఓటర్ల తొలగింపు

ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా గత రెండేళ్లలో 22,02,168 మంది చనిపోయిన, డూప్లికేట్, వలస పోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఇందులో 4,89,574 మంది ఓటర్లు జీహెచ్‌ఎంసీ పరిధిలోని వారే. ఈ ఏడాది 2,47,756 మంది చనిపోయిన ఓటర్లను తొలగించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు తీవ్రంగా శ్రమించామని, 14,24,694 ఓటర్ల వివరాలను సవరించామని సీఈఓ తెలిపారు.

అప్పుడు ఓటర్లు ఇలా...

గత ఆగస్టు 21న ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 1,53,73,066 మంది పురుషులు, 1,52,51,797 మంది మహిళలు, 2,133 మంది థర్డ్‌ జెండర్లు మొత్తం కలిపి రాష్ట్రవ్యాప్తంగా 3,06,42,333 ఓటర్లు ఉన్నారు. మరో 2,742 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, 15,337 మంది సర్వీసు ఓటర్లు ముసాయిదాలో ఉన్నారు. 18–19 వయస్సు కలిగిన యువ ఓటర్ల సంఖ్య 4,76,597.

- ఓటర్ల జాబితా తొలి ప్రత్యేక సవరణ కార్యక్రమం 2023లో భాగంగా గత జనవరి 5న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో మొత్తం 2,99,77,659 మంది ఓటర్లు ఉండగా, రెండో సవరణ నాటికి 3,17,32,727 మందికి పెరిగారు.

క్లుప్తంగా...

జెన్‌కోలో 339 ఏఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో)లో 339 అసిస్టెంట్‌ ఇంజనీర్‌(ఏఈ), 60 కెమిస్ట్‌ పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం సంస్థ యాజమాన్యం ప్రకటన జారీ చేసింది. సమగ్ర నోటిఫికేషన్‌ను సంస్థ వెబ్‌సైట్‌ (https://tsgenco.co.in)లో గురువారం నుంచి అందుబాటులో ఉంచనున్నారు. కేటగిరీల వారీగా పరిశీలిస్తే ఏఈ(ఎలక్ట్రికల్‌) పోస్టులు 187, ఏఈ(మెకానికల్‌) పోస్టులు 77, ఏఈ(ఎలక్ట్రానిక్స్‌) పోస్టులు 25, ఏఈ(సివిల్‌) పోస్టులు 50 కలిపి మొత్తం 339 ఏఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ ఇచ్చారు. సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్‌ డిగ్రీ కలిగిన అభ్యర్థులు ఏఈ పోస్టులకు అర్హులు కాగా, కెమిస్ట్రీ లేదా ఎన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌లో ప్రథమ శ్రేణి ఎంఎస్సీ డిగ్రీ కలిగిన వారు కెమిస్ట్‌ పోస్టులకు అర్హులు కానున్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న యాదాద్రి, భద్రాద్రి విద్యుత్‌ కేంద్రాల నిర్వహణతో పాటు ఇప్పటికే ఉన్న పాత విద్యుత్‌ కేంద్రాల అవసరాల కోసం ఈ పోస్టులను భర్తీ చేస్తున్నట్టు సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

స్కిల్‌ కోర్సులకు మంచి డిమాండ్‌ : ప్రొ. లింబాద్రి



సాక్షి, హైదరాబాద్‌: డిగ్రీ విద్యను అభ్యసించే సమయంలోనే ఉపాధి అవకాశాలున్న సెక్టార్‌ స్కిల్‌ కోర్సులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ ఆర్‌.లింబాద్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, సీఆర్‌ఐఎస్‌పీ, సెక్టార్‌ స్కిల్‌ కౌన్సిల్‌ సంయుక్త నిర్వహణలో 2023–24 సంవత్సరం నుంచి డిగ్రీ స్థాయిలో సెక్టార్‌ స్కిల్‌ కోర్సులను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా బీబీఏ రిటైల్‌ ఆపరేషన్స్‌ కోర్సును బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ...బీబీఏ రిటైల్‌ కోర్సులో 17 కాలేజీల్లో 600 మందికిపైగా విద్యార్థులు చేరారన్నారు.

11, 12 తేదీల్లో ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 11, 12 తేదీలలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్‌ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. పూర్తి వివరాలకు www.osmania. ac.in వెబ్‌సైట్‌ చూడవచ్చు.

కేఎల్‌ వర్సిటీ విద్యార్థులకు రూ.50 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు



బంజారాహిల్స్‌ (హైదరాబాద్‌): క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌లో కేఎల్‌ డీమ్డ్‌ యూనివర్సిటీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ జి.పార్థసారథి వర్మ అన్నారు. అమెరికాకు చెందిన నుటానిక్స్‌ అనే కంపెనీలో రూ.50.57 లక్షల వార్షిక జీతంతో కూడిన ఉద్యోగాలకు తమ యూనివర్సిటీకి చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికై మరోసారి రికార్డు సృష్టించారన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం.5లోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్‌ కమ్యూనికేషన్స్‌ ఇంజినీరింగ్‌ చివరి ఏడాది పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు ఈ జీతానికి ఉద్యోగాలు దక్కించుకున్నారన్నారు. అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు ఎం.సుజిత లక్ష్మి, రంగు ఉషశ్రీ, ఎం.జాహ్నవి లక్ష్మి, వి.శ్రావ్య చందన, హర్షిణి, హారిక, విద్యశ్రీలను ఈ సందర్భంగా అభినందించారు.

'మనూ' దూరవిద్యా ప్రవేశాల చివరి తేదీ పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్‌ ఆఫ్‌ డిస్టెన్స్‌ ఎడ్యుకేషన్‌ (డీడీఈ) ద్వారా దూర విద్యా ప్రవేశాల కోసం చివరి తేదీని అక్టోబర్‌ 20 వరకు పొడిగించినట్లు డీడీఈ డైరెక్టర్‌ మహ్మద్‌ రజావుల్లాఖాన్‌ బుధవారం తెలిపారు. 2023–24 అకడమిక్‌ సెషన్‌ కోసం ఓపెన్, డిస్టెన్స్‌ లెర్నింగ్‌ ప్రోగ్రామ్‌ల కోసం అడ్మిషన్ల తేదీని పెంచామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్‌ స్టడీస్, బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం స్టూడెంట్‌ సపోర్ట్‌ యూనిట్‌ హెల్ప్‌లైన్లు 040–23008463 లేదా 040–23120600 (ఎక్స్‌టెన్షన్‌ 2207, 2208)లో సంప్రదించాలని సూచించారు.

రిటైర్‌మెంట్‌ ప్యాకేజీ డబుల్‌!

- అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ. లక్ష ఆర్థిక సాయం
- 5 శాతం ఐఆర్, పీఆర్‌సీ ప్రకారం వేతన పెంపునకు హామీ
- మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్‌లతో జేఏసీ నేతల భేటీ
- ముఖ్యమంత్రికి వివరించిన తర్వాత నిర్ణయమని స్పష్టీకరణ
- సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించిన అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ

సాక్షి, హైదరాబాద్‌: ఎట్టకేలకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె విరమించారు. పలురకాల డిమాండ్ల సాధనలో భాగంగా గత నెల 11న ప్రారంభమైన సమ్మె 24 రోజులు కొనసాగింది. పదవీవిరమణ ప్యాకేజీ మొదలు, కనీస వేతనం, బీమా, పదోన్నతులు, ఇతర వృత్తిపరమైన అంశాలపై అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండుసార్లు ప్రభుత్వంతో చర్చలు జరిగినా, ఫలించకపోవడంతో సమ్మె కొనసాగింది. బుధవారం మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్‌లతో అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ నేతలు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా పలు సమస్యలు పరిష్కరిస్తామంటూ మంత్రులు హామీ ఇచ్చారు. దీంతో సమ్మె విరమిస్తున్నట్టు జేఏసీ నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు.

మంత్రుల హామీ: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ ప్యాకేజీని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇందులో భాగంగా టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేలు చొప్పున రిటైర్‌మెంట్‌ సమయంలో సాయం అందిస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెకు దిగారు. తాజాగా జరిగిన చర్చల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష చొప్పున సాయం అందిస్తామని మంత్రులు జేఏసీ నేతలకు హామీ ఇచ్చారు.

- ఉద్యోగులకు వేతనంలో 5శాతం ఐఆర్‌ కింద పెంపు, పీఆర్‌సీ ప్రకారం వేతనాల పెంపు, ఇన్సూరెన్స్‌ రూ.2 లక్షలు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లకు ప్రధాన అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించడం, అదనపు యాప్‌ల రద్దు, పెండింగ్‌లోఉన్న ఇంటి అద్దె చెల్లింపులు, గ్యాస్‌ బిల్లులు, సమ్మెకాలంలో ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని జేఏసీ నేతలు కోరారు. దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో జేఏసీ నేతలు సమ్మె విరమిస్తున్నట్టు స్పష్టం చేశారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ

అంగన్‌వాడీల సమ్మె విరమిస్తున్నట్టు అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ నేతలు ప్రకటించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహిరంగసభలో ఈ మేరకు వారు ఆ ప్రకటన చేశారు. అంగన్‌వాడీల సమస్యలు, ఉద్యోగ బెనిఫిట్స్‌పై ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తామని మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్‌ స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జేఏసీ నేతలు పి.జయలక్ష్మి, పాలడుగు భాస్కర్, ఎస్‌.వీరయ్య, భూపాల్, జె.వెంకటేష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కరుణకుమారి, యూసుఫ్, ఈశ్వర్, సమ్మయ్య, సీతామహాలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వేలాదిగా అంగన్‌వాడీ ఉద్యోగులు తరలివచ్చారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు ఆయా పరిసరాలన్నీ వారితో పూర్తిగా నిండిపోయాయి.

విషజ్వరాలపై కదిలిన వైద్యారోగ్య శాఖ

ములుగు జిల్లా ఒడిశా కాలనీలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు • 'సాక్షి'కథనానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సాక్షి ఎఫెక్ట్‌

మంగపేట: ఏజెన్సీలో విజృంభిస్తున్న విషజ్వరాలపై వైద్యారోగ్య శాఖ యంత్రాంగం కదిలింది. డెంగీ, ఇతర జ్వరాలపై బుధవారం 'సాక్షి'ప్రధాన సంచికలో 'జ్వరం.. వణుకుతున్న జనం'శీర్షికన ప్రచురితమైన కథనానికి ములుగు జిల్లా కలెక్టర్‌ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య స్పందించారు. జిల్లాలోని వైద్యాధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించి పలు ఆదేశాలు చేశారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు మంగపేట మండలం కమలాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఒడిశా కాలనీలో వైద్యబృందం పర్యటించింది. కాలనీకి చెందిన బోయ అజయ్, మరియమ్మ దంపతుల కుమార్తె అక్షర(03) విషజ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విషజ్వరాలను అరికట్టేందుకు ఆ కాలనీలో ముగ్గురు వైద్యాధికారులు, ఐదుగురితో కూడిన పారామెడికల్‌ టీం, మరో 9 మంది ఏఎన్‌ఎంలు, సిబ్బందితో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 37 మంది జ్వరపీడితులను గుర్తించారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించి 15 మందిని ములుగు ఏరియా ఆస్పత్రికి రెఫర్‌ చేశారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి ర్యాపిడ్‌ ఫీవర్‌ సర్వే నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించడం, కలుషిత నీటిని తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడంతో ప్రజలు, చిన్న పిల్లలు విషజ్వరాల బారినపడినట్లు వైద్యులు తెలిపారు. వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న పరిస్థితిని వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్కడ చదివినా బీసీ విద్యార్థులకు 'ఫీజు రీయింబర్స్‌'

కొత్తగా అవకాశమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
ఐఐటీ, ఐఐఎం, ఎన్‌ఐటీ, ఎయిమ్స్, బిట్స్‌ ఇలా దేశవ్యాప్తంగా 200లకు పైగా విద్యాసంస్థల ఎంపిక

సాక్షి, హైదరాబాద్‌: దేశంలో ఎక్కడ చదివినా సరే బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రాష్ట్రప్రభుత్వం కొత్తగా అవకాశం ఇచ్చింది. ఇప్పటివరకు రాష్ట్ర పరిధిలోని విద్యాసంస్థల్లో ఉన్నతవిద్య చదువుతున్న వారికే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ అమలుచేస్తోంది. తాజాగా దేశంలో ఏ ప్రాంతంలో ఉన్న ఐఐటీ, ఐఐఎం, ఎన్‌ఐటీ, ఎయిమ్స్, బిట్స్‌ తదితర ఇనిస్టిట్యూట్లు, ప్రఖ్యాత యూనివర్సిటీలు, ఇతర కేంద్రీయ విద్యాసంస్థల్లో చదివే బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అమలు చేస్తున్న విధంగా బీసీ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని అమలు చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఏటా రూ.2లక్షల వరకు..

కేంద్ర విద్యాశాఖ, కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ అనుమతి పొందిన వర్సిటీలు, విద్యాసంస్థల్లో చదివే బీసీ విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. 2023–24 విద్యా సంవత్సరం నుంచే దీనిని అమలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈపాస్‌ తెలంగాణ వెబ్‌సైట్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలి. ఇందుకు సంబంధించి సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, సెంటర్‌ ఫర్‌ గుడ్‌ గవర్నెన్స్‌ డైరెక్టర్‌ జనరల్‌ను ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఆదేశించారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థికి రూ.2లక్షల వరకు గరిష్టంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఏటా రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఒకవేళ నిర్దేశించిన మొత్తం కంటే ఫీజు తక్కువగా ఉంటే ఆమేరకు నిధులు కాలేజీకి విడుదల చేస్తారు. ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, కాలేజీలు, ఫీజులు తదితర పూర్తి సమాచారాన్ని అతి త్వరలో ఈపాస్‌ వెబ్‌సైట్‌లోకి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖను ఆదేశించింది. దూరవిద్య, పార్ట్‌టైమ్‌ పద్ధతిలో అభ్యసించే విద్యార్థులకు ఈ పథకం వర్తించదు.

9న టీసీఆర్‌టీఐ భవన ప్రారంభం!

సాక్షి, హైదరాబాద్‌

ట్రైబల్‌ కల్చర్‌ రీసెర్చ్‌ అండ్‌ ట్రైనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌ (టీసీఆర్‌టీఐ) భవనం ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఈ నెల 9వ తేదీన కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్‌ముండా చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు టీసీఆర్‌టీఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో టీసీఆర్‌టీఐ ప్రత్యేక విభాగంగా కొనసాగుతోంది. రాష్ట్రస్థాయిలో ఈ విభాగం గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోనే కొనసాగుతున్నప్పటికీ ప్రత్యేకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పక్కా భవన నిర్మాణానికి పూనుకుంది. 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణానికిగాను 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్లు విడుదల చేసింది. 2019లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే దాదాపు నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇలా చేసినపనులే మళ్లీ మళ్లీ చేస్తుండటంతో ఏళ్ల తరబడి పనులు కొనసాగుతూ వచ్చాయి. మొత్తానికి పనులను తుది దశకు తెచ్చిన అధికారులు.. ఈ నెల 9న ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మరో విడత పెండింగ్‌ డీఏ

ఈనెల వేతనంతో చెల్లించనున్నట్టు ప్రకటన

సాక్షి, హైదరాబాద్‌: ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన చివరి పెండింగ్‌ డీఏను కూడా చెల్లించనున్నట్టు సంస్థ ప్రకటించింది. 2023 జూలై విడతకు సంబంధించిన 4.8 శాతం కరువు భత్యాన్ని అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నట్టు ఆర్టీసీ బుధవారం ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకు ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న తొమ్మిది విడతల డీఏను విడతల వారీగా చెల్లించినట్టయింది. 2019 జూలై విడత నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు కరువు భత్యం పెంచటం లేదు. సంవత్సరానికి రెండు విడతలు చొప్పున 2023 జూలై వరకు మొత్తం 9 విడతల డీఏ పెంపు నిలిచిపోయింది. దీనిపై కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టడంతో ఏడాదిగా ఈ బకాయిల చెల్లింపును విడతల వారీగా చేపట్టారు. దాంతో వేతనాలు పెరగడంతో కార్మికులు, ఉద్యోగులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


బకాయిలు చెల్లించాల్సిందే: కార్మిక సంఘాలు

సాధారణంగా ఇలాంటి చెల్లింపులు జరిగినప్పుడు, ఎప్పటి నుంచి నిలిచిపోయిందో, ఆ రోజు నుంచి లెక్కగట్టి బకాయిలు చెల్లిస్తారు. కానీ, ఆర్టీసీ ఉద్యోగుల కరువు భత్యం విషయంలో అది జరగలేదు. ప్రతి సారి ఒక్కో విడత ప్రకటన చేస్తున్నా, చెల్లించాల్సి ఉన్న తేదీ నుంచి రావాల్సిన బకాయిలు మాత్రం ప్రకటించటం లేదు. దీనిపై కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఆర్టీసీ కార్మికులకు బకాయి ఉన్న 9 విడతల కరువు భత్యాన్ని చెల్లించినందుకు సంతోషంగా ఉంది. కానీ, బకాయిలు చెల్లించకపోవటం మాత్రం భావ్యం కాదు. వాటిని వెంటనే చెల్లించాలి'అని ఆర్టీసీ స్టాఫ్‌ అండ్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ కన్వీనర్‌ వీఎస్‌రావు డిమాండ్‌ చేశారు. ''బకాయి ఉన్న రెండు విడతల వేతన సవరణలు జరపటంతోపాటు, డీఏ బకాయిలు చెల్లించాలి'అని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్‌ నాగేశ్వరరావు కోరారు.

'కానిస్టేబుల్‌' తుది ఫలితాల వెల్లడి

మొత్తం పోస్టులు 16,604 | ఎంపిక చేసింది 15,750

- ఎంపికైన అభ్యర్థుల వివరాలు నేడు టీఎస్‌ఎల్పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో
- ఈనెల 12,13 తేదీల్లో అటెస్టేషన్‌ ఫారం సమర్పించాలి



సాక్షి, హైదరాబాద్‌: పోలీస్‌ కానిస్టేబుళ్ల ఎంపికకు సంబంధించిన తుది ఫలితాలు వెలువడ్డాయి. అన్ని పరీక్షల అనంతరం పోలీస్‌కానిస్టేబుళ్లగా ఎంపికైన వారి వివరాలు గురువారం ఉదయం టీఎస్‌ఎల్పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్‌ నియామకబోర్డు (టీఎస్‌ఎల్పీఆర్‌బీ) వెల్లడించింది. మొత్తం 13 కేటగిరీల్లో 16,604 కానిస్టేబుల్‌ పోస్టులకు నోటిఫికేషన్‌ వెలువడగా, దరఖాస్తు చేసుకున్న వారిలో 15,750 మందిని ఎంపిక చేసినట్టు టీఎస్‌ఎల్పీఆర్‌బీ చైర్మన్‌ వీవీ.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారిలో 12,866 మంది పురుషులుకాగా, 2,884 మంది మహిళలు ఉన్నారు. ఈ ఏడాది జూన్‌ 3, 4 వారాల్లో రాష్ట్రంలోని 18 కేంద్రాల్లో నిర్వహించిన సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌లో భాగంగా అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, స్థానికత, వయసు మినహాయింపు, ఇతర అంశాలు పరిశీలించామని, దీంతోపాటు శారీరక సామర్థ్య పరీక్ష, బ్రీద్‌ టెస్టు, తుది రాత పరీక్ష అనంతరం అన్నింటిని పరిగణనలోకి తీసుకొని వీరిని ఎంపిక చేసినట్టు ఆ ప్రకటనలో శ్రీనివాసరావు తెలిపారు. కోర్టు కేసులు, ఇతర సాంకేతిక కారణాలతో 854 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయలేదు.

అటెస్టేషన్‌ ఎలా చేయాలంటే...!

బోర్డు వెల్లడించిన ప్రకారం తుది ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అటెస్టేషన్‌ ఫారం తీసుకోవాలి. టీఎస్‌ఎల్పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల లాగిన్‌లో ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్‌ టెంప్లేట్‌ రూపంలో ఈ ఫారంలు అందుబాటులో ఉంటాయి. వీటిని డిజిటల్‌గా పూర్తిచేసిన తర్వాత పీడీఎఫ్‌ రూపంలో మూడు సెట్‌లు ప్రింట్‌లు ఏ4 సైజు పేపర్‌పై ఒకవైపు మాత్రమే తీసుకోవాలి. ఇలా తీసుకున్న మూడు సెట్‌లపై అభ్యర్థులు సంతకాలు చేసి, రెండు పాస్‌పోర్టు ఫొటోలు అతికించి, గెజిటెడ్‌ ఆఫీసర్‌తో ధ్రువీకరణ సంతకం తీసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం సంబంధిత డాక్యుమెంట్లను పొందుపరిచి ఈనెల 12,13 తేదీల్లో నిర్దేశిత కేంద్రాల్లో సమర్పించాలి.

- సివిల్, ఏఆర్‌ కానిస్టేబుళ్లు ఈనెల 12న ఎస్పీ/ కమిషనర్‌ కార్యాలయాల్లో,
- ఎస్పీఎఫ్, ఎస్‌ఏఆర్, మెకానిక్, ట్రాన్స్‌పోర్టు (హెచ్‌ఓ) కానిస్టేబుళ్లు ఈనెల 13న హైదరాబాద్‌ సిటీ పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో, మిగిలిన అభ్యర్థులు 13న ఆయా జిల్లాల ఎస్పీ, పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయాల్లో అటెస్టేషన్‌ ఫారంలు సమర్పించాలి.

సందేహాల నివృత్తికి అవకాశం

తుది రాత పరీక్షలు క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియలో సందేహాలు, వాటిని నివృత్తికి పోలీసు రిక్రూట్‌మెంట్‌ బోర్డు అవకాశం కల్పించింది. ఈనెల 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థుల లాగిన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. తెలంగాణ స్థానికులైన ఎస్సీ, ఎస్టీలు రూ.1000, ఇతరులు రూ.2000 ఫీజు చెల్లించాలి. కేవలం ఆన్‌లైన్‌ ద్వారానే ఎంపిక ప్రక్రియకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేసుకోవాల్సి ఉంటుందని, ఎలాంటి వ్యక్తిగత వినతులకు అవకాశం లేదని బోర్డు స్పష్టం చేసింది.

పోలీసు కానిస్టేబుల్‌ ఎంపిక వివరాలు ఇలా..

పోస్టు	నోటిఫైడ్‌ ఖాళీలు	ఎంపికైనవారు పురుషులు/ మహిళలు
సివిల్‌	4965	3298/1622
ఏఆర్‌	4423	2982/948
ఎస్‌ఏఆర్‌సీపీఎల్‌ (మెన్‌)	100	100/--
టీఎస్‌ఎస్‌పీ (మెన్‌)	5010	4725/--
స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ (మెన్‌)	390	382/--
ఫైర్‌మెన్‌	610	599/--
వార్డర్‌ (మేల్‌)	136	134/--
వార్డర్‌ (ఫిమేల్‌)	10	--/10
ఐటీ, కమ్యూనికేషన్స్‌	262	171/86
మెకానిక్‌ (మెన్‌)	21	21/--
ట్రాన్స్‌పోర్ట్‌ కానిస్టేబుల్‌ (హెచ్‌ఓ)	6	4/2
ట్రాన్స్‌పోర్ట్‌ కానిస్టేబుల్‌ (ఎల్‌సీ)	57	44/13
ఎక్సైజ్‌	614	406/203
మొత్తం	16604	12866/2884

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.